www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 5-5-2024 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 36 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి సా. 5.42 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 7.57 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ.6.51-8.18; దుర్ముహూర్తం: సా.4.51-5.42; అమృతఘడియలు: మ.3.35-5.02; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.50; సూర్యాస్తమయం: 6.32 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




ఆదివారం | 5-5-2024 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 36 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

"ఒక అద్భుతమైన లోకంలో మనం బతుకుతున్నాం. ఇక్కడ శాస్త్రవేత్తలు జ్యోతిష్యం మాట్లాడతారు. బాబాలు సైన్స్ బోధిస్తారు. పౌరాణికులు చరిత్ర రాస్తారు. సినీ నటులు భక్తిని వ్యాప్తి చేస్తారు. ధనవంతులు సాదా జీవనం గురించి పాఠాలు చెబుతారు. ప్రవాస భారతీయులు దేశాన్నెలా ప్రేమించాలో చెబుతారు. నేరగాళ్లు విలువలను బోధిస్తారు. రాజకీయ నాయకులు దేవుడి గురించి మాట్లాడతారు. దేవుడు మాత్రం నిశ్శబ్దం పాటిస్తాడు!" అని దేవులపల్లి కృష్ణ శాస్త్రి అనే రచయిత ఫేస్‌బుక్ పోస్ట్‌లో ఆవేదన చెందాడు. ఈయన ప్రసిద్ధ తెలుగు కవి స్వర్గీయ దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి మనవడు. ఇప్పుడు మన దేశంలోని పరిస్థితులను గమనించిన వారికి ఈ మాటలు అక్షర సత్యాలని అనిపించకమానదు.

## ఇక తేల్చుకోవాల్సింది జనమే!

తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టుగా నేరగాళ్లే రాజకీయ నాయకులుగా అవతరిస్తున్నారు. అయితే, ఒక తేడా ఉంది. సాధారణ దొంగ మీ వ్యక్తిగత సొమ్మును మాత్రమే దోచుకుంటాడు. రాజకీయ దొంగ మాత్రం మీ భవిష్యత్తును, జీవితాన్ని, వ్యాపారాన్ని కూడా దోచుకుంటాడు. విచిత్రం ఏమిటంటే, సాధారణ దొంగ ఎవరిని దోచుకోవాలో తానే నిర్ణయించుకుంటాడు. మనల్ని దోచుకొనే రాజకీయ దొంగను మాత్రం మనమే ఎంచుకుంటాము. వాడికోసం మనం పరస్పరం కొట్టుకు చస్తాం. ఇది మన సమాజంలో ఉన్న దౌర్భాగ్య పరిస్థితి.



రాజకీయ నాయకులు తమ ప్రయోజనాలకోసం దేవుడితోపాటు కులం, మతం, ప్రాంతాన్ని కూడా వాడుకుంటున్నారు. కులం కూడు పెట్టదని తెలిసినా ఆ కులం కోసమే కొట్టుకు చస్తున్నారు. ఎన్నికల్లో ఫలానా కులం వాళ్లకు అన్ని టికెట్లు ఇచ్చాం, ఇన్ని టికెట్లు ఇచ్చాం అని ప్రకటించుకోవడం చూస్తున్నాం.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కుల బలం లేదు. అందుకే ఆయన ప్రాంతీయ వాదం అందుకొని అందలం ఎక్కారు. గత ఎన్నికల్లో ప్రజలు ఆయనను ఓడించినప్పటికీ ఆత్మవిమర్శ చేసుకోకుండా తెలంగాణను పాలించే సత్తా తనకు తప్ప మరొకరికి లేదన్నట్టుగా ఆయన మాట్లాడుతున్నారు. కేసీఆర్ కూడా అధికారంలో ఉన్నప్పుడు యజ్ఞయాగాదులు నిర్వహించారు. యాదాద్రిని పునర్నిర్మించారు. అయినా దేవుడు కనికరించకుండా నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఫలితంగా కేసీఆర్ ఎన్నికల్లో ఓడిపోయారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ న్యాయ నిర్ణేతలు అని చెప్పుకొంటున్న మనమే పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు అదే ప్రజలను విస్మరిస్తాం. కేసీఆర్ కూడా ప్రజలను విస్మరించారు. అందుకే ఆయన అధికారం కోల్పోయారు. కులాలు, మతాలు, ప్రాంతాలు ఎన్నికల్లో పదే పదే ఉపయోగపడవు. 2014, 2018 ఎన్నికల్లో కేసీఆర్‌కు ఉపయోగపడిన ప్రాంతీయ వాదం 2023 ఎన్నికల్లో పనిచేయలేదు. వ్యవస్థలు పతనమైనప్పటికీ ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటు హక్కు ఇంకా పదిలంగానే ఉంది. అందుకే ఎంత అధికారం, ధనం ఉన్నప్పటికీ ఓటమి నుంచి కేసీఆర్ తప్పించుకోలేకపోయారు.

### కొత్త పలుకు

తెలంగాణలో ప్రస్తుతం ముక్కోణపు పోటీ జరుగుతోంది. ప్రధాన పోటీ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ మధ్యే కేంద్రీకృతమైనట్టు కనిపిస్తున్నప్పటికీ భారత రాష్ట్ర సమితి కూడా కొద్దో గొప్పో పుంజుకుంటోంది. బీఆర్ఎస్ బలపడేకొద్దీ ఆ ప్రభావం బీజేపీపైన పడుతుంది. అధికారంలో ఉన్నందున కాంగ్రెస్ బలం తగ్గే అవకాశాలు తక్కువ.

తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మత ప్రాతిపదికన ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వబోనని ప్రధాని మోదీ ప్రకటించారు. దీంతో ముస్లింలు అంతా కాంగ్రెస్ పార్టీకి అండగా సంఘటితం అయ్యారు. అదే సమయంలో హిందువులు బీజేపీకి అనుకూలంగా సంఘటితం అవుతారా? అంటే చెప్పలేం. తెలంగాణ సమాజాన్ని కూడా కులాల వారీగా విడదీసినందున హిందువులలో ఐకమత్యం రావడం కష్టం.

- ఆర్కే, విశ్లేషణ 4వ పేజీలో



ముషీరాబాద్ చౌరస్తాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్, పక్కన దానం, అనిల్‌కుమార్

### 8వ తేదీ నాటికి

# రైతు భరోసా పూర్తి

- ఇప్పటికే 65 లక్షల మంది రైతులకు ఇచ్చాం
- మిగిలిన 4 లక్షల మందికి ఈ నాలుగు రోజుల్లో..
- పంద్రాగస్టులోపే రూ.2 లక్షల రైతు రుణమాఫీ
- హామీ నిలబెట్టుకుంటే.. కేసీఆర్, హరీశ్ అమరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాస్తారా?
- కాంగ్రెస్ ఏమీ చెయ్యలేదంటున్న కేటీఆర్ చీర కట్టుకొని బస్సెక్కాలి.. టికెట్ అడిగితే ఒట్టు!
- బీజేపీ జాతీయ నేతనే రాజ్యాంగాన్ని మారుస్తామన్నారు.. చెప్పుతో ఎవరిని కొట్టాలి?
- చిన్నప్పుడు చిన్నారెడ్డి కోసం వాల్‌రైటింగ్ చేశా
- 70 ఏళ్ల తర్వాత పాలమూరు బిడ్డకు సీఎం పదవొస్తే అరుణమ్మకు కోపమెందుకు?
- కొత్తగూడెం, వనపర్తి, సికింద్రాబాద్, ముషీరాబాద్‌లో రోడ్‌షోలు, సభల్లో రేవంత్

కొత్తగూడెం, మహబూబ్‌నగర్, హైదరాబాద్ సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకం కింద ఇప్పటికే 65 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేశామని, మిగిలి ఉన్న నాలుగు లక్షల మంది రైతులకు ఈ నెల 8వ తేదీ నాటికి సాగు సాయం అందజేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రైతు భరోసా ఇవ్వడం లేదని దుష్ప్రచారం చేస్తున్నారని.. కానీ, తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన గత ఏడాది డిసెంబరు నెల నుంచే రైతుభరోసాను రైతన్నల అకౌంట్లలో వేయడం ప్రారంభించామని గుర్తు చేశారు. ఈ నెల 8వ తేదీ నాటికి మిగిలిన రైతులకు రైతుభరోసా డబ్బులు వేస్తామని, తద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 69 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7500 కోట్లు జమ చేసినట్లవుతుందని స్పష్టం చేశారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం

మిగతా 12వ పేజీలో...

**4 రోజుల్లో రూ.2 వేల కోట్లు!**

- 3 వేల కోట్ల రుణానికి ఆర్బీఐకి ఇండెంట్
- 7న మంజూరు కాగానే రైతుల ఖాతాల్లోకి
- సగం మందికి ఆసరా పెన్షన్ల చెల్లింపు
- మిగతా సగం మందికి నేడు పంపిణీ

14

### వేముల రోహిత్ కేసుపై పునర్విచారణ చేపడతాం

- ఆ కుటుంబానికి అండగా ఉంటాం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- న్యాయం చేయాలని సీఎంకు రోహిత్ తల్లి రాధిక వినతి 14

**నేడు నిర్మల్, గద్వాలలో రాహుల్ సభలు.. మళ్లీ 10వ తేదీన రాష్ట్రానికి కాంగ్రెస్ అగ్రనేత** 12

# 5 నెలల్లోనే వ్యతిరేకత పదేళ్ల



### కాంగ్రెస్ పాలనను ప్రజలు హర్షించడం లేదు

- ఒక్క ఉచిత బస్సు హామీ అమలే రెఫరెండమా?
- గ్యారంటీలపై సీఎం రేవంత్‌వి దొంగ నాటకాలు
- ఈ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం మాకు లేదు
- ఐదేళ్ల తరువాత ప్రజలే వాళ్లను తరిమికొడతారు
- వాళ్లే కూల్చుకుంటే నిలబెట్టాల్సిన అవసరమూ లేదు
- బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు కూడా రాదు
- ఒకటీ అరా వచ్చినా కేసీఆర్ మద్దతు మేం తీసుకోం
- రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరం మాకులేదు
- మరింత గౌరవం తెచ్చే బాధ్యత తీసుకుంటాం
- సంకీర్ణం అంటేనే బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- కేసీఆర్ మాటలకు అర్థం కాంగ్రెస్‌తో కలుస్తారనే..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

13

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

**రిజర్వేషన్ల రద్దుతోపాటు హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేస్తారా?**

కిషన్‌రెడ్డి: కాంగ్రెస్, ఇతర పార్టీల నేతలకు అర్ధ రాత్రి కల ఏమైనా వచ్చిందా? మా ఎజెండాలో ఏదైనా ఉంటే ముందే చెబుతాం.. మాకేమీ భయం లేదు. బీజేపీ మిగిలిన పార్టీల మాదిరి కాదు. ఆర్టికల్ 370 రద్దు చేస్తామని చెప్పాం.. చేశాం. అయోధ్య రామమందిరం కడతామన్నాం.. కట్టాం. ట్రిపుల్ తలాక్ రద్దు చేస్తామని చెప్పాం.. చేశాం. కాంగ్రెస్ వాళ్లే రాజ్యాంగాన్ని హత్య చేశారు. ఎమర్జెన్సీ పెట్టారు.. పత్రికల గొంతు నొక్కారు. ఎడిటర్లను, విలేకరులను, రాజకీయ నాయకులను, ప్రజా సంఘాల నాయకులను జైల్లో పెట్టారు. గత 70 ఏళ్లలో 120 సార్లు రాజ్యాంగంలో మార్పులు, చేర్పులు చేశారు. ఇప్పుడు మాకు నీతులు చెబుతున్నారు.

# బోనస్ బోగస్సే

### వరికి రూ.500 బోనస్‌పై మాటతప్పిన కాంగ్రెస్ సర్కారు

- లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి
- ఆరు గ్యారంటీల పేరుతో అరచేతిలో వైకుంఠం
- సింగరేణిని కాపాడుకోవాలన్నా, మంచిర్యాల జిల్లాగా ఉండాలన్నా బీఆర్ఎస్‌ను గెలిపించాలి
- ప్రధాని నరేంద్ర మోదీది ఉత్త గ్యాస్ కంపెనీ
- ప్రాణాలు ఇచ్చి అయినా రాష్ట్రం కోసం పోరాడతా
- మంచిర్యాల రోడ్ షోలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్



మంచిర్యాల రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్

మంచిర్యాల, మే 4 (ఆంధ్రజ్యోతి): వరికి రూ.500 బోనస్ ఇస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాట తప్పిందని, బోనస్ బోగస్ అయ్యిందని బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను ప్రజల సౌకర్యార్థం తాను మూడు జిల్లాలుగా విభజిస్తే, వాటిలో కాంగ్రెస్ ప్రభుత్వం మంచిర్యాల, నిర్మల్ జిల్లాలను రద్దు చేస్తానంటోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ తీరుతో మళ్లీ ప్రజలు తమ పనులకోసం ఆదిలాబాద్ దారి పట్టాల్సివస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో జరిగిన రోడ్‌షోలో కేసీఆర్ ప్రసంగించారు. ఐదు నెలల ముందు తెలంగాణ ఎలా ఉండేదో గుర్తుచేసుకోవాలని, ఇప్పుడు ఇంతలా ఆగం కావడానికి కారణమేంటో ఆలోచించాలని ప్రజలను కోరారు. "బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రెప్పపాటు సమయమైనా కరెంటు పోలేదు. ప్రతి ఇంట్లో నల్లా పెట్టి, నీళ్లు ఇచ్చాం. ఇప్పుడు కల్యాణలక్ష్మీ చెక్కులు మాయమయ్యాయి. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చింది. మా ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణ మాఫీ చేసింది. రేవంత్ మాత్రం రూ.2 లక్షల మాఫీ చేస్తానని ముందుకు వచ్చాడు? ఇప్పుడు రూ.2 లక్షల దాకా మాఫీ అయ్యిందా?" అని ప్రజలను ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలలో ఒకేఒక్క ఉచిత బస్సు పథకాన్ని అమలు చేశారని, మహిళలకు సీట్లు సరిపోక సిగులు పట్టి

మిగతా 12వ పేజీలో...

### అయోధ్య అక్షింతలు కావు.. రేషన్ బియ్యమే

12

- దేవుడి పేరిట బీజేపీ నేతల రాజకీయాలు
- రాష్ట్రంలో పిచ్చోడి చేతిలో రాయిలా పాలన
- కేసీఆర్ అభివృద్ధి చేస్తే రేవంత్ ఉల్టా చేస్తున్నాడు
- కొత్త జిల్లాలను రద్దు చేస్తే ఉద్యమం: కేటీఆర్

**రేవంత్ మాటల్లో పగ, ప్రతీకారమే**

- సీఎం, మంత్రులది అమర్యాదకరమైన భాష
- ప్రజలు అసహ్యించుకుంటున్నారు
- హామీలను అమలు చేయకపోవడమే మార్పా?
- మీట్ ద ప్రెస్‌లో బీఆర్ఎస్ నేత హరీశ్ రావు



### హెచ్‌డీ రేవణ్ణ అరెస్టు

- దేవెగౌడ నివాసంలో అదుపులోకి
- ప్రజ్వల్ రాసలీలలు, బాధితురాలి కిడ్నాప్ కేసుల్లో సిట్ చర్యలు
- ప్రజ్వల్‌పై బ్లూకార్నర్ నోటీసుపై సీబీ'ఐ'
- రేవణ్ణ, ప్రజ్వల్ ఇళ్లలో ఆధారాల సేకరణ
- జర్మనీ నుంచి దుబాయి.. ఆ తర్వాత హంగేరీకి ప్రజ్వల్

11

**ధరణిలో కొత్త పాసుపుస్తకం**

### దరఖాస్తుకు రూ.1000

- డిజిటల్ సిగ్నేచర్ పెండింగ్‌కు పెరిగిన రుసుం
- జీఎల్ఎం పరిధిలో ఉండగా రూ.45 మాత్రమే
- జీఎల్ఎం నుంచి టీఎం-33లోకి మార్పు

14

**అమిత్ షా ఫేక్ వీడియో కేసు.. కాంగ్రెస్ నేత**

### అరుణ్‌రెడ్డి అరెస్టు

మూడు రోజుల పాటు పోలీసు కస్టడీ 12



**వచ్చే ఐదేళ్లూ**

# అవినీతిపై కొరడా

- అవినీతిపరుల మాస్కులను ఎన్డీయే ప్రభుత్వం తొలగించింది
- అవినీతి ఊబిలో ఇండియా కూటమి నేతలు
- పాక్ విషయంలో గత కాంగ్రెస్ సర్కారు మెతకవైఖరి
- ఉగ్రదాడుల వేళ ఆ దేశానికి ప్రేమలేఖలు పంపింది: మోదీ

సినయీ, పలాము(ఝార్ఖండ్), మే 4: దేశంలోని అవినీతిపరుల మాస్కులను ఎన్డీయే ప్రభుత్వం తొలగించివేసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. అవినీతికి పాల్పడినవారందరూ వచ్చే ఐదేళ్లలో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అవినీతిపరులకు మద్దతుగా ప్రతిపక్ష ఇండియా కూటమి ర్యాలీలు చేస్తోందని ఎద్దేవా చేశారు. ఝార్ఖండ్‌లోని లోహర్‌దగా, పలాము నియోజకవర్గాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అవినీతికి పాల్పడినందుకు ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి(హేమంత్ సోరెన్) కటకటాలపాలయ్యారు. అవినీతికి పాల్పడినవారందరూ వచ్చే ఐదేళ్లలో చట్టపరమైన చర్యలు ఎదుర్కొంటారు. పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన ఇండియా కూటమి నేతలు అవినీతిపరులకు మద్దతుగా ఢిల్లీ, రాంచీలలో సహా ర్యాలీలు

మిగతా 11వ పేజీలో...

**మళ్లీ రాష్ట్రానికి అమిత్ షా**

- నేడు ఆదిలాబాద్, ఇందూరు, మల్కాజిగిరిలో బీజేపీ అగ్రనేత ప్రచారం
- రేపు నల్లగొండ, భువనగిరి, పెద్దపల్లి నియోజకవర్గాల్లో నడ్డా పర్యటన

14

### నేటి మ్యాచ్‌లు

| | |
|---|---|
| పంజాబ్ x చెన్నై | మ.3.30 గం. నుంచి |
| లఖ్‌నవూ x కోల్‌కతా | రాత్రి 7.30 గం. నుంచి |

## ఐపీఎల్ నుంచి మయాంక్ అవుట్



న్యూఢిల్లీ: లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ యువ పేసర్ మయాంక్ యాదవ్ ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. పొత్తి కడుపు గాయంతో అతను లీగ్‌కు దూరమయ్యాడని లఖ్‌నవూ ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ శనివారం వెల్లడించాడు. ఈసారి ఐపీఎల్‌లో 4 మ్యాచ్‌లు ఆడిన మయాంక్ 7 వికెట్లు పడగొట్టాడు. అయితే రెండు మ్యాచుల్లో అతడు తన కోటా ఓవర్లను పూర్తి చేయలేక పోయాడు. గుజరాత్‌తో మ్యాచ్‌లో ఒక ఓవర్ వేశాక పక్కటెముకల గాయంతో తప్పుకొన్నాడు. నాలుగు వారాల పునరావాసం తర్వాత మళ్లీ జట్టులోకొచ్చాడు. అయితే, ముంబైతో మ్యాచ్‌లో తిరిగి గాయపడ్డాడు.

**ఆసీస్ పర్యటనకు ఎంపిక..?**

అత్యంత వేగవంతమైన బౌలింగ్‌తో సంచలనం సృష్టిస్తున్న మయాంక్ యాదవ్‌పై బీసీసీఐ దృష్టిసారించింది. 21 ఏళ్ల ఈ బౌలర్‌ను బీసీసీఐ ఇప్పటికే తన పేసర్ల కాంట్రాక్టు జాబితాలో చేర్చింది. అయితే తరచూ గాయాల బారిన పడుతున్న అతడిని ఎన్‌సీఏ లో చేర్పించి ప్రత్యేకంగా పునరావాస చర్యలు చేపట్టాలని భావిస్తోంది. గాయాల నుంచి కోలుకొని ఫిట్‌నెస్ సాధిస్తే జూన్-జూలైలో ఆస్ట్రేలియాలో పర్యటించే ఇండియా 'ఏ' జట్టుకు ఎంపిక చేయాలనుకుంటోంది. తద్వారా నవంబరులో ఆసీస్‌లో పర్యటించే భారత జట్టులోనూ అతడిని చేర్చాలని భావిస్తోంది.

# డుప్లెసి ధమాకా

## అదరగొట్టిన బౌలర్లు ● గుజరాత్‌పై బెంగళూరు గెలుపు



డుప్లెసి (64)

2 ఆర్‌సీబీ తరఫున రెండో ఫాస్టెస్ట్ (18 బంతుల్లో) ఫిఫ్టీ నమోదు చేసిన డుప్లెసి. గేల్ (17) టాప్‌లో ఉన్నాడు.

**బెంగళూరు:** ప్లేఆఫ్స్ ఆశలు అడుగంటిన వేళ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు చెలరేగుతోంది. బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో గుజరాత్ టైటాన్స్‌ను స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన వేళ.. కెప్టెన్ డుప్లెసి (23 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 64) ధనాధన్ ఆటతో మెరిసింది. అయితే ఓ దశలో పేసర్ జోషువా లిటిల్ (4/45) ధాటికి తడబడినట్టు కనిపించినా.. మరో 38 బంతులుండగానే ఆర్‌సీబీ మ్యాచ్‌ను ముగించింది. తద్వారా 4 వికెట్లతో ఘనవిజయం సాధించడంతో పాటు 8 పాయింట్లతో ఏడో స్థానానికి ఎగబాకింది. టైటాన్స్‌కిది వరుసగా మూడో ఓటమి. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా గుజరాత్ 19.3 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. షారుక్ ఖాన్ (37), రాహుల్ తెవాటియా (35), మిల్లర్ (30) రాణించారు. యష్ దయాల్, సిరాజ్, వైశాఖ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో బెంగళూరు 13.4 ఓవర్లలో 6 వికెట్లకు 152 రన్స్ చేసి గెలిచింది. విరాట్ కోహ్లీ (27 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 42), దినేశ్ కార్తీక్ (21 నాటౌట్), స్వప్నిల్ (15 నాటౌట్) ఆకట్టుకున్నారు. నూర్ అహ్మద్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సిరాజ్ నిలిచాడు.

**మెరుపు ఆరంభం:** స్వల్ప ఛేదనలో ఆర్‌సీబీ పరుగుల వరద పారించింది. కెప్టెన్ డుప్లెసి బాదుడుకు పవర్‌ప్లేలోనే జట్టు 92 పరుగులతో వహ్వా అనిపించింది. కానీ ఆ తర్వాతే పేసర్ లిటిల్ ధాటికి టపటపా వికెట్లు కోల్పోవడంతో కాస్త టెన్షన్ నెలకొంది. కానీ దినేశ్ కార్తీక్ అండగా నిలిచి మ్యాచ్‌ను ముగించాడు. తొలి ఓవర్‌లో కోహ్లీ రెండు సిక్సర్లతో ఆకట్టుకోగా, ఆ తర్వాత ఆటంతా డుప్లెసీదే అయ్యింది. రెండో ఓవర్‌లో 4,4,6,4తో 20 రన్స్. నాలుగో ఓవర్‌లోనూ 4 ఫోర్లతో 18 రన్స్ అందించాడు. అటు ఈ దూకుడుకు 18 బాల్స్‌లోనే ఫిఫ్టీని కూడా పూర్తి చేసుకున్నాడు. ఇక ఐదో ఓవర్‌లో కోహ్లీ రెండు సిక్సర్లతో 14 రన్స్ అందించాడు. పేసర్ లిటిల్ ఓవర్‌లోనూ డుప్లెసి 4,6,4తో చెలరేగినా నాలుగో బంతికి క్యాచ్ అవుటయ్యాడు. దీంతో ఆర్‌సీబీ పరుగుల తుఫాన్‌కు తెరపడగా, తొలి వికెట్‌కు 35 బంతుల్లో 92 పరుగుల భాగస్వామ్యం కూడా ముగిసింది. ఈ దశలో ఆర్‌సీబీ అనూహ్యంగా తడబడి 25 రన్స్ వ్యవధిలోనే 6 వికెట్లు కోల్పోయింది. విల్ జాక్స్ (1), కోహ్లీని స్పిన్నర్ నూర్ అవుట్ చేయగా.. రజత్ పటీదార్ (2), మ్యాక్స్‌వెల్ (4), గ్రీన్ (1)లను లిటిల్ పెవిలియన్ చేర్చాడు. దీంతో ఆర్‌సీబీ 117/6తో నిలిచింది. అయితే అప్పటికే ఛేదనలో బంతులు ఎక్కువ, పరుగులు తక్కువగా ఉండడంతో ఇబ్బంది లేకపోయింది. రషీద్ ఓవర్‌లో కార్తీక్ 3 ఫోర్లతో 16 రన్స్ రాబట్టడంతో ఆర్‌సీబీ గెలుపు ఖాయమైంది.

**పేసర్ల హవా:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ బ్యాటర్లు ఒక్కో పరుగు తీసేందుకు చెమటోడ్చారు. అటు ఈ సీజన్‌లో తొలిసారి ఆర్‌సీబీ బౌలర్లు అద్భుత రీతిలో చెలరేగారు. పేసర్లు సిరాజ్, యష్, గ్రీన్ చక్కటి లెంగ్త్‌తో బంతులు వేయడంతో టైటాన్స్ ఉక్కిరిబిక్కిరైంది. తన వరుస ఓవర్లలో సాహా (1), గిల్ (2) వికెట్లతో సిరాజ్ గట్టి షాకే ఇచ్చాడు. ఆరో ఓవర్‌లో సాయిసుదర్శన్ (6)ను షార్ట్ పిచ్ బాల్‌తో గ్రీన్ అవుట్ చేయగా పవర్‌ప్లేలో గుజరాత్ 23/3 స్కోరుతో దీనస్థితిలో నిలిచింది. ఈ దశలో షారుక్, మిల్లర్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరూ ఓవర్‌కో బౌండరీ ఉండేలా ఆడుతూ స్కోరును చక్కదిద్దారు. పదో ఓవర్‌లో మిల్లర్ 6, షారుక్ 4తో 12 రన్స్ వచ్చాయి. అయితే ఈ జోడీ ప్రమాదకరంగా మారుతున్న దశలో 12వ ఓవర్‌లో మిల్లర్‌ను కర్ణ్ శర్మ అవుట్ చేశాడు. అప్పటికి నాలుగో వికెట్‌కు 58 పరుగులు జత చేరాయి. ఇక తర్వాతి ఓవర్‌లోనే చక్కగా కుదురుకున్న షారుక్ రనౌటవడం దెబ్బతీసింది. విరాట్ నేరుగా విసిరిన మెరుపు త్రోతో అతను పెవిలియన్ చేరాడు. ఈ తరుణంలో తెవాటియా హిట్టింగ్‌కు దిగి 16వ ఓవర్‌లో వరుసగా 4,6,4,4తో 19 రన్స్ అందించాడు. అటు రషీద్ ఖాన్ (18) వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలతో చెలరేగాడు. వీరి ఆటతో 150 దాటేస్తుందనిపించినా.. 18వ ఓవర్‌లో యష్ ఈ ఇద్దరినీ వెనక్కి పంపి ఆర్‌సీబీకి ఊరటనిచ్చాడు. 19వ ఓవర్‌లో విజయ్ శంకర్ (10) రెండు ఫోర్లతో ఊపు మీద కనిపించాడు. కానీ ఆఖరి ఓవర్ తొలి మూడు బంతుల్లోనే టైటాన్స్ చివరి 3 వికెట్లు కోల్పోయింది. మానవ్ (1), విజయ్ వికెట్లను వైశాఖ్ తీయగా.. మోహిత్ రనౌటయ్యాడు.

**స్కోరుబోర్డు**

**గుజరాత్:** సాహా (సి) దినేశ్ (బి) సిరాజ్ 1, గిల్ (సి) వైశాఖ్ (బి) సిరాజ్ 2, సాయి సుదర్శన్ (సి) కోహ్లీ (బి) గ్రీన్ 6, షారుక్ ఖాన్ (రనౌట్) 37, మిల్లర్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) కర్ణ్ శర్మ 30, తెవాటియా (సి) వైశాఖ్ (బి) యశ్ దయాల్ 35, రషీద్ ఖాన్ (బి) యశ్ దయాల్ 18, విజయ్ శంకర్ (సి) సిరాజ్ (బి) వైశాఖ్ 10, మానవ్ సూథర్ (సి) స్వప్నిల్ (బి) వైశాఖ్ 1, మోహిత్ శర్మ (రనౌట్) 0, నూర్ అహ్మద్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 19.3 ఓవర్లలో 147 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-1, 2-10, 3-19, 4-80, 5-87, 6-131, 7-136, 8-147, 9-147, 10-147; **బౌలింగ్:** స్వప్నిల్ 1-0-1-0, సిరాజ్ 4-0-29-2, యశ్ దయాల్ 4-0-21-2, గ్రీన్ 4-0-28-1, వైశాఖ్ 3.3-0-23-2, కర్ణ్ శర్మ 3-0-42-1.

**బెంగళూరు:** కోహ్లీ (సి) సాహా (బి) నూర్ 42, డుప్లెసి (సి) షారుక్ (బి) లిటిల్ 64, విల్ జాక్స్ (సి) షారుక్ (బి) నూర్ 1, పటీదార్ (సి) మిల్లర్ (బి) లిటిల్ 2, మ్యాక్స్‌వెల్ (సి) మిల్లర్ (బి) లిటిల్ 4, గ్రీన్ (సి) షారుక్ (బి) లిటిల్ 1, దినేశ్ (నాటౌట్) 21, స్వప్నిల్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 13.4 ఓవర్లలో 152/6; వికెట్ల పతనం:** 1-92, 2-99, 3103, 4-107, 5-111, 6-117; **బౌలింగ్:** మోహిత్ శర్మ 2-0-32-0, జోషువా లిటిల్ 4-0-45-4, మానవ్ 2-0-26-0, నూర్ అహ్మద్ 4-0-23-2, రషీద్ 1.4-0-25-0.

**పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | నె.రరే |
|---|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 10 | 8 | 2 | 0 | 16 | 0.622 |
| కోల్‌కతా | 10 | 7 | 3 | 0 | 14 | 1.098 |
| లఖ్‌నవూ | 10 | 6 | 4 | 0 | 12 | 0.094 |
| హైదరాబాద్ | 10 | 6 | 4 | 0 | 12 | 0.072 |
| చెన్నై | 10 | 5 | 5 | 0 | 10 | 0.627 |
| ఢిల్లీ | 11 | 5 | 6 | 0 | 10 | -0.442 |
| బెంగళూరు | 11 | 4 | 7 | 0 | 8 | -0.049 |
| పంజాబ్ | 10 | 4 | 6 | 0 | 8 | -0.062 |
| గుజరాత్ | 11 | 4 | 7 | 0 | 8 | -1.320 |
| ముంబై | 11 | 3 | 8 | 0 | 6 | -0.356 |

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

## క్రికెట్‌లో నాకు నాన్నలా..

**ధోనీపై సీఎస్‌కే పేసర్ పతిరన**



చెన్నై: తన క్రికెట్ కెరీర్‌లో ఎంఎస్ ధోనీ తండ్రిలాంటి వారని శ్రీలంక యువ పేసర్ మతీష పతిరన అన్నాడు. మహీ ఇచ్చే చిన్నచిన్న సూచనలు తనకు ఎంతో ఆత్మవిశ్వాసాన్నిస్తాయని చెప్పాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున పతిరన ఆకట్టుకొనే ప్రదర్శన చేస్తున్నాడు. 'నా తండ్రి తర్వాత.. నా క్రికెట్ జీవితంలో ఆ పాత్రను పోషిస్తున్న వ్యక్తి ధోనీ. ఎల్లవేళలా నా గురించి జాగ్రత్తలు తీసుకొంటాడు. ఇంటి వద్ద నాన్న ఎలా సలహాలిస్తారో.. ఇక్కడ ధోనీ అలా..! మైదానంలో ఆడుతున్నప్పుడు పెద్దగా ఒత్తిడి చేయడు. అవసరమైన విషయాలు మాత్రమే సూటిగా చెబుతాడు. అవి నాలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయ'ని చెన్నై ఫ్రాంచైజీ యూట్యూబ్ చానెల్ షోలో పతిరన చెప్పాడు. ఏదైనా అనుమానం ఉన్నా, స్వేచ్ఛగా వెళ్లి అతడితో మాట్లాడతానన్నాడు. ధోనీ వచ్చే సీజన్‌లో కూడా తమతో కలసి ఆడాలని కోరుకుంటున్నట్టు 21 ఏళ్ల పతిరన తెలిపాడు.

## స్టేడియాలు 'చిన్న'బోతున్నాయి



న్యూఢిల్లీ: తాజా ఐపీఎల్‌లో బ్యాటర్ల హవాతో అతి భారీ స్కోర్లు నమోదవుతున్నాయి. 250కి పైగా పరుగులను కూడా అలవోకగా బాదేస్తున్నారు. ఇలాంటి భారీ హిట్టింగ్‌పై వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆందోళన వ్యక్తం చేశాడు. భారీ హిట్టింగ్‌ల ఈ కారణంగా స్టేడియాల పరిమాణానికి ప్రాముఖ్యం లేకుండా పోయిందని అన్నాడు. 'గతంలో నిర్మించిన స్టేడియాలు ప్రస్తుత ఆటతీరుకు ఏమాత్రం సరిపోవడం లేదనిపిస్తోంది. ఇంపాక్ట్ ప్లేయర్‌తో గేమ్స్ అన్నీ ఏకపక్షంగా మారుతున్నాయి. దీంతో బౌలర్లు మానసికంగా దృఢంగా ఉండాల్సిందే. ఆట సమతూకంతో ఉంటేనే బాగుంటుంది. అయితే నైపుణ్యం కలిగిన బౌలర్ సవాల్‌ను స్వీకరించేందుకు సిద్ధంగానే ఉంటాడు' అని అశ్విన్ తెలిపాడు.

## జట్టు ఎంపికలో 'ఏఐ'

### ఇంగ్లండ్ మహిళల క్రికెట్‌లో నూతన సాంకేతికత

**లండన్:** ఎల్లలు లేని విధంగా కృత్రిమ మేథ (ఏఐ) వినియోగం పెరిగిపోతోంది. ఆటల్లోనూ ఏఐ కీలకపాత్ర పోషించే స్థితికి వచ్చింది. జట్టు ఎంపికలో ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం తీసుకొంటున్నట్టు ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టు చీఫ్ కోచ్ జాన్ లూయిస్ తెలిపాడు. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లో 2-1తో ఇంగ్లండ్ జట్టు విజయంలో ఈ నవీన సాంకేతికత ఎంతో ఉపయోగపడిందని అతను చెప్పాడు. ఒకే తరహా నైపుణ్యాలతో ఇద్దరు ప్లేయర్లు ఉండి.. వారిలో ఒకరిని మాత్రమే ఎంపిక చేయాలనుకొన్న సమయంలో ఏఐ ఎంతో సాయం చేసిందని లూయిస్ తెలిపాడు. 'మనదగ్గర ఉన్న ఆటగాళ్లతో లైనప్ పంపితే.. పలు రకాలుగా పరీక్షించి ప్రత్యర్థి బలాలకు తగిన విధంగా ఉత్తమ జట్టును ఏఐ సూచిస్తుంద'ని లూయిస్ వెల్లడించాడు.

## ఐఎస్‌ఎల్ విజేత ముంబై సిటీ



**కోల్‌కతా:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టైటిల్‌ను ముంబై సిటీ ఎఫ్‌సీ రెండోసారి సొంతం చేసుకొంది. శనివారం జరిగిన ఫైనల్లో ముంబై 3-1తో మోహన్‌బగాన్ సూపర్ జెయింట్స్‌ను ఓడించింది. ఫస్టాఫ్ ఆఖర్లో జేసన్ కమిన్స్ (44వ నిమిషం) గోల్‌తో మోహన్‌బగాన్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కానీ, సెకండాఫ్ ఆరంభమైన 8వ నిమిషంలోనే ముంబై ఆటగాడు జార్జ్ పెరీరా డియాజ్ (53వ) గోల్‌తో స్కోరు 1-1తో సమమైంది. 81వ నిమిషంలో బిపిన్ సింగ్ గోల్‌తో ముంబై 2-1తో పైచేయి సాధించింది. ఆ తర్వాత ఇంజ్యూరీ టైమ్‌లో జాకబ్ వోజ్టస్ (90+7) మూడో గోల్ అందించాడు.

## 43 పతకాలతో భారత్ రికార్డు

**ఆసియా యూత్ బాక్సింగ్**

**అస్థానా (కజకిస్థాన్):** ఆసియా అండర్-22, యూత్ చాంపియన్‌షిప్‌లో శనివారంనాటి పోటీల్లో మరో నలుగురు బాక్సర్లు తమ విభాగాల్లో ఫైనల్స్‌కు చేరడంతో..ఈసారి టోర్నీలో భారత్‌కు రికార్డు స్థాయిలో మొత్తం 43 పతకాలు ఖాయమయ్యాయి. ఆకాశ్ (60 కిలోలు), విశ్వంత్ (48 కి.), నిఖిల్ (57 కి.), ప్రీత్ (67 కి.) ఫైనల్స్ చేరారు. యూత్ మహిళల విభాగంలో నిషా (52 కి.), నికితా (60 కి.)తో పాటు మరో ఐదుగురు ఫైనల్లో అడుగుపెట్టారు. మరో ఐదుగురు మహిళా బాక్సర్లు కాంస్య పతకాలు సాధించారు.

# కోటక్ బ్యాంక్ లాభం రూ.4,133 కోట్లు

## ఒక్కో షేరుకు రూ.2 డివిడెండ్





న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి (క్యూ4) కోటక్ మహీంద్రా బ్యాంక్ నికర లాభం స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన 18 శాతం వృద్ధితో రూ.4,133 కోట్లకు చేరుకుంది. మొత్తం ఆదాయం రూ.15,285 కోట్లకు పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి బ్యాంక్ లాభం 26 శాతం వృద్ధితో రూ.13,782 కోట్లకు, మొత్తం ఆదాయం రూ.56,072 కోట్లకు చేరుకుంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- క్యూ4లో కోటక్ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 13 శాతం పెరిగి రూ.6,909 కోట్లకు చేరుకోగా.. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఎన్ఐఐ 21 శాతం వృద్ధితో రూ.25,993 కోట్లుగా నమోదైంది. కాగా, నికర వడ్డీ మార్జిన్ 5.28 శాతంగా నమోదైంది.
- మార్చి 31 నాటికి బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 1.39 శాతానికి, నికర ఎన్‌పీఏ 0.34 శాతానికి తగ్గాయి.
- మార్చి చివరి నాటికి బ్యాంక్ రుణాలు వార్షిక ప్రాతిపదికన 20 శాతం వృద్ధితో రూ.3.9 లక్షల కోట్లకు చేరుకోగా.. డిపాజిట్లు 23 శాతం పెరిగి రూ.4.45 లక్షల కోట్లకు ఎగబాకాయి.
- గత ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ వాటాదారులకు రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.2 డివిడెండ్‌ను ప్రకటించింది.

### ఆర్‌బీఐ ఆంక్షలతో ప్రభావం చాలా తక్కువే: వాస్వానీ

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తమ వ్యాపారంపై విధించిన ఆంక్షల ఆర్థిక ప్రభావం చాలా తక్కువే అయినప్పటికీ, బ్యాంక్ పేరు ప్రతిష్ఠలకు నష్టం చేకూరుతుందని ఆందోళన చెందుతున్నట్లు కోటక్ బ్యాంక్ ఎండీ, సీఈఓ అశోక్ వాస్వానీ అన్నారు. ఆర్‌బీఐ ఆంక్షలు మరికొన్ని నెలల పాటు కొనసాగవచ్చని ఆయన ఈ సందర్భంగా సంకేతాలిచ్చారు. కోటక్ మహీంద్రా ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ చానెళ్ల ద్వారా కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా, కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేయకుండా గత నెలలో ఆర్‌బీఐ నిషేధం విధించింది. బ్యాంక్ ఐటీ రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలో లోపాలను గుర్తించిన నేపథ్యంలో ఆర్‌బీఐ బ్యాంక్‌పై క్రమశిక్షణ చర్యలు చేపట్టింది.

# బిజినెస్

## ఐడీబీఐ బ్యాంక్ లాభంలో 44% వృద్ధి

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఐడీబీఐ బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 44 శాతం పెరిగి రూ.1,628 కోట్లకు చేరుకుంది. మొత్తం ఆదాయం రూ.7,887 కోట్లకు పెరిగింది. గత ఏడాదిలో ఇదే కాలానికి బ్యాంక్ రూ.1,133 కోట్ల లాభం, రూ.7,014 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) మొత్తానికి బ్యాంక్ నికర లాభం 55 శాతం వృద్ధితో ఆల్‌టైం గరిష్ఠ స్థాయి రూ.5,634 కోట్లకు, ఆదాయం రూ.30,037 కోట్లకు పెరిగింది. ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 12 శాతం పెరిగి రూ.3,688 కోట్లుగా నమోదైంది. మార్చి 31 నాటికి బ్యాంక్ నికర నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 0.34 శాతానికి తగ్గాయి. గత ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంక్ బోర్డు వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.1.5 డివిడెండ్ చెల్లించాలని ప్రతిపాదించింది.

## 22% పెరిగిన డీ-మార్ట్ లాభం

న్యూఢిల్లీ: డీ-మార్ట్ పేరుతో గొలుసుకట్టు సూపర్ మార్కెట్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్ లిమిటెడ్.. మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.563 కోట్ల లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి ఆర్జించిన రూ.460 కోట్ల లాభంతో పోలిస్తే 22.39 శాతం అధికమిది. కాగా, ఈ జనవరి-మార్చి కాలానికి సంస్థ ఏకీకృత ఆదాయం రూ.12,727 కోట్లకు పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.50,789 కోట్ల ఏకీకృత ఆదాయంపై రూ.2,536 కోట్ల లాభాన్ని గడించింది. ఏడాది కాలంలో సంస్థ మరో 41 కేంద్రాలను ప్రారంభించింది. దాంతో మొత్తం సూపర్ మార్కెట్ల సంఖ్య 365కు చేరుకుంది. దేశంలోని 23 నగరాలకు విస్తరించినట్లు కంపెనీ వెల్లడించింది.

# కేకేఆర్ చేతికి హెల్తియమ్ మెడ్‌టెక్!





### డీల్ విలువ రూ.7,000 కోట్లు!!

ముంబై: ప్రపంచంలో నాలుగో అతిపెద్ద సర్జికల్ సూచర్ (శస్త్రచికిత్స కుట్టు) తయారీదారు హెల్తియమ్ మెడ్‌టెక్ (గతంలో సూచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్)ను అమెరికన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ కేకేఆర్ టేకోవర్ చేయబోతోంది. బ్రిటన్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ అపాక్స్ పార్ట్‌నర్స్ నుంచి 84 కోట్ల డాలర్ల (రూ.7,000 కోట్లు)కు హెల్తియమ్‌ను దక్కించుకున్నట్లు సమాచారం. ఈ సంస్థ కొనుగోలుకు కేకేఆర్‌తో పాటు దేశీయ ఫార్మా కంపెనీ మ్యాన్‌కైండ్ ఫార్మా, క్రిస్‌క్యాపిటల్ కన్సార్షియం, డెన్మార్క్‌కు చెందిన ఔషధ సంస్థ నోవో నోర్డిస్క్ ప్రమోటర్ నోవో హోల్డింగ్స్ పోటీ పడ్డాయి. అయితే, నోవో హోల్డింగ్స్ చివరి నిమిషంలో పోటీ నుంచి తప్పుకున్నట్లు తెలిసింది. బిడ్డింగ్‌లో మ్యాన్‌కైండ్ ఫార్మా కన్సార్షియం 78 కోట్ల డాలర్లు (రూ.6,500 కోట్లు) ఆఫర్ చేయగా.. కేకేఆర్ రూ.7,000 కోట్ల బిడ్‌తో విజేతగా నిలిచినట్లు తెలిసింది. కాగా 2022లోనూ హెల్తియమ్‌కు చెందిన యూకే అనుబంధ విభాగాన్ని కేకేఆర్ కొనుగోలు చేసింది.

### బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు

బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న హెల్తియమ్ మెడ్‌టెక్ కొనుగోలుకు సంబంధించి అపాక్స్ పార్ట్‌నర్‌తో కేకేఆర్ విధిగా కట్టుబడి ఉండే ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ డీల్‌ను సోమవారం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రస్తుతం హెల్తియమ్ మెడ్‌టెక్‌లో అపాక్స్ పార్ట్‌నర్ 99.8% వాటా కలిగి ఉండగా..మిగతా 0.2% వాటాను హెల్తియమ్ సీఈఓ, ఎండీ అనీశ్ బాఫ్నా చేతిలో ఉంది. సంస్థ కేకేఆర్ చేతుల్లోకి వెళ్లిన తర్వాత హెల్తియమ్‌కు బాఫ్నాయే సారథ్యం వహించనున్నట్లు తెలిసింది. 2018లో అపాక్స్ పార్ట్‌నర్స్.. హెల్తియమ్‌ను టీపీజీ గ్రోత్, సీఎక్స్ పార్ట్‌నర్స్ నుంచి దాదాపు 30 కోట్ల డాలర్లకు (రూ.1,950 కోట్లు) కొనుగోలు చేసింది. స్మిత్ అండ్ నెఫ్యూ, జాన్సన్ అండ్ జాన్సన్ మాజీ ఎగ్జిక్యూటివ్‌లైన ఎల్‌జీ చంద్రశేఖర్, ఎస్ సుబ్రమణియమ్ 1992లో సూచర్స్ ఇండియాను ప్రారంభించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో హెల్తియమ్ రూ.820 కోట్ల ఆదాయంపై రూ.256 కోట్ల నిర్వహణ లాభాన్ని ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఆదాయం రూ.1,000 కోట్లు, నిర్వహణ లాభం రూ.350 కోట్ల స్థాయికి చేరుకోవచ్చని అంచనా.

# జెన్ టెక్నాలజీస్ డివిడెండ్ 100 శాతం

### క్యూ 4 లాభం రూ.33 కోట్లు

Zen Technologies Limited

హైదరాబాద్: జెన్ టెక్నాలజీస్.. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను కంపెనీ స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.138.04 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.33.03 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.74.33 కోట్ల ఆదాయంపై రూ.17.21 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.444.20 కోట్ల ఆదాయంపై రూ.129.23 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.1 ముఖ విలువ ప్రతి షేరుకు రూ.1 డివిడెండ్ (100 శాతం)ను బోర్డు సిఫారసు చేసింది. కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆమోదం పొందిన తర్వాత 30 రోజుల్లో ఈ డివిడెండ్‌ను చెల్లించనున్నట్లు తెలిపింది. కాగా మార్చి ముగిసే నాటికి చేతిలో రూ.1,401.97 కోట్ల ఆర్డర్లు ఉన్నట్లు జెన్ టెక్నాలజీస్ వెల్లడించింది.

# ఐటీసీ ద్వారా చెల్లింపులు ఆలస్యమైనా వడ్డీ కట్టాలా..?

ఇదీ GST



రాంబాబు గొండాల

జీఎస్‌టీలో నమోదై రిటర్నులు దాఖలు చేస్తూ పన్ను చెల్లించే వారిలో చాలా మందికి ఉండే ఆలోచన ఏమిటంటే పన్ను చెల్లింపు ఆలస్యమైనప్పటికీ.. ఆ మొత్తాన్ని నగదు ద్వారా కాకుండా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ద్వారా చెల్లిస్తే ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదని అనుకుంటారు. కానీ, ఇది కొంత వరకే నిజం. ఈ అవగాహనా లోపం వల్ల చాలామంది పొరపాట్లు చేస్తున్నారు. ఇలాంటి వారికి వడ్డీ చెల్లించమని నోటీసులు వస్తున్నాయి. అసలు ఈ విషయాన్ని ఎలా అర్థం చేసుకోవాలో చూద్దాం.

ఇంతకు ముందు ఉన్న విధానంతో పోలిస్తే జీఎస్‌టీలో రిటర్న్ దాఖలు చేసే పద్ధతి కొంచెం భిన్నంగా ఉంటుంది. అంటే నెలకు చెల్లించాల్సిన మొత్తం చెల్లిస్తే గానీ రిటర్న్ దాఖలు కాదు. ఉదాహరణకు ఒక వ్యక్తి ఒక నెలలో రూ.50,000 పన్ను చెల్లించాల్సి ఉండగా, రూ.40,000 ఐటీసీ ఉందనుకుందాం. అంటే మిగతా రూ.10,000 నగదు ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. కానీ, సమయానికి రూ.10,000 అందక రిటర్న్ వాయిదా పడింది. ఒక నాలుగు నెలల తర్వాత తనకు నగదు సర్దుబాటు అయిన అనంతరం మొత్తం రూ.50,000తో రిటర్న్ దాఖలు చేశాడు. సకాలంలో రిటర్న్ దాఖలు చేయనందుకు తాను లేట్ ఫీజు కూడా చెల్లించాడు. అయితే ప్రభుత్వానికి సకాలంలో పన్ను చెల్లించలేదు కాబట్టి పన్ను చెల్లించాల్సిన తేదీ నుంచి చెల్లింపు జరిగిన తేదీ వరకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. మరి ఈ వడ్డీ ఎంత మీద చెల్లించాలనే దానిపై మొదట్లో కొంత గందరగోళం ఉండేది. చెల్లించాల్సిన మొత్తం రూ.50,000 కాబట్టి ఆ మొత్తం మీద వడ్డీ చెల్లించాలని ఒక వాదన. కాగా రూ.40,000 సదరు వ్యక్తికి ఐటీసీ రూపంలో నిర్ణీత గడువు నాటికే అందుబాటులో ఉంది కాబట్టి నగదు రూపంలో చెల్లించిన రూ.10,000 మీద మాత్రమే వడ్డీ వర్తిస్తుందని మరొక వాదన.

మొత్తానికి దీనికి సంబంధించి ప్రభుత్వం కొంత వివరణ ఇవ్వటం జరిగింది. అంతేకాకుండా సంబంధిత సెక్షన్‌లో సవరణ కూడా చేయటం జరిగింది. దీని ప్రకారం రిటర్న్ ఆలస్యంగా దాఖలు చేసిన సందర్భంలో ఐటీసీ ద్వారా చెల్లించిన పన్ను మేరకు ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదు. అంటే నగదు ద్వారా చెల్లించిన పన్నుకు మాత్రమే వడ్డీ వర్తిస్తుంది. పై ఉదాహరణలో రూ.40,000 ఐటీసీ ద్వారా చెల్లించటం జరిగింది కాబట్టి దాని మీద వడ్డీ చెల్లించనవసరం లేదు. కేవలం రూ.10,000 మీద మాత్రమే చెల్లించాలి.

కానీ, ఇక్కడ కొన్ని షరతులు ఉన్నాయి. రిటర్న్ దాఖలు చేయటం లేట్ అయినప్పటికీ ఆ రిటర్న్ పీరియడ్‌కు సంబంధించిన వివరాలు అన్నీ ఆ రిటర్న్‌లో కచ్చితంగా చూపాలి. ఉదాహరణకు ఒక వ్యాపారస్తుడు జనవరి నెలలో రూ.లక్ష అమ్మకాలు చేపట్టాడు. దానికి గాను రూ.12,000 పన్ను చెల్లించాలనుకుందాం. ఈ రూ.12,000 గాను తన దగ్గర రూ.14,000 ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఉంది. పన్ను చెల్లింపు మొత్తానికి ఐటీసీ సరిపోతుంది కాబట్టి నగదులో ఎలాంటి చెల్లింపులు చేయనవసరం లేదు. అయితే జనవరి నెల రిటర్న్ ఏదో కారణంతో సకాలంలో చేయకుండా ఒక రెండు నెలల తర్వాత చేశాడనుకుందాం. అయినప్పటికీ, ఆ రిటర్న్‌లో జనవరిలో జరిపిన రూ.లక్ష అమ్మకాలు మొత్తం చూపి, దానికి సంబంధించిన పన్నును నగదు ఉపయోగించకుండా ఐటీసీ ద్వారా చెల్లిస్తే ఎలాంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అలాకాకుండా, అదే జనవరి రిటర్న్ సకాలంలో వేసి రూ.లక్షకు గాను రూ.60,000 అమ్మకాలు మాత్రమే చూపి మిగతా రూ.40,000 అమ్మకాలు ఫిబ్రవరి నెల రిటర్న్‌లో కలిపి చూపితే ఐటీసీ సరిపోను ఉన్నప్పటికీ రూ.40,000కు వడ్డీ మినహాయింపు రాదు. అంటే పన్ను చెల్లింపు ఆలస్యమైనప్పటికీ సంబంధిత రిటర్న్ ఏ పీరియడ్‌కైతే దాఖలు చేస్తున్నారో, ఆ పీరియడ్‌లో జరిపిన సరఫరాల వివరాలు అన్నీ చూపి తగిన పన్ను చెల్లించాలి. అలా చెల్లించినప్పుడు మాత్రమే ఐటీసీ ద్వారా జరిపిన చెల్లింపునకు వడ్డీ మినహాయింపు లభిస్తుంది. ఇంకొక షరతు ఏమిటంటే, రిటర్న్ దాఖలు చేయటమనేది అధికారులు చర్యలు తీసుకోవటానికి పూర్వమే జరిగి ఉండాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 71,830 ▲ | 65,850 ▲ | 86,500 ▼ |
| ముంబై | 71,191 ▼ | 65,211 ▼ | 79,989 ▲ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

5వ తేదీ

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 465 | విజయవాడ | 460 |
| వరంగల్ | 467 | గోదావరి | 460 |
| చిత్తూరు | 543 | విశాఖపట్నం | 470 |
| | | దజను గుడ్లు రూ.60 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 131 | గోదావరి | 139 |
| వరంగల్ | 131 | విజయవాడ | 139 |
| కరీంనగర్ | 131 | గుంటూరు | 139 |
| మహబూబ్‌నగర్ | 131 | ఒంగోలు | 139 |
| కర్నూలు | 131 | చిత్తూరు | 137 |
| విశాఖపట్నం | 131 | | |

www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## దివంగత వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీతారెడ్డి దంపతులతో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ



ABN ఆంధ్రజ్యోతి

**BIG DEBATE**



సోమవారం రాత్రి 7 గంటలకు..

బిగ్ డిబేట్ వీడియోల కోసం క్లిక్ చేయండి Click here

## ఆంధ్రజ్యోతి

## కూపన్ నింపండి లక్షలు గెలవండి

### ఎవరు గెలిచినా మీదే గెలుపు

రాష్ట్ర స్థాయి కూపన్ నెం.1

పాఠకుని పూర్తి పేరు : ............

దోరు నెంబరు : ............ వీధి పేరు : ............

గ్రామం/పట్టణం : ............ మండలం : ............

జిల్లా : ............ పోస్టల్ పిన్‌కోడ్ : ............ఫోన్ నెం. ............

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఏ పార్టీకి / కూటమికి ఎన్ని సీట్లు వస్తాయి...
మీ అంచనాలను ఈ క్రింది గడిలో తెలియజేయగలరు.

| మొత్తం సీట్లు | NDA కూటమి | YSRCP | కాంగ్రెస్ | ఇతరులు |
|---|---|---|---|---|
| | | | | |

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.

పూర్తి వివరాల కోసం ఈ QR కోడ్‌ను స్కాన్ చేయండి

## ఎన్నికలు - 2024



## లోక్‌సభ ఎన్నికలు

లోక్‌సభ ఎన్నికల కవరేజ్ కోసం క్లిక్ చేయండి Click here

## ఎన్నికలు - 2024



## ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు

అసెంబ్లీ ఎన్నికల కవరేజ్ కోసం క్లిక్ చేయండి Click here

## భూదేవే అమ్మై.. లారీ డ్రైవరే ఆపద్బాంధవుడై..

» మట్టిలో శిశువు కదలికలు గమనించి కాపాడిన డ్రైవర్

» బతికుండగానే రోడ్డు పక్కన పాతేసిన వైనం.. ఎంజీఎంకు తరలింపు



ఆస్పత్రిలో పసికందు

దామెర, మే 4: ఎవరు చేసిన పాపమో తెలియదు కానీ.. అప్పుడే పుట్టిన ఓ ఆడశిశువు ప్రాణాలతో ఉండగానే రోడ్డు పక్కన పాతేశారు గుర్తు తెలియని వ్యక్తులు. ఆ రహదారి విస్తరణ పనుల్లో ఉన్న ఓ లారీ డ్రైవర్ మట్టిలో కదలికలను గమనించి ఆ పసికందును బయటికి తీసి ప్రాణాలు నిలబెట్టి ఆపద్బాంధవుడయ్యాడు. హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండలోని పెద్ద చెరువు వద్ద ఈ ఘటన జరిగింది. హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారి-163 నాలుగు లేన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పెద్ద చెరువు ఎదురుగా రోడ్డును చదును చేసేందుకు వాటర్ ట్యాంకర్(లారీ)తో నీటిని చల్లుతున్నారు. ఆ సమయంలో రోడ్డు పక్కన మట్టిలో కదలికలు గమనించిన ట్యాంకర్ డ్రైవర్ రామ్‌దినయ్ వాహనాన్ని ఆపి ఆ మట్టిని తవ్వాడు. మట్టి కింద కొన ఊపిరితో ఉన్న ఓ పసికందును చూసి నిర్ఘాంతపోయిన డ్రైవర్.. ఉపాధి కూలీలను పిలిచాడు. పోలీసులు ఆ పసికందును అపోలో రీచ్ ఎస్ఎస్ఆర్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పసికందు ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని ఎంజీఎం వైద్యులు తెలిపారు.

## 7న మేడిగడ్డకు జస్టిస్ పీసీ ఘోష్

» ఈనెల 6 నుంచి 12 వరకు రాష్ట్రంలో పర్యటన

హైదరాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల్లో లోపాలపై విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఈనెల 7న మేడిగడ్డను సందర్శించనున్నారు. గత ఏడాది అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిన విషయం విదితమే. అయితే ఈ బ్యారేజీలోని 6, 7, 8వ బ్లాకుపై జరిపిన ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్(ఈఆర్‌టీ), గ్రౌండ్ పీనట్రేటింగ్ రాడార్(జీపీఆర్) పరీక్షల నివేదికలను అధికారులు ఇప్పటికే పీసీ ఘోష్‌కు అందించారు. ఇక ఈనెల 6 నుంచి 12 వరకు ఆయన రాష్ట్రంలో పర్యటించనున్నారు. 6న నీటిపారుదల శాఖ కార్యదర్శితో పాటు అధికారులతో భేటీ కానున్నారు. 9వ తేదీన కమిషన్ కార్యాలయంలో అధికారులతో పాటు వివిధ వర్గాల ప్రతినిధులతో సమావేశం కానున్నారు.

## తుది తీర్పు మేరకే గ్రూప్-1 నియామక ప్రక్రియ

» రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు నోటీసులు

» 'ఎస్టీ రిజర్వేషన్ పెంపు'పై పిటిషన్ విచారణ

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 నియామక ప్రక్రియ తమ తుది తీర్పునకు లోబడి ఉండాలని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విద్యాసంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సర్వీసుల్లో ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచుతూ 2022లో జారీచేసిన జీవో నం.33ను సవాల్ చేస్తూ వికారాబాద్‌కు చెందిన పి.శ్యాంసుందర్‌రెడ్డి, సంగారెడ్డికి చెందిన ఎం.అర్జున్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదిస్తూ.. రిజర్వేషన్ల పెంపు జీవోను గ్రూప్-1 పరీక్షల్లో అమలు చేయడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని చెప్పారు. తెలంగాణలో ఎస్టీ రిజర్వేషన్ 6 నుంచి 10 శాతానికి పెంచడం వల్ల మొత్తం రిజర్వేషన్లు 54 శాతానికి చేరుతాయి. గతంలో సుప్రీం ఇచ్చిన 'ఇంద్ర సాహ్నీ' తీర్పునకు ఇది వ్యతిరేకం'అని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. గ్రూప్-1 నియామక ప్రక్రియ తుది తీర్పునకు లోబడి ఉండాలంటూ ప్రభుత్వంతో పాటు టీఎస్‌పీఎస్సీకి నోటీసులు జారీచేసింది. విచారణ జూన్ 28కి వాయిదా వేసింది.

## రైతులకు రాజన్న కోడెలు!

» దేవాదాయ కమిషనర్‌కు నివేదిక.. ఉత్తర్వులు రాగానే ఉచిత పంపిణీ: ఈవో

వేములవాడ టౌన్, మే 4: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామికి భక్తులు సమర్పించుకునే కోడెలను రైతులకు, గుర్తింపు పొందిన గోశాలలకు అందించేందుకు ఆలయ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, పశుసంవర్ధకశాఖ, ఆలయాధికారులతో కలిసి ఒక కమిటీ ఏర్పాటు చేసి కోడెలను పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈమేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుకు ఇప్పటికే నివేదిక అందజేసినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. 'రాజన్న కోడెలను రైతులకు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. క్లియరెన్స్ రాగానే నిబంధనలకు అనుగుణంగా రైతుల నుంచి అగ్రిమెంట్ తీసుకొని కోడెలను అందించాలని అనుకుంటున్నాం. ఉత్తర్వులు రాగానే ఉచితంగా రైతులకు కోడెలను అందజేస్తాం. త్వరలోనే పంపిణీ ప్రారంభమవుతుంది' అని చెప్పారు.

# ప్రాణాలు తీస్తున్న ఎండలు

### ఎన్నికల విధులకు హాజరైన ఉపాధ్యాయుడు సహా వడదెబ్బకు 15 మంది మరణం

» కొనసాగుతున్న ఎండల తీవ్రత

» కరీంనగర్ జిల్లాలో 46.8 డిగ్రీలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఎండ, ఉక్కపోత, వడగాలుల తీవ్రతకు జనం అల్లాడిపోతున్నారు. ఎండల వల్ల అస్వస్థతకు గురై, వడదెబ్బ బారిన పడి మరణిస్తున్న వారి సంఖ్య రోజురోజుకి అధికమవుతోంది. ఎన్నికల విధులకు హాజరైన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సహా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 15 మంది ఎండల తీవ్రతకు ప్రాణాలు కోల్పోయారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం యాటకార్లపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు లకావత్ రామన్న.. సిద్దిపేటలో శుక్రవారం జరిగిన ఎన్నికల శిక్షణకు హాజరయ్యారు. ఎండతీవ్రతకు అక్కడ అస్వస్థతకు గురై శనివారం మరణించారు. అలాగే, యాదాద్రి భువనగిరి జిల్లా జమ్మాపురం గ్రామపంచాయతీలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్న మాదాసు కసప రాజు (65) గ్రామానికి నీటిని సరఫరా చేస్తుండగా వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయారు. అలాగే, పలువురు ఉపాధి కూలీలు, రైతులు వడదెబ్బకు బలైపోయారు. కాగా, మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం లక్ష్మీపురంలో శనివారం సాయంత్రం సుమన్(26) పిడుగుపాటుకు గురై చనిపోయాడు.



వేసవి తాపానికి తాళలేక పైప్‌లైన్ నీటి వద్దకు చేరిన పిచ్చుక

### వీణవంకలో అత్యధికంగా 46.8

రాష్ట్రంలోనే అత్యధికంగా కరీంనగర్ జిల్లా వీణవంకలో శనివారం 46.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది రాష్ట్రంలోనూ, ఈ సీజన్‌లోనూ గరిష్ఠ ఉష్ణోగ్రత. ఆ తర్వాత నల్లగొండ జిల్లా తెల్దేవర్‌పల్లి, కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయ్యింది. మంచిర్యాల జిల్లా నస్పూర్‌తోపాటు వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 46.3 డిగ్రీలు, ములుగులో 46.2 డిగ్రీలు, జనగామ, వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేతేపల్లి, పెద్దపల్లి జిల్లా ఈసాల తక్కళ్లపల్లిలో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట జిల్లా మునగాల, నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి, జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిల, మహబూబాబాద్ జిల్లాలో, హనుమకొండలో 46.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కుత్బుల్లాపూర్, చందానగర్‌లో శనివారం అత్యధికంగా 44.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో మరో రెండు రోజులు అధిక ఉష్ణోగ్రతలు, వడగాలులు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

### భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

ఎండలు మండిపోతుండడంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. మరీ ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ వినియోగం భారీగా ఉంది. జీహెచ్ఎంసీ పరిధిలో ఏప్రిల్ 30న అత్యధికంగా 4,214 మెగావాట్ల డిమాండ్ రికార్డయింది. మే 3న ఏకంగా 89.71 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. గతేడాది మే 3న నమోదైన 58.34 మిలియన్ యూనిట్ల వినియోగంతో పోలిస్తే ఇది 53.7 శాతం అధికం. శనివారం రాష్ట్రమంతటా 10,880 మెగావాట్ల డిమాండ్ రికార్డయ్యింది. ఇందులో దక్షిణ డిస్కమ్ వాటా 6,516 మెగావాట్లు, గ్రేటర్ హైదరాబాద్ డిమాండ్ 4,209 మెగావాట్లుగా ఉంది. మే నెలాఖరు దాకా విద్యుత్ డిమాండ్ కొనసాగే అవకాశం ఉండడంతో విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. ఇందులో భాగంగా కార్యాలయాల్లో విధులు నిర్వర్తించే ఇంజనీర్లంతా క్షేత్రస్థాయికి వెళ్లాలని దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ అధికారులను ఆదేశించారు. శనివారం ఓ సమీక్ష నిర్వహించిన సీఎండీ... వేసవి సీజన్ ముగిసే దాకా ప్రతీ 11 కేవీ ఫీడర్‌కు ఒక ఇంజనీర్‌ను ఇన్‌చార్జిగా నియమించాలని తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## చేపల పేరుతో గొడ్డు మాంసం రవాణా

» జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో 80 బాక్సులు స్వాధీనం

» గుంటూరులో అడ్డుకునేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ యత్నం

» అధికారులతో వాగ్వాదం, అరగంట పాటు రైలు నిలిపివేత

» నల్లగొండ రైల్వేస్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న పోలీసులు

గుంటూరు, నల్లగొండ/నల్లగొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి లింగంపల్లి వెళ్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలులో 80 బీఫ్ (గొడ్డు మాంసం) బాక్సులను నల్లగొండ రైల్వే పోలీసులతో పాటు, స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైలులోని ముందు, వెనుక లగేజీ బోగీల్లో ఈ బాక్సులను గుర్తించారు. ఒక లగేజీ బోగీలో 40, మరో లగేజీ బోగీలో 40 బాక్సులను ఫిష్ లేబుల్ పేరిట తరలించడం కలకలం రేపింది. గొడ్డు మాంసం ఉన్న 80 పెట్టెలను పైన సిమెంటు సంచులతో ప్యాక్ చేసి శనివారం సికింద్రాబాద్ తరలిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు తొలుత ఈ రైలును రాజమహేంద్రవరంలోనే అడ్డుకోవాలని ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఆపేందుకు ప్రయత్నించారు. అయితే ఆర్‌పీఎఫ్ పోలీసులు వారించి తొలుత జీఆర్‌పీ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దీంతో గుంటూరు రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీకి సమాచారం ఇచ్చారు. రైలు మధ్యాహ్నం 1.55 గంటల మధ్య సమయంలో గుంటూరు రాగా అప్పటికే అక్కడికి తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి, పలువురు బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు చేరుకున్నారు. పార్సిల్ వ్యాన్ సీలు ఓపెన్ చేయాలని వారు పట్టుబట్టారు. చేపల పేరుతో గోమాంసం తరలిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం చేపల వేటపై నిషేధం కొనసాగుతోందని, అలాంటప్పుడు చేపలు ఎలా ఎగుమతి జరుగుతాయని ప్రశ్నించారు. అయితే సీలు తెరవడానికి లేదని, సికింద్రాబాద్ వెళ్లాల్సిందేనని ఆర్‌పీఎఫ్ అధికారులు తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగ్గా ఆందోళన చేస్తున్న వారిని ఆర్‌పీఎఫ్ సిబ్బంది పక్కకు లాగేశారు. రైలు బోగీలోకి ఎక్కి చైన్ లాగిన బీజేపీ కార్యకర్తని అదుపులోకి తీసుకున్నారు. అయితే గుంటూరు నుంచి రైలులో గొడ్డు మాంసం (బీఫ్) తరలిస్తున్న విషయాన్ని నల్లగొండ గవర్నమెంటు రైల్వే పోలీసులకు (జీఆర్పీ) సమాచారం అందింది. దీంతో జీఆర్పీ పోలీసులు, సివిల్ పోలీసులు సంయుక్తంగా రంగంలోకి దిగి సాయంత్రం ఐదు గంటల సమయంలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నల్లగొండ రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే నిలిపివేసి తనిఖీలు చేశారు. ఇందులో ఫిష్ లేబుల్‌తో ఉన్న ఒక బాక్సును తెరవగా లోపల గొడ్డు మాంసం కనిపించడంతో పోలీసులు ఆ బాక్సులన్నింటిని ప్లాట్ ఫాంపైకి దింపించారు. గొడ్డు మాంసం తరలింపులో ఎవరెవరి పాత్ర ఉందనే కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.

## జొన్నల కొనుగోలు పరిమితి పెంపు

» తక్కువ ధరకు అమ్ముకోకండి: తుమ్మల

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): జొన్నల కొనుగోలు పరిమితిని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఎకరాకు కొనుగోలు చేస్తున్న 8.85క్వింటాళ్ల పరిమితిని 12 క్వింటాళ్లకు పెంచింది. ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొనుగోలు ఏజెన్సీ మార్క్‌ఫెడ్‌కు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే జొన్నల కొనుగోళ్లు ప్రారంభించిన మార్క్‌ఫెడ్ క్వింటాల్‌కు రూ.3,180చొప్పున రైతులకు చెల్లిస్తోంది. జొన్న రైతులెవరూ తొందరపడి తక్కువ ధరకు పంటను విక్రయించొద్దని మంత్రి సూచించారు.

## సేల్స్ ట్యాక్స్ ఆఫీసర్‌లమంటూ వసూళ్లు

» కామారెడ్డి జిల్లాలో నలుగురు విలేకరుల అరెస్టు

సదాశివనగర్, మే 4: సేల్స్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ అధికారులమంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నలుగురు విలేకరులను శనివారం కామారెడ్డి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నిజామాబాద్ జిల్లా పెర్కిట్ గ్రామానికి చెందిన నిఖిల్ ఈ నెల 2న అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి తన స్వగ్రామానికి అశోక్ లైలాండ్ వాహనంలో గూడ్స్ సామాను తీసుకుని వెళ్తున్నాడు. అతని వాహనం కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మల్లుపేట వద్దకు రాగానే గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు కారులో వచ్చి అతని వాహనాన్ని ఆపారు. తాము సేల్స్ టాక్స్ డిపార్ట్‌మెంట్ అధికారులమని, వాహనంలో గూడ్స్ డాక్యుమెంట్లు చూపించాలని అడిగారు. ఆ తర్వాత రూ. 25 వేలు డిమాండ్ చేశారు. అడిగిన డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరించి అతని వద్ద ఉన్న రూ. 3 వేల నగదును బలవంతంగా లాక్కున్నారు. ఈ ఘటనపై నిఖిల్ సదాశివనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు శనివారం నిందితులను రిమాండ్‌కు తరలించారు.

## మీడియా సంస్థల యజమానుల ఫోన్లూ ట్యాప్

» దర్యాప్తు అధికారుల వద్ద ట్యాపింగ్ చిట్టా

» బాధితులకు ఫోన్లు చేస్తున్న అధికారులు

» ఏవైనా ఆధారాలు ఉంటే ఇవ్వాలని విజ్ఞప్తులు



హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎస్ఐబీ ప్రధాన కార్యాలయాన్ని కేంద్రంగా చేసుకుని మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అండ్ కో ట్యాప్ చేసిన దాదాపు అన్ని ఫోన్ నంబర్లను దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఇంతకాలం రాజకీయ నాయకులు, అధికారులు, వ్యాపారులకే పరిమితమైందనుకున్న ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో మీడియా సంస్థల యజమానులు, ప్రతినిధులు కూడా బాధితులేనని తేల్చారు. అప్పటి ప్రభుత్వ పెద్దలు, వారి కుటుంబ సభ్యులకు ఇబ్బంది కలిగించే వ్యక్తులందరి ఫోన్లను నిరంతరం ట్యాప్ చేసినట్లు ఇప్పటికే దర్యాప్తులో తేలిన విషయం తెలిసిందే..! తాజాగా మీడియా సంస్థల యజమానులు, ప్రతినిధుల నంబర్లు కూడా ట్యాప్ అయినట్లు తేలడంతో.. దర్యాప్తు అధికారులు వారి నుంచి కూడా అవసరమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. బాధిత రాజకీయ నాయకులతోపాటు.. వారికి కూడా ఫోన్లు చేసి, "ట్యాపింగ్ కేసులో మీరు కూడా బాధితులేనని తేలింది. మీ ఫోన్లను కూడా అప్పట్లో ట్యాప్ చేశారు. ఈ కేసుకు సంబంధించి మీ వద్ద ఏమైనా సమాచారం, ఆధారాలు ఉంటే.. మాకు అందజేయండి" అని విజ్ఞప్తి చేస్తున్నారు.



రవి మృతదేహానికి నివాళులర్పిస్తున్న పౌర హక్కుల, ప్రజా సంఘాల నేతలు

## డ్రోన్లతో విష వాయువులు వదిలి.. మావోయిస్టులపై బాంబుల వర్షం

» ఛత్తీస్‌గఢ్‌లో బూటకపు ఎన్‌కౌంటర్లు

» పౌర హక్కుల సంఘం నేత కుమారస్వామి

భీమదేవరపల్లి, మే 4: మావోయిస్టు స్థావరాలపై డ్రోన్లతో విష వాయువులు వదిలి.. వారు కోమాలోకి వెళ్లిన తర్వాత పోలీసులు బాంబుల వర్షం కురిపిస్తూ బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కుమారస్వామి అన్నారు. వారం క్రితం ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన దండకారణ్య డివిజన్ కమిటీ సభ్యుడు రవి అలియాస్ వినయ్, అలియాస్ అశోక్ మృతదేహానికి.. శనివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో వివిధ సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో నాలుగు నెలల్లో 98 మంది మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లలో బీజేపీ ప్రభుత్వం హతమార్చిందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో సైనిక క్యాంపులు ఎత్తివేయాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టుల హత్యాకాండపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కుమారస్వామి కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

# ఇక తేల్చుకోవాల్సింది జనమే!

"ఒక అద్భుతమైన లోకంలో మనం బ్రతుకుతున్నాం. ఇక్కడ శాస్త్రవేత్తలు జ్యోతిష్యం మాట్లాడతారు. బాబాలు సైన్స్ బోధిస్తారు. పౌరాణికులు చరిత్ర రాస్తారు. సినీ నటులు భక్తిని వ్యాప్తి చేస్తారు. ధనవంతులు సాదా జీవనం గురించి పాఠాలు చెబుతారు. ప్రవాస భారతీయులు దేశాన్నెలా ప్రేమించాలో చెబుతారు. నేరగాళ్లు విలువలను బోధిస్తారు. రాజకీయ నాయకులు దేవుడి గురించి మాట్లాడతారు. దేవుడు మాత్రం నిశ్శబ్దం పాటిస్తాడు!" అని దేవులపల్లి కృష్ణశాస్త్రి అనే రచయిత ఫేస్‌బుక్ పోస్ట్‌లో ఆవేదన చెందాడు. ఈయన ప్రసిద్ధ తెలుగు కవి స్వర్గీయ దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి మనవడు. ఇప్పుడు మన దేశంలోని పరిస్థితులను గమనించిన వారికి ఈ మాటలు అక్షర సత్యాలని అనిపించకమానదు. శాస్త్రవేత్తలు జ్యోతిష్యం గురించి మాట్లాడడం, బాబాలు సైన్స్ గురించి చెప్పడం చూస్తున్నాం కదా! ప్రవాస భారతీయులు దేశాన్ని ప్రేమించడం ఎలాగో చెప్పడంతోపాటు ఎన్నికల్లో కూడా పాల్గొంటున్నారు. నేరగాళ్లు, రాజకీయ నాయకుల విషయానికి

> ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్నికలు ప్రత్యేకమైనవి. జగన్‌రెడ్డి కేంద్ర బిందువుగా ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. జగన్ కావాలనుకొనేవారు ఒకవైపు, వద్దనుకొనేవారు మరొకవైపు మోహరించారు. సమాజం రెండుగా విడిపోయింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రధానం కాదు. జగన్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఇంటికి పంపాలనుకొనే వారు మరేమీ చూడటంలేదు! కులాలకు అతీతంగా కూటమినే ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. ప్రజలను ఆకర్షించడానికి పోటీపడి ప్రకటిస్తున్న పథకాల ప్రభావం కూడా ఈ ఎన్నికల్లో ఉండదు. రాష్ట్రంలో నాగరిక పాలన, అభివృద్ధి ఉండాలని కోరుకొనే వారందరూ జగన్మోహన్ రెడ్డిని ఈసారి ఇంటికి పంపాలని నిర్ణయించుకున్నారు. కులం, మతం ప్రాతిపదికన ఆలోచిస్తున్నవారు మాత్రం జగన్ వైపు ఉన్నారు. ఈ ఐదేళ్ల అరాచకాలను గమనిస్తున్నవాళ్లు బటన్ల నొక్కుడుకు పడిపోవడం లేదు.

వద్దాం! ఈ ఇరువురి మధ్య పెద్ద తేడా ఉండడంలేదు. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టుగా నేరగాళ్లే రాజకీయ నాయకులుగా అవతరిస్తున్నారు. అయితే, ఒక తేడా ఉంది. సాధారణ దొంగ మీ వ్యక్తిగత సొమ్మును మాత్రమే దోచుకుంటాడు. రాజకీయ దొంగ మాత్రం మీ భవిష్యత్తును, జీవితాన్ని, వ్యాపారాన్ని కూడా దోచుకుంటాడు. విచిత్రం ఏమిటంటే, సాధారణ దొంగ ఎవరిని దోచుకోవాలో తానే నిర్ణయించుకుంటాడు. మనల్ని దోచుకొనే రాజకీయ దొంగను మాత్రం మనమే ఎంచుకుంటాము. సాధారణ దొంగను పోలీసులు తరిమి తరిమి పట్టుకుంటారు. రాజకీయ దొంగకు ఆ పోలీసులే రక్షణ కల్పిస్తారు. ఈ మొత్తం వ్యవహారంలో తమాషా ఏమంటే సాధారణ దొంగను మనం అసహ్యించుకుంటాం! దొరికితే చావగొడతాం. రాజకీయ దొంగకు మాత్రం భజన చేస్తాం. వాడికోసం మనం పరస్పరం కొట్టుకు చస్తాం. ఇది మన సమాజంలో ఉన్న దౌర్భాగ్య పరిస్థితి. దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న వేళ ఈ మాటలు గుర్తుకు వస్తున్నాయి. శాస్త్రవేత్తలు, బాబాలు, సినీనటులు, ధనవంతుల విషయం పక్కనపెట్టి.. నేరగాళ్లు, రాజకీయ నాయకుల విషయానికి వద్దాం! ఇటీవలి కాలంలో నేరగాళ్లు బాబాలుగా కూడా అవతరిస్తుండగా ఆర్థిక నేరస్తులు రాజకీయ నాయకులుగా రూపాంతరం చెందుతున్నారు. రాజకీయ నాయకులకు దేవుడు ముడి సరుకుగా మారిపోయాడు. ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకొని బాబాలుగా అవతరించిన వాళ్లు ప్రజలను ఎన్ని విధాలుగా మోసం చేస్తున్నారో మనం చూస్తున్నాం. అదే ప్రజల బలహీనతలను అడ్డుపెట్టుకొని రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోవడం ఇప్పుడు నిత్యకృత్యం అయింది. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాలకోసం దేవుడితోపాటు కులం, మతం, ప్రాంతాన్ని కూడా వాడుకుంటున్నారు. కులం కూడు పెట్టదని తెలిసినా ఆ కులం కోసమే కొట్టుకు చస్తున్నారు. ఎన్నికల్లో ఫలానా కులం వాళ్లకు అన్ని టికెట్లు ఇచ్చాం, ఇన్ని టికెట్లు ఇచ్చాం అని ప్రకటించుకోవడం చూస్తున్నాం. మెజారిటీ కులాల వాళ్లకు మైనారిటీ కులం వాళ్లు టికెట్లు ఇవ్వడం ఏమిటి? అని ఒక్కరూ ఆలోచించరు. సామాజిక న్యాయం అంటే ఏమిటి? అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకొని ఆర్థిక, సహజ వనరులన్నింటినీ చెరబట్టిన వాళ్లు ఏ అధికారం లేని పదవులకు టికెట్లు కేటాయించడం సామాజిక న్యాయం అవుతుందా? కులం కాదు గుణం ముఖ్యం అని ఒకప్పుడు చెప్పేవాళ్లు. ఇప్పుడు అధికారం చెలాయిస్తున్న నాయకులకు ప్రజలను కులాల వారీగా విడగొట్టడం అవసరంగా మారింది.

## అయినా... పదవికి దూరమైన కేసీఆర్!

తెలుగు రాష్ట్రాల విషయానికి వద్దాం! మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కుల బలం లేదు. అందుకే ఆయన ప్రాంతీయ వాదం అందుకొని అందలం ఎక్కారు. గత ఎన్నికల్లో ప్రజలు ఆయనను ఓడించినప్పటికీ ఆత్మవిమర్శ చేసుకోకుండా తెలంగాణను పాలించే సత్తా తనకు తప్ప మరొకరికి లేదన్నట్టుగా ఆయన మాట్లాడుతున్నారు. కేసీఆర్ కూడా అధికారంలో ఉన్నప్పుడు యజ్ఞయాగాదులు నిర్వహించారు. యాదాద్రిని పునర్నిర్మించారు. అయినా దేవుడు కనికరించకుండా నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఫలితంగా కేసీఆర్ ఎన్నికల్లో ఓడిపోయారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ న్యాయ నిర్ణేతలు అని చెప్పుకొంటున్న మనమే పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు అదే ప్రజలను విస్మరిస్తాం. కేసీఆర్ కూడా ప్రజలను విస్మరించారు. అందుకే ఆయన అధికారం కోల్పోయారు. కులాలు, మతాలు, ప్రాంతాలు ఎన్నికల్లో పదే పదే ఉపయోగపడవు. 2014, 2018 ఎన్నికల్లో కేసీఆర్‌కు ఉపయోగపడిన ప్రాంతీయ వాదం 2023 ఎన్నికల్లో పనిచేయలేదు. తెలంగాణ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్దిష్టమైన లక్ష్యంతో కేసీఆర్ చర్యలను టార్గెట్‌గా చేసుకొని అందలాన్ని అందుకున్నారు. కేసీఆర్‌నుగానీ, రేవంత్‌నుగానీ ఎన్నుకున్నదీ, ఎంచుకున్నదీ ప్రజలే. వ్యవస్థలు పతనమైనప్పటికీ ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటు హక్కు ఇంకా పదిలంగానే ఉంది. అందుకే ఎంత అధికారం, ధనం ఉన్నప్పటికీ ఓటమి నుంచి కేసీఆర్ తప్పించుకోలేకపోయారు. తెలంగాణలో ప్రస్తుతం ముక్కోణపు పోటీ జరుగుతోంది. ప్రధాన పోటీ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ మధ్యే కేంద్రీకృతమైనట్టు కనిపిస్తున్నప్పటికీ భారత రాష్ట్ర సమితి కూడా కొద్దో గొప్పో పుంజుకుంటోంది. బీఆర్ఎస్ బలపడేకొద్దీ ఆ ప్రభావం బీజేపీపైన పడుతుంది. అధికారంలో ఉన్నందున కాంగ్రెస్ బలం తగ్గే అవకాశాలు తక్కువ. మనది కర్మభూమి. ఈసడించుకున్న ప్రజలే కొంతసేపటికి అయ్యో పాపం అనవచ్చు. ఈ ప్రభావం రాజకీయాల్లో కూడా కనిపిస్తుంటుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సానుభూతి పొందగలరా? లేదా? అన్నది తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడైతేగానీ తెలియదు. ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్తవ మతం ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుండగా తెలంగాణలో ముస్లింలు ప్రభావం చూపుతారు. ఇటీవల ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉమ్మడి మెదక్ జిల్లాలో మాట్లాడుతూ తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మత ప్రాతిపదికన ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వబోనని ప్రకటించారు. దీంతో ముస్లింలు అంతా కాంగ్రెస్ పార్టీకి అండగా సంఘటితం అయ్యారు. అదే సమయంలో హిందువులు బీజేపీకి అనుకూలంగా సంఘటితం అవుతారా? అంటే చెప్పలేం. తెలంగాణ సమాజాన్ని కూడా కులాల వారీగా విడదీసినందున హిందువులలో ఐకమత్యం రావడం కష్టం. ప్రధాని మోదీ మాటలు బీజేపీకి నష్టం చేస్తాయా? లాభం చేకూరుస్తాయా? అన్నది వేచిచూడాలి.

> మనది కర్మభూమి. ఈసడించుకున్న ప్రజలే కొంతసేపటికి అయ్యో పాపం అనవచ్చు. ఈ ప్రభావం రాజకీయాల్లో కూడా కనిపిస్తుంటుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సానుభూతి పొందగలరా? లేదా? అన్నది తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడైతేగానీ తెలియదు.

## ఏపీలో ఇలా...

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు వద్దాం! అక్కడి రాజకీయాలను పరిశీలిస్తే పైన చెప్పిన ఫేస్‌బుక్ సూక్తి మళ్లీ గుర్తుకొస్తుంది. ఆర్థిక నేరగాళ్లు విలువలను బోధిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డినే తీసుకుందాం. ఆయన అనేక ఆర్థిక నేరాల్లో నిందితుడిగా ఉన్నారు. అయినా విలువలు బోధిస్తున్నారు. రాజకీయాలు ఇంతగా కలుషితమయ్యాయా? అని ఈసడించుకుంటున్నారు. రాజకీయాలే కాదు సమాజం కూడా కలుషితమైనందునే తాను ముఖ్యమంత్రిని కాగలిగానని ఆయన విస్మరిస్తున్నారు. దేవుడి ప్రస్తావనను కూడా జగన్మోహన్ రెడ్డి తరచుగా తీసుకువస్తారు. ఆ దేవుడి చల్లని దీవెనలతో అని అంటూ ఉంటారు. మరి కొద్ది రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో మరింత గొప్ప స్క్రిప్ట్ రాసే పనిలో దేవుడు బిజీగా ఉన్నట్టు ఆయన చెబుతున్నారు. ఆ స్క్రిప్ట్ ఎలా ఉండబోతున్నదో మరో నెల రోజుల్లో తేలిపోనుంది. ధనవంతులు నిరాడంబర జీవనం గురించి పాఠాలు చెబుతారు అన్న మాటలు కూడా జగన్మోహన్ రెడ్డికి వర్తిస్తాయి. దేశంలోకెల్లా ధనిక ముఖ్యమంత్రిగా రికార్డులకెక్కిన ఆయన క్లాస్‌వార్‌లో భాగంగా తాను పేదలకు ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పుకొంటున్నారు. రాజకీయ నాయకులకు భజన చేసేవాళ్లు ఉండనే ఉంటారు కనుక జగన్మోహన్ రెడ్డిని పేదల ప్రతినిధిగా అభివర్ణించడానికి కొంతమంది సిద్ధమయ్యారు. సామాజిక న్యాయం గురించి జగన్మోహన్ రెడ్డి తరచుగా ప్రవచిస్తున్నారు. అతగాడి పాలనలో సామాజిక న్యాయానికి నిర్వచనమే మారిపోయింది. అయితే, 'ఆహా ఓహో' అని కీర్తించేవారికి ఆయన రోత మీడియాలో స్థానం లభిస్తోంది. దేశ రాజకీయాల్లోనే ఏ నాయకుడూ చేయని విధంగా జగన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటించారని ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల్లో కొంత మందికి కొన్ని టికెట్లు ఇచ్చినంత మాత్రాన సామాజిక న్యాయం జరిగినట్టేనా? 'నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలూ' అని జగన్ రాగాలు తీసి పాడుతున్నారు సరే, ఆ వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా పురోగతి సాధించాయా? అంటే లేదనే చెప్పుకోవాలి. అధికారం, ధనం, వనరులు అన్నీ జగన్మోహన్ రెడ్డి వద్ద కేంద్రీకృతమైనప్పుడు సామాజిక న్యాయం ఎలా సాధ్యం? ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ముఖ్యమంత్రి సామాజిక వర్గానికి చెందినవారే కదా ఉన్నారు? చట్టాలు, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారమే బడుగులకు చట్టసభలు, ఇతర పదవుల్లో వాటా లభిస్తోంది. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఐదుగురికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చానని గొప్పలు చెప్పుకొంటున్నారు గానీ ఆ ఐదుగురూ ఎవరో, వారికి ఉన్న అధికారం ఏ పాటిదో సదరు ఉప ముఖ్యమంత్రులకు కూడా తెలియదు. పార్టీలో, ప్రభుత్వంలో జగన్ సామాజిక వర్గానికి చెందిన వారే రాజ్యం ఏలుతున్నప్పుడు సామాజిక న్యాయం పాటించినట్టు ఎలా అవుతుంది? అధికారంలో వాటా దక్కనీయకుండా సామాజిక న్యాయం సాధించామని అనడం నేతి బీరకాయలో నెయ్యి చందంగానే ఉంటుంది.

## అటూ... ఇటూ!

తాము దగా పడుతున్నామా, లాభపడుతున్నామా అన్నది తెలుసుకోవాల్సింది ఆంధ్రప్రదేశ్ ప్రజలే. జగన్మోహన్ రెడ్డి వంటి వారు అధికారంలో కొనసాగడానికి అర్హులా? కాదా? అన్నది కూడా ఈ ఎన్నికల్లో ప్రజలే నిర్ణయించుకోవాలి. తల్లిని, చెల్లిని సైతం విసిరికొట్టిన వ్యక్తి నైజం తెలుసుకోవడం అవసరం. అమ్మకు అన్నం పెట్టని వాడు పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తానని అన్నాడట... అని దివంగత రాజశేఖర రెడ్డి తరచూ అంటూ ఉండేవారు. తన మాటలు తన కుమారుడికే వర్తించబోతున్నాయని ఆనాడు ఆయనకు తెలియదు పాపం. తల్లినీ చెల్లినీ దూరం చేసుకున్న జగన్ బహిరంగ సభల్లో మాత్రం అక్కచెల్లెమ్మలు అని మహిళలను ఉద్దేశించి అంటూ ఉంటారు. రక్తం పంచుకు పుట్టిన వాళ్లకే న్యాయం చేయడానికి నిరాకరిస్తున్న జగన్, పరాయి మహిళలకు న్యాయం చేస్తారా? ఆయనకు రక్త సంబంధాలు ముఖ్యం కాదు— తాను అధికారంలో కొనసాగడమే ప్రధానం. అందుకోసమే క్లాస్ వార్, కులం, మతం వంటి మాటలను తరచుగా వాడుతుంటారు. రాజకీయ ప్రత్యర్థులను నీచులుగా అభివర్ణిస్తారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్నికలు ప్రత్యేకమైనవి. జగన్‌రెడ్డి కేంద్ర బిందువుగా ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. జగన్ కావాలనుకొనేవారు ఒకవైపు, వద్దనుకొనేవారు మరొకవైపు మోహరించారు. సమాజం రెండుగా విడిపోయింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రధానం కాదు. జగన్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఇంటికి పంపాలనుకొనేవారు మరేమీ చూడటంలేదు! కులాలకు అతీతంగా కూటమినే ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. ప్రజలను ఆకర్షించడానికి పోటీపడి ప్రకటిస్తున్న పథకాల ప్రభావం కూడా ఈ ఎన్నికల్లో ఉండదు. రాష్ట్రంలో నాగరిక పాలన, అభివృద్ధి ఉండాలని కోరుకొనే వారందరూ జగన్మోహన్ రెడ్డిని ఈసారి ఇంటికి పంపాలని నిర్ణయించుకున్నారు. కులం, మతం ప్రాతిపదికన ఆలోచిస్తున్నవారు మాత్రం జగన్ వైపు ఉన్నారు. ఈ ఐదేళ్ల అరాచకాలను గమనిస్తున్నవాళ్లు బటన్ల నొక్కుడుకు పడిపోవడం లేదు.

## పరాకాష్ఠకు ఫొటోల పిచ్చి

ప్రజల గుండెల్లో తాను పదిలంగా ఉండేలా తన పాలన ఉంటుందని అధికారంలోకి వచ్చిన కొత్తలో జగన్ చెప్పారు. ఐదేళ్లు గడిచే సరికి ప్రజల గుండెల్లో ఉండే విషయం అలా ఉంచితే, ప్రజలు తనను గుర్తుపెట్టుకుంటారా అన్న అనుమానం ఆయనకు వచ్చినట్టుంది! అందుకే, ప్రతిచోటా తన ఫొటో ముద్రిస్తున్నారు. రైతుల వ్యక్తిగత ఆస్తి పత్రాలైన పట్టాదారు పాసు పుస్తకాలలో ప్రతి పేజీలో ఆయన తన ఫొటోను ముద్రింపజేస్తున్నారు. పరిమిత కాలం మాత్రమే అధికారంలో ఉండే ముఖ్యమంత్రికి శాశ్వతంగా ఉండే ఆస్తి పత్రాలపై తన ఫొటోలు ముద్రించుకొనే అధికారం ఉంటుందా? బలహీనవర్గాలకు కేటాయించిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన స్టాంప్ పేపర్లపై కూడా ఆయన ఫొటోను ముద్రించుకోవడం పరాకాష్ఠ. స్టాంప్ పేపర్‌పై ఇలా ఫొటోలు ముద్రించడాన్ని చట్టం అనుమతించదు. అందుకే బ్యాంకులు సదరు స్టాంప్ పేపర్ డాక్యుమెంట్లను తిరస్కరిస్తున్నాయి. జగన్మోహన్ రెడ్డి ముచ్చటపడుతున్నారే అనుకుందాం— చట్టం సమర్థించని విధంగా స్టాంప్ పేపర్లపై ఆయన ఫొటో ముద్రింపజేసిన అధికారిని సన్నాసి అంటే కూడా తప్పులేదు. నాయకులు ప్రజల గుండెల్లో ఉండాలిగానీ ఆస్తి పత్రాలపై కాదు. ఈ చిన్న లాజిక్‌ను మరచిపోయిన జగన్మోహన్ రెడ్డికి, ఆయన ఆజ్ఞలను అమలు చేస్తున్న అధికారులకు భారతదేశ చట్టాలపై శిక్షణ ఇప్పిస్తే మంచిది. గతంలో కూడా రంగుల పిచ్చితో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భవనాలపై వైసీపీ రంగులు వేసి వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారు. స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించి, తీరా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వదేశీయుడి చేతిలో హత్యకు గురైన మహాత్మా గాంధీ తనను జాతిపితగా గుర్తించి గౌరవించాలని కోరలేదే! దేశం ఆయనకు ఇచ్చిన గౌరవం అది. అధికారంలో ఒక్కరోజు కూడా లేని నాయకులను కూడా మనం గుర్తించి గౌరవించుకున్నాం. ఎమర్జెన్సీ కాలంలో నాటి ప్రధాని ఇందిరాగాంధీ కుమారుడు సంజయ్‌గాంధీ జనాభా నియంత్రణ కోసం ప్రజలకు బలవంతంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించారు. ఇప్పుడు మళ్లీ ఇంత కాలానికి జగన్‌రెడ్డి ప్రతి ఒక్కరి ఇంట్లో తన ఫొటో ఉండాలని కోరుకుంటున్నారు. ఒకవేళ మళ్లీ ఆయనే అధికారంలోకి వస్తే ప్రజల గుండెలపై బలవంతంగా తన బొమ్మను పచ్చబొట్టుగా వేయించినా ఆశ్చర్యపోవలసింది ఏమీ లేదు. నేరగాళ్లు రాజకీయాల్లోకి వచ్చి అధికారం అందుకుంటే పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పడానికి ఆంధ్రప్రదేశ్‌లోని పరిస్థితులే నిదర్శనం.

> ఎన్నికల్లో కొంతమందికి కొన్ని టికెట్లు ఇచ్చినంత మాత్రాన సామాజిక న్యాయం జరిగినట్టేనా? 'నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలూ' అని జగన్ రాగాలు తీసి పాడుతున్నారు సరే, ఆ వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా పురోగతి సాధించాయా? అంటే లేదనే చెప్పుకోవాలి. అధికారం, ధనం, వనరులు అన్నీ జగన్మోహన్ రెడ్డి వద్ద కేంద్రీకృతమైనప్పుడు సామాజిక న్యాయం ఎలా సాధ్యం? ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ముఖ్యమంత్రి సామాజిక వర్గానికి చెందినవారే కదా ఉన్నారు? చట్టాలు, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం బడుగులకు చట్టసభలు, ఇతర పదవుల్లో వాటా లభిస్తోంది. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఐదుగురికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చానని గొప్పలు చెప్పుకొంటున్నారు గానీ ఆ ఐదుగురూ ఎవరో, వారికి ఉన్న అధికారం ఏ పాటిదో సదరు ఉప ముఖ్యమంత్రులకు కూడా తెలియదు. పార్టీలో, ప్రభుత్వంలో జగన్ సామాజిక వర్గానికి చెందిన వారే రాజ్యం ఏలుతున్నప్పుడు సామాజిక న్యాయం పాటించినట్టు ఎలా అవుతుంది?

## రూల్ ఆఫ్ లా... ఏదీ?

జగన్ పాలనలో ఏ వ్యవస్థకు కూడా గౌరవం లేదు. ఇసుక అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టు స్వయంగా ఇచ్చిన ఆదేశాలు కూడా రాష్ట్రంలో అమలు కావడం లేదంటే పాలనా యంత్రాంగం ఎంత భ్రష్టుపట్టి పోయిందో అర్థం చేసుకోవచ్చు. న్యాయస్థానాలు ఆదేశాలు మాత్రమే ఇవ్వగలవు. వాటిని అమలుచేసే యంత్రాంగం న్యాయస్థానాల వద్ద ఉండదు. అందుకే జగన్‌రెడ్డి సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్కచేయడం లేదు. ఇటువంటి ధోరణులకు అడ్డుకట్ట పడని పక్షంలో ఆంధ్రప్రదేశ్‌లో రూల్ ఆఫ్ లా కుప్పకూలిపోతుంది. ఇదే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ ఉంటుందా? అన్న సందేహం కలగక మానదు. ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో ప్రజల వ్యక్తిగత ఆస్తులకు కూడా భద్రత ఉండదు. వివాదాలు సృష్టించి కబ్జాలకు పాల్పడతారు. దేవుడిని, మతాన్ని విశ్వసించే జగన్మోహన్ రెడ్డి ప్రజలు ఇచ్చిన అధికారంతో న్యాయపాలన చేయాలన్న సూత్రాన్ని ఎలా విస్మరిస్తున్నారో తెలియదు. కృష్ణశాస్త్రి చెప్పిన అద్భుతలోకం జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో ఆవిష్కృతమైంది. దేవుడు నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ ప్రకృతి తన ధర్మాన్ని నిర్వర్తిస్తూనే ఉంటుంది. అధర్మం పెచ్చరిల్లినప్పుడు ప్రకృతి విధిగా కల్పించుకుంటుంది. గుంటూరు జిల్లాలో జన సేనాని పవన్ కల్యాణ్ కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను దుండగులు ధ్వంసం చేయడం వంటి దురాగతాలు జగన్ పాలనలోనే సాధ్యం. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఉంది. అయినా దుండగులు బరితెగించి మరీ హెలిప్యాడ్‌ను ధ్వంసం చేయగలిగారంటే రూల్ ఆఫ్ లా అమలు కావడం లేదని భావించాల్సిందే. ఈ దుస్థితిని చక్కదిద్దడానికి ప్రకృతి రంగ ప్రవేశం చేయవలసిందే. చూద్దాం! ఏం జరగనుందో! జగన్ చెబుతున్నట్టు దేవుడు రాయబోతున్న స్క్రిప్ట్ ఎలా ఉండబోతున్నదో వేచి చూద్దాం!




> జగన్ పాలనలో ఏ వ్యవస్థకు కూడా గౌరవం లేదు. ఇసుక అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టు స్వయంగా ఇచ్చిన ఆదేశాలు కూడా రాష్ట్రంలో అమలు కావడం లేదంటే పాలనా యంత్రాంగం ఎంత భ్రష్టుపట్టి పోయిందో అర్థం చేసుకోవచ్చు. న్యాయస్థానాలు ఆదేశాలు మాత్రమే ఇవ్వగలవు. వాటిని అమలుచేసే యంత్రాంగం న్యాయస్థానాల వద్ద ఉండదు. అందుకే జగన్‌రెడ్డి సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్కచేయడం లేదు. ఇటువంటి ధోరణులకు అడ్డుకట్ట పడని పక్షంలో ఆంధ్రప్రదేశ్‌లో రూల్ ఆఫ్ లా కుప్పకూలిపోతుంది. ఇదే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ ఉంటుందా? అన్న సందేహం కలగక మానదు. ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో ప్రజల వ్యక్తిగత ఆస్తులకు కూడా భద్రత ఉండదు. వివాదాలు సృష్టించి కబ్జాలకు పాల్పడతారు. దేవుడిని, మతాన్ని విశ్వసించే జగన్మోహన్ రెడ్డి ప్రజలు ఇచ్చిన అధికారంతో న్యాయపాలన చేయాలన్న సూత్రాన్ని ఎలా విస్మరిస్తున్నారో తెలియదు.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

---

## సాధికారత ఎవరికి?

చుట్టూ మోహరించిన
కార్పొరేట్ బలాల నిఘాలో
ఈవీఎంలలో నిక్షిప్తమైన
మన వర్తమాన దేశ భవిష్యత్తు,
మీడియా స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ—
ఊగిసలాటలో మోకరిల్లిన దుర్దశలో
భయం నీడలో మూలుగుతున్న
ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యం,
నిత్యావసర ధరల సుడిగుండంలో చిక్కి
విలవిలలాడుతున్న పౌరజీవితం
ఏ కూటమి గెలిచినా
వొరిగేదేమిటనే సామాన్యుడి నిర్వేదం,
ఉపాధి—మనుగడకు గ్యారంటీ ఇవ్వలేని
ఒకే ఒక వ్యక్తి ఆరాధనాస్వామ్యంలో
లోక్‌సభ నామినేషన్ల పరుగులో
కోటీశ్వరులదే ముందంజ—
నిజంగానే ఇది
శ్రమవిలువను కాజేస్తున్న సంపన్నుల దేశం!
నిత్యం గంగ కావేరీ తీరాలలో
మహాహారతిలో కరిగిపోతున్న కోట్ల ఆశలు,
కృష్ణాగోదావరి ప్రవాహాల సాక్షిగా
వ్యక్తిగత క్షుద్ర రాజకీయాల బురదను
పోటీపడుతూ మోస్తున్న ఊరేగింపులు,
ఇంతకు ఎవరికోసమీ సాధికారత?
వోటర్లకా? రాజకీయ దళారులకా?

– నిఖిలేశ్వర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

# రాజభోగం

అన్ని పనులూ స్వయంగా చేసుకునేవాడు రాజెందుకవుతాడు?

రాజులను చారచక్షువులంటారు. అంటే రాజుకు గూఢచారులే కళ్ళు అన్నమాట. రాజుకు గూఢచారులే చూసి పెడతారు. మంత్రులే ఆలోచించి పెడతారు. సైన్యాధిపతులే యుద్ధాలు చేసి పెడతారు. మంత్రులు, సైన్యాధిపతులు కలిసి రాజ్యాలు జయించి పెడతారు. కవులు కావ్యాలు రాసి పెడతారు. వందిమాగధులు కీర్తిని సంపాదించి పెడతారు. అంటే కీర్తిని కూడా స్వయంగా సంపాదించుకోనక్కరలేదు.

విచిత్ర వీర్యుడి లాంటి వ్యసనపరుడికి భీష్ముడి లాంటి నమ్మిన బంటులు స్వయంవరాలకి వెళ్లి అందమైన రాకుమార్తెలను లాక్కొచ్చి పెళ్ళి చేస్తారు. వాడు చస్తే సంతానాన్ని కూడా సపె[illegible]స్తారు చచ్చినోడి ఎకౌంట్‌లో. గుడ్డి పెళ్ళికొడుకుని చూపించకుండా, గుడ్డివాడని చెప్పకుండా గాంధార దేశం లాంటి దూరదేశం నుంచి గాంధారి లాంటి అందమైన రెడీమేడ్ అమాయక పతివ్రతను తెచ్చి పెళ్ళి చేస్తారు. అనుభవించడమే గుడ్డి రాజు పని. రాజ్యమును భోగించడమే అతడి పని. దుర్యోధనుడి లాంటి ఆశబోతు తన భోగం కోసం పదిహేను అక్షౌహిణుల జనాన్ని చంపి, ఆ తర్వాత చిట్టచివరికి తను చచ్చాడు.


రాజుకు పిండివంటలన్నీ రుచి చూసి పెట్టే వాళ్ళు ఉంటారు. ఏమో ఎవరైనా విషం కలిపారేమో... డేంజరు కదా! టేస్టర్లు టేస్ట్ చేసి ఓకే అన్న తర్వాతే రాజు తింటాడు. రాజు బతికుండగా స్వయంగా చేసుకునేవి ఆహార నిద్రా మైథునాలే. అన్నీ అయ్యాక చివరికి చావడం మాత్రం స్వయంగా చేయక తప్పదు. అయినా రాచపీనుగు ఒంటిగా పోదు. తోడుగా ఇంకొక బంటు శవాన్ని శ్మశానానికి పంపుతారు.

నేనేదో వేళాకోళంగా అంటున్నాననుకోకండి. ఇప్పుడూ అటువంటి 'పాలకులు' ఉన్నారు. ఇది ప్రజాస్వామ్యం కనుక రాజులకు బదులు మంత్రులున్నారు. వీళ్ళల్లో కూడా చాలామందికి భోగించడమే పని. అన్ని పనులు చేసి పెట్టే వాళ్ళు ఉంటారు. వీళ్ళ తరపున సంతకాలు చేసి, సాక్ష్యాలు చెప్పి, జైళ్ళకి పోయేవాళ్ళు ఉంటారు. పరిహారంగా ఎంగిలి చేయి విదిలిస్తారు. హత్యలైతే యావజ్జీవ కారాగార శిక్షలు కూడా అనుభవిస్తారు.

స్వయంగా యుద్ధం చేసేవారు, స్వయంగా కవిత్వం రాసేవారు, స్వయంగా పాలన చేసేవారు కృష్ణదేవరాయల్లాంటి వాళ్ళు అరుదుగా ఉంటారు.

మనం చేసుకోలేని పనిని డబ్బిచ్చి ఎవరి చేతనో చేయించుకుంటాం. వండుకోలేకపోతే వండిపెట్టే వాళ్ళని, గిన్నెలు తోమిపెట్టే వాళ్ళని, ఇల్లూడ్చిపెట్టే వాళ్ళని కిరాయికి తెచ్చుకుంటాం. రాజస్థాన్‌లో అయితే ఏడ్చేవాళ్ళు కూడా దొరుకుతారట. రాజులు, జమీందార్ల ఇంట్లో ఎవరైనా చచ్చిపోతే తాము ఏడవకుండా తమ బదులు ఏడ్చేవాళ్ళని కిరాయికి తెచ్చుకుంటారు. అలా ఏడ్చేవాళ్ళని (ఆడ వాళ్ళని) 'రుదాలీ' అంటారు. రోగమొచ్చి, ఓపిక లేక మూలుగు వస్తే మూలిగేవాళ్ళని కూడా కిరాయికి తెచ్చుకుంటారేమో అక్కడ! 'రుదాలీ'ల గురించి కల్పనా లాజ్మి అనే ఆవిడ హిందీలో సినిమా తీసింది. 1992లో ఆ చిత్రం విడుదలైయింది.

ఈ వ్యాసంలో ఇంతవరకు చెప్పినవి చాలామందికి తెలిసిన విషయాలే. కాని, మన సంగీత సాహిత్య చరిత్రకారులు, విమర్శకులు, పండితులు చెప్పిన మాటలన్నీ నిజాలేనని



> రాజు బతికుండగా స్వయంగా చేసుకునేవి ఆహార నిద్రా మైథునాలే. అన్నీ అయ్యాక చివరికి చావడం మాత్రం స్వయంగా చేయక తప్పదు. అయినా రాచపీనుగు ఒంటిగా పోదు. తోడుగా ఇంకొక బంటు శవాన్ని శ్మశానానికి పంపుతారు. నేనేదో వేళాకోళంగా అంటున్నాననుకోకండి. ఇప్పుడూ అటువంటి 'పాలకులు' ఉన్నారు. ఇది ప్రజాస్వామ్యం కనుక రాజులకు బదులు మంత్రులున్నారు. వీళ్ళల్లో కూడా చాలామందికి భోగించడమే పని.

నమ్మవలసి వస్తే మన దేశంలోనే కాదు యావత్ ప్రపంచంలోనే కంఠీరవ రాజు వంటి అసాధారణ ప్రజ్ఞావంతుడు ఇంతకు ముందు పుట్టలేదు, ఇకముందు పుట్టబోడు. అంతటి అదృష్టవంతులు కూడా ఉండరు. ఇంతకీ ఎవరా 'మహా' పురుషుడు? అతడి పూర్తి పేరు కంఠీరవ నరసరాజు. క్రీస్తు శకం 1704 నుంచి 1713 వరకు మైసూరును పరిపాలించిన రాజు. అతడి గురించి ప్రత్యేకంగా మహాద్భుత విశేషంగా చెప్పుకోవలసినదేమిటంటే అతడు పుట్టు మూగవాడు, పుట్టు చెవిటివాడు. మూకరసు (మూగ రాజు) అనేది అతడి నామాంతరం. మాతృభాష కన్నడం అయినప్పటికీ సంస్కృతం, ప్రాకృతం, కన్నడం, తెలుగు, తమిళం భాషలలో యక్షగానాలు ఇతర కవితా రచనలు చేశాడట. అంతేకాదు సంగీత నాట్యాలలో విశారదుడట. 'వినికిడి', 'పలుకుబడి' అసలే లేని ఈ రాజు కేవలం హస్తసంజ్ఞలతోనే పదేళ్లు ప్రజారంజకంగా రాజ్యపాలన చేశాడట.

పుట్టుకతోనే మూగవాడు, చెవిటివాడు అయిన తాను సంగీత సాహిత్య నృత్య కళల సమాహారమైన యక్షగానాలు రచించాడు అని చెప్పుకుంటే జనం తన మొహం మీద కాకపోయినా చాటుగానైనా నవ్వుకుంటారేమోనన్న అనుమానం అతడికి రాలేదు. వచ్చినా 'డోంట్ కేర్. అయితే ఏంటంటా' అనుకున్నాడు. ఈ రాజు మీద సుప్రసిద్ధ సాహిత్య విమర్శకుడు నిడదవోలు వెంకటరావు గారు ఏడు దశాబ్దాల క్రిందట 1952లో 'భారతి' సాహిత్య పత్రిక రెండు వరుస సంచికలలో సుదీర్ఘ వ్యాసం రచించారు. ఆ వ్యాసాన్ని 'స్వరార్ణవం' మొదటి సంపుటంలో ప్రచురించాం. నిడదవోలు వారి వ్యాసంలో కొద్ది వాక్యాలు మచ్చుకు—

"...సాహిత్య పథకము యొక్క పరిణామమును సంగీత సాహిత్యములకు గల పరస్పర సంబంధమును వ్యక్తము సేయుచు, నంధ్రతాముద్రను ప్రదర్శించు నీయక్షగానములు మిక్కిలి సూక్ష్మముగా పరిశీలింపదగినవి. అట్టివానిలో నీవఱకు పరిశోధకుల కెఱుగ రాకుండ కాల గర్భము నణగియున్న కంఠీరవ రాజు యక్షగానకృతులను గూర్చి, పదములను గూర్చి నేడు తెలుపుచున్నాను".

"... ఇతడు పుట్టుకచే మూగవాడును, చెవిటి వాడునై యుండెను. అందుచే నీతనికి 'మూకరసు' అను నామాంతరము. కేవలము హస్తసంజ్ఞల తోడనే రాజ్య కార్యములను నిర్వహించెడివాడు. అయితే భగవంతుడేదేని యంగవైకల్యమును గలిగించినపుడా వ్యక్తికేదేనొక విలక్షణమైన శక్తిని ప్రసాదించును. కంఠీరవ రాజునకు కమనీయమగు కవన శక్తియేగాక బహుభాషా వేతృత్వమును పరమేశ్వరుడు ప్రసాదించినాడు. ఇతని యక్షగాన రచనముల మూలమున నితడు సంగీత సాహిత్య నాట్య విద్యలందు నేర్పరియగుటతో పాటు సంస్కృతమున, ప్రాకృతమున, మాతృభాషయగు కన్నడమున, తెనుగున, తమిళమున కవితారచన చేయగలవాడని విశదమగుచున్నది. ఈతని విద్యా విశేషము మైసూరు చరిత్రకారులెవ్వరును నీవఱకు గుర్తించియుండలేదు.

"ఈ యక్షగాన రచనల వలన నీతడు దక్షిణాంధ్ర వాఙ్మయమునకేకాక యాంధ్ర వాఙ్మయమున గల రాజకవులలోనొక 'ప్రశస్తకవిగా నెన్నదగినవాడు".

అదీ సంగతి —

కంఠీరవ రాజుతోపాటు నిడదవోలు వారి 'ప్రతిభ'ను మెచ్చుకోవాల్సిందే.

■ నం.పా.సా

# మిర్చి రైతు విలవిల..

మిర్చి రైతు బతుకు ఆగమవుతోంది. ఆరుగాలం శ్రమించి పండించిన మిర్చికి మార్కెట్‌లో ధర లేదు. గతేడాదితో పోల్చితే ఈసారి మిర్చి ధరలు భారీగా పడిపోయాయి. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్దతు ధర కోసం ఎదురుచూసే అన్నదాతలు.. పంటను కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకుందామంటే బస్తాపై కిరాయి మోత మోగిస్తున్నారు. అటు ధర లేక.. ఇటు స్టోరేజీల్లో పెరిగిన నిల్వ ఫీజులతో రైతులు విలవిలలాడుతున్నారు. దీంతో తక్కువ ధరకు మిర్చిని అమ్ముకోవడమా లేదా పెంచిన అధిక కిరాయి చెల్లించి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేయడమా.. అర్థంకాక ఇబ్బందులు పడుతున్నారు. అయితే మార్కెటింగ్ అధికారులు అండతో అడ్తిదారులే కోల్డ్ స్టోరేజీలను తమ గుప్పిట్లో పెట్టుకుని రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

- ఈ ఏడాది భారీగా పడిపోయిన ధరలు
- పెట్టుబడి కూడా రాక రైతన్న దిగాలు
- ధరల్లేకపోవడంతో కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వకు మొగ్గు
- ఏనుమాముల మార్కెట్‌లో పరిధిలో 27లక్షలకు పైగా బస్తాల నిల్వ సామర్థ్యం
- బస్తాకు రూ.160 కిరాయి కాగా, రూ.250కి పైగా వసూళ్లు
- అడ్తీదారుల గుప్పెట్లో కోల్డ్‌స్టోరేజీలు!

6



వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు (ఫైల్)



కొడకండ్లలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

## కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కొడకండ్ల మండలంలో విస్తృత ప్రచారం

వివరాలు : 7లో..

## హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య

- రాజ్యాంగ రక్షణకు కాంగ్రెస్‌ను గెలిపించాలి
- వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య
- ఆర్ఎన్ఆర్ గార్డెన్స్‌లో కాజీపేట మండల బూత్ కమిటీ విస్తృతస్థాయి సమావేశం

వివరాలు : 7లో..

## భారత్‌కు మోదీ నాయకత్వం అవసరం

- బీజేపీకి సంపూర్ణ మద్దతు అందించాలి
- మోదీ ఆశీస్సులతో వరంగల్ రూపు రేఖలను మారుస్తా..
- ఏకశిల పార్కులో వాకర్స్‌తో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

వివరాలు : 7లో..



హనుమకొండ ఏకశిల పార్కులో ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్

శనివారం ఉష్ణోగ్రత
గరిష్ఠం : 46.0°C
కనిష్ఠం : 27.5°C

## గంజాయి ముఠా అరెస్టు

ఏపీ నుంచి నగరానికి రవాణా ▸ 9.5కిలోల గంజాయి స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, మే 4: చింత పండు, యూరియా బస్తాల మధ్య గంజాయి రవాణా చేస్తున్న నలుగురు ముఠా సభ్యులను హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి పోలీసులు రూ.2 లక్షల 35వేల విలువైన 9.5కిలోల గంజాయితో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, చింత పండు బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి శనివారం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా వీర్లపాడు మండలానికి చెందిన ఈదర కృష్ణనాగేశ్వర్‌రావు, ఆనుమోలు వెంకటరమణలు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి వ్యాపారానికి సిద్ధపడ్డారు. ప్రస్తుతం పరారీలో ఉన్న సీలేరుకు చెందిన సరేష్ వద్ద గంజాయి కొనుగోలు చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా చింతపండు, యూరియా బస్తాల మధ్య గంజాయిని భద్రపరిచి హనుమకొండలో తమకు పరిచయం ఉన్న మహ్మద్ అబ్దుల్‌రహీమ్, మహారాష్ట్రకు చెందిన త్రిపాఠిలకు విక్రయించేందుకు శుక్రవారం హనుమకొండ బస్టాండ్ చేరుకున్నారు. ఏపీ నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు బస్టాండ్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై శ్రావణ్ సిబ్బందితో హుటాహుటిన బస్టాండ్‌కు చేరుకున్నారు. ఏపీ నుంచి వచ్చిన ఇద్దరు నిందితులు హనుమకొండకు చెందిన ఇద్దరి నిందితులకు గంజాయిని విక్రయించే క్రమంలో ఎస్సై శ్రావణ్ తన సిబ్బందితో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నిందితులు గంజాయి క్రయ విక్రయాలను జరుపుతున్నట్లు వెల్లడైంది. నిందితుల నుంచి గంజాయి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎస్సై శ్రావణ్‌తో పాటు హనుమకొండ పోలీస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సైలు శ్రీనివాస్, పరుశురాములు, పోలీసు సిబ్బంది భాస్కర్, కిరణ్, శివ, గౌస్‌పాష పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

▸ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, మే 4: ఓటర్లు మే 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ సూచించారు. శనివారం స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్యంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా హనుమకొండ కలెక్టర్ నుంచి అదాలత్ కూడలి వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ ఓటరు అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ ఆధ్వర్యంలో విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పండుగ అయిన ఎన్నికల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ నాగపద్మజ, మెప్మా పీడీ భద్రునాయక్, హరిప్రసాద్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### నేడు 5కే రన్

వరంగల్ కలెక్టరేట్: ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ఆదివారం నిర్వహించనున్న 5కే రన్‌ను విజయవంతం చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కు వేసేలా చైతన్యం తీసుకొచ్చేందుకే 5కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## నేడు నీట్


- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 5,445 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైతే నో ఎంట్రీ



ఓ సెంటర్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న సిటీ కోఆర్డినేటర్ మంజులాదేవి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 4: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నీట్-2024 పరీక్ష ఆదివారం జరుగనుంది. పూర్తిగా ఆఫ్‌లైన్‌లో జరుగనున్న పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నీట్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం. మంజులాదేవి తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,445 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. అన్ని పరీక్షా కేంద్రాలకు ఎన్‌టీఏ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్, ఫ్రిస్కింగ్ యంత్రాలు, సీసీ కెమెరాల ఏర్పాట్లు చేశారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కోఆర్డినేటర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష ఉంటుందని, ఉదయం 11.30 నుంచే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తామని ఆమె చెప్పారు. అయితే మధ్యాహ్నం 1.30 దాటితే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించరని ఆమె స్పష్టం చేశారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను ఎలాంటి పరిస్థితుల్లో పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని ఆమె స్పష్టం చేశారు.





# పారిశుధ్య డ్రైవర్లకు అందని వేతనాలు

- మూడు మాసాలుగా జీతాలు లేక పస్తులు
- దీనావస్థలో 163 మంది డ్రైవర్ కం ఓనర్లు
- కమిషనర్ స్పందించాలని వేడుకోలు



నగరంలో పని చేస్తున్న స్వచ్ఛ ఆటో కార్మికులు



వరంగల్ కార్పొరేషన్, మే 4 : గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేసే స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. దీంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. గతంలో క్రమం తప్పకుండా నెలవారి జీతా లు బ్యాంకులలో జమ అయ్యేవని, ఇప్పుడు సక్రమంగా జీతాలు రాక తమ జీవి తాలు అగమ్యగోచరంగా మారాయని మనోవేదనకు గురవుతున్నారు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు మూడు మాసా ల డబ్బులు నేటికీ అందలేదని ఆరోపిస్తు న్నారు. దీనిపై సం బంధిత అధికారులకు ఎన్నిసార్లు కలిసి విన్నవించినా కాల యాపన చేస్తున్నారని మండిపడుతున్నారు.

### 163 మందికి అందని జీతాలు

వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో కాలనీల నుంచి స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరించేందుకు ఓనర్ కం డ్రైవర్లు 163 మంది పని చేస్తున్నారు. వీరికి నగర పాలక సంస్థ కాంట్రాక్టర్ నుంచి ఒక్కరికి నెలకు రూ.15వేల జీతంతో పాటు రూ.4వేల ఇతర అలవెన్స్‌లు ఇస్తు న్నారు. అందరికీ కలుపుకుని ప్రతీ నెల రూ.30.96లక్షలు చెల్లించాల్సి ఉంది. ఇప్ప టికే మూడు మాసాలకు గాను ఒక్కొక్కరికి రూ.57వేలు రావాల్సి ఉందని వెల్లడిం చారు. జీతాలు రాకపోవడంతో ఇల్లు గడవకపోవడంతో పాటు స్వచ్ఛ ఆటోల నెల వారి కిస్తీలు నిలిచిపోయాయని వాపోయారు. కొన్ని వాహనాలు వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ కంపెనీలు లాక్కు ని వెళుతున్నారని అసహనం చేస్తున్నారు. సంబంధిత అధికారులను అడిగితే బ్యాంకులో చెక్కు వేశామని, డబ్బులు జమవుతున్నాయని జాప్యం చేస్తున్నట్లు చెప్పారు.

కాగా, తమకు సక్రమంగా జీతాలు వచ్చే విధంగా కమిషన్ చొరవ చూపాలని స్వచ్ఛ ఆటోల సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల ఎన్ని కైన డ్రైవర్ల సంఘం, కార్మిక సంఘాలు సైతం స్పందించడం లేదని ఆరోపిస్తు న్నారు. లేదంటే ఆటోల బంద్ పాటించి కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

# మిర్చి రైతు విలవిల..!

- ఈ ఏడాది భారీగా పడిపోయిన ధరలు
- పట్టించుకోని మార్కెటింగ్ అధికారులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఈ ఏడాది మిర్చి పంట రైతులకు కన్నీళ్లు తెప్పి స్తోంది. గతేడాది మిర్చి పంటకు భారీగా మద్దతు ధర లభించింది. ఇక ఉమ్మడి వరంగల్‌లోనే ప్రత్యే కంగా సాగు చేసే చపాట (టమాట) రకం మిర్చికి అత్యధికంగా క్వింటాల్‌కు రూ.95వేల వరకు ధర దక్కింది. మిగతా వివిధరకాల మిర్చికి కూడా ఆశిం చిన దానికంటే అధికంగా ధరలు రావడంతో రైతు లు ఈ ఏడాది కూడా మిర్చి సాగుకే మొగ్గు చూపా రు. అయితే ఈ ఏడాది వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు భారీగా పడిపోవటంతో రైతులు ఆందోళనచెందుతున్నారు. మార్కెట్‌లో వ్యా పారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొను గోలుచేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఖమ్మం, మహబూబాబాద్, కేసముద్రం మార్కెట్‌లో ఉన్న ధర వరంగల్ మార్కెట్‌లో లేకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే గత ఏడాది వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో టమాట మిర్చి క్వింటాలుకు రూ.95వేలకుపైగా ధర పలికింది. కానీ ఈ సీజన్‌లో రూ.18వేల నుంచి రూ.40వేలు వరకే ధర రావటంతో ఎన్నో ఆశలతో టమాట మిర్చి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అలాగే అత్యధికంగా రైతులుసాగుచేసే తేజరకం మిర్చికి గతేడాది రూ.25వేల అత్యధిక ధర పలకగా ప్రస్తుతం రూ.13వేల అత్యధికంగా అమ్ముకోవాల్సి వస్తోంది. వండర్‌హాట్‌రకానికి గతేడాది రూ.42వేలు ధర ఉండగా ఈసారి కేవలం రూ.22వేలు మాత్ర మే పలుకుతోంది. 341రకం మిర్చి ధర గతేడాది రూ.23వేలు ఉండగా, ఈసారి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు అమ్మకాలు చేస్తున్నారు. 5531 రకం మిర్చికి గతేడాది రూ.25వేలు ప్రస్తుతం రూ.8 వేల నుంచి రూ.11వేల ధరే పలుకుతోంది. సింగల్ పట్టీ రకం మిర్చి గతేడాది రూ.45వేల వరకు ధర పలకగా ఈసారి కేవలం రూ.22వేలు అత్యధికంగా ధర ఉంది. దీపిక మిర్చి గతేడాది రూ.25వేల వరకు ధర పలకగా రూ.12వేలకు కూడా ఎవరు కొనే పరి స్థితి లేదు. ఇలా అన్ని రకాల మిర్చి ఉత్పత్తులకు ధరలు పడిపోయాయి. దీంతో దిక్కుతోచని రైతులు గిట్టుబాటు ధర వచ్చినప్పుడే మిర్చిని విక్రయించు కునేందుకు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకునేందుకు మొగ్గుచూపుతున్నారు.

### కోల్డ్ సోరేజీల్లో దోపిడీ..

కొంతకాలంగా అధిక లాభాలు వస్తుండటంతో రైతులు మిర్చి సాగుపై దృష్టిపెట్టారు. దీంతో ఎకరా నికి రూ.1.30లక్షల నుంచి రూ.1.50లక్షల వరకు పెట్టుబడి పెట్టి మిర్చి సాగు చేశారు. అయితే ఈ సారి ఆశించినస్థాయిలో మార్కెట్‌లో మిర్చి డిమాం డ్ లేకుండా పోయింది. ఎక్కువ మిర్చి మార్కెట్‌కు రావటంతో పాటు విదేశాల్లో కూడా మిర్చికి డిమాం డ్ లేకపోవటంతో మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో మద్దతు ధరలు లభించటంలేదు. దీంతో మిర్చి రైతు లు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలకు తీసుకెళ్తున్నారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో 25స్టోరేజ్‌లు ఉండగా, సుమారు 27.50లక్షలకు పైగా బస్తాలను నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. వీటిలో సుమారు 3.60లక్షలకు పైగా పసుపుతోపాటు ఇతర పంటలను నిల్వ చేసు కున్నారు. మిగతా 24లక్షల బస్తాలను శీతల గిడ్డం గుల్లో నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అయితే ఈసారి నిల్వ కోసం మిర్చి బస్తాలు అధికంగా వస్తుండటంతో కోల్డ్ స్టోరేజీలను కొంతమంది అడ్తీదారులు తమ ఆధీనంలోకి తీసుకున్నా రు. అప్పటికే రైతులకు పెట్టుబడికి అడ్తీ దారులు సాయంచేశారు. దీంతో మార్కె ట్‌కు తీసుకవచ్చిన మిర్చిని ప్రస్తుతం ఉన్న తక్కువ ధరకు విక్రయించి, అడ్తీదారులు అప్పు తీర్చాలి. లేదం టే వారు సూచించిన కోల్డ్ స్టోరే జీల్లో మిర్చి బస్తాలను నిల్వ చేయాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో చాలా మంది రైతు లు తక్కువ ధరకే మిర్చిని అమ్ముకోవాల్సి వచ్చింద ని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరు రైతులు మాత్రం కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ కు మొగ్గు చూపారు. గత కొన్నాళ్లుగా కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకునే ఒక బస్తాకు రూ.160 వరకు కిరాయి చెల్లించారు. బీమా కోసం మరో రూ.8 వరకు వసూ ళ్లు చేసేవారు. రూ.168తో డిసెంబరు 31 వరకు ఒక బస్తా కోల్డ్ స్టోరేజీలో ఉండేది. అయితే ఈసారి కొం తమంది అడ్తీదారులు అడ్వాన్స్‌గా కోల్డ్ స్టోరేజీలను తమ ఆధీనంలో పెట్టుకోగా, మరికొందరు అడ్తీదా రులకే స్టోరేజీలున్నాయి. మొత్తంగా కోల్డ్ స్టోరేజీలు అడ్తీదారుల గుప్పెట్లోనే ఉన్నట్టు ప్రచారం జరుగు తోంది. గతంలో ఒక బస్తా స్టోరేజీకి రూ.160 ఉన్న ఫీజును ఏకంగా రూ.250 నుంచి రూ.300 వరకు పెంచి వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో బస్తాపై మిర్చి రైతుల నుంచి అదనంగా ఫీజుల పేరుతో రూ.90 నుంచి రూ.140 వరకు వసూలు చేస్తున్నారని రైతు లు పేర్కొంటున్నారు. కోల్డ్‌స్టోరేజీల్లో ఈ సీజన్‌లో 22లక్షల బస్తాల నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ఈ లెక్కన సుమారు రూ.20కోట్లకు పైగా రైతుల నుంచి స్టోరేజీ ఫీజు పేరుతో అదనపు దోపిడీ చేస్తు న్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్లో వి ర్చి పంటకు సగం కూడా ధర లేక దిగాలులో ఉన్న రైతులపై కోల్డ్ స్టోరేజీల్లో అదనపు వసూళ్లతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు.

### రైతు గోస పట్టని అధికారులు..

ఇప్పటికే మిర్చి ధరలులేక పుట్టెడు దుఖంలో ఉన్న రైతులకు పెరిగిన కోల్డ్ స్టోరేజీ ఫీజుల ధరలు మరింతా భారాన్ని మోపుతున్నాయి. ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో 27 శీతల గిడ్డంగులు ఉంటే వీటిలో కేవ లం తొమ్మిదింటిలోనే ప్రభుత్వ సబ్సిడీ అందుతుందని, మిగ తా వాటితో తమకు సంబంధం లేదని మార్కెటింగ్ అధికా రులు చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శీతల గిడ్డంగుల అనుమతుల సమయంలోనే ప్రభుత్వం నిర్ణయించిన ధరలను మాత్రమే పరిగణనలోకి తీసుకో వాలనే నిబంధన ఉందని రైతులు పేర్కొంటున్నారు. అడ్తీదారుల గుప్పెట్లో ఉన్న కోల్డ్ స్టోరేజీల వైపు మార్కెటింగ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎర్రటి ఎండలో తాము పడుతున్న గోస అధికారులు పట్టించుకోవటం లేదని అన్నదాతలు వాపో తున్నారు. కోల్డ్ స్టోరేజీల ధరలను తగ్గించడంతో పాటు అధిక ఫీజు వసూలు చేసిన గిడ్డంగుల యాజమానులపై చర్యలు తీసుకోవాలని, వ్యాపారులు కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధర రాకుండా చేస్తున్న సిండికేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# నేటి నుంచి రంగనాథుడి బ్రహ్మోత్సవాలు

- రామానుజ జయంతి వేడుకలు
- ముస్తాబైన 700 ఏళ్ల ఆలయం



రంగనాయక ఆలయం, మూలవిరాట్టు శ్రీరంగనాథుడు

హనుమకొండ కల్చరల్, మే 4 : హనుమకొండ బ్రాహ్మణవాడ రాగన్నదర్వా జలోని 700 యేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన రంగనాయకస్వామి ఆలయ బ్రహ్మో త్సవాలు భగవత్ రామానుజుల తిరునక్షత్రోత్సవాలు ఆదివారం నుంచి ప్రారం భంకానున్నాయి. ఈ మేరకు ఆలయాన్ని సుందరంగా ముస్తాబుచేశారు. తెలం గాణాలోనే అరుదైన రామానుజుల వారి సన్నిధిగా పేరున్న రంగనాథస్వామి ఆలయాన్ని ఆదివారం నుంచి అనేక మంది వైష్ణవ ప్రముఖులు, భక్తులు ఆలయాన్ని సందర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

తమిళనాడు ప్రాంతంలో ఎక్కువగా ఉండే ఆలయాల మాదిరిగా ఇక్కడి ఆలయంలో రంగనాథుడితోపాటు రామానుజులు మూలవరులుగా ఉండటం విశేషం. ఇక్కడి విగ్రహాలన్నీ ఏకశిలా నిర్మితాలే. మూలవిగ్రహం అయిన రంగ నాథస్వామి వారి మకరతోరణంపై ఎక్కడా లేని విధంగా దశవతారాలు దర్శన మిస్తాయి. ఆలయ గోపురం, సింహద్వారాలు, ఇతర ఆలయాలకు ధీటుగా ప్రత్యేకంగా కనిపిస్తాయి. కాకతీయకాలానికి చెందిన రాతి కట్టడాలు ఇక్కడ కొన్ని కనువిందు చేస్తాయి. ఆలయం మొత్తం శిలా నిర్మితమైతే గోపురం మా త్రం సున్నపురాయి ఇటుకతో తయారైంది. ఇక్కడి స్వామివారు పిలిస్తే పలికి తమ కోరికలు ఈడేస్తారన్నది భక్తుల విశ్వాసం. హనుమద్గిరి రాజమందిర అని పిలిస్తే ఆ శబ్దం ద్వారా భగవంతుడు భక్తుల కోరికలు నెరవేరుస్తారన్నది విశ్వా సం. ప్రతీయేటా వైశాఖ పౌర్ణమికి ప్రత్యేక శత కలష క్షీరాభిషేకంతోపాటు ఆల య బ్రహ్మోత్సవాలు, రామానుజ జయంతి వేడుకలు జరగడం ఈ ఆలయం ప్రత్యేకత. ఆదివారం ఉదయం బిందె తీర్థం, అంకురారోహనం, ధ్వజరోహనంతో ప్రారంభమై రాత్రి 7గంటలకు రంగనాయస్వామి వారి కల్యాణం జరగనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కలకోట రాఘవాచారి, నర్సింహాచారి తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగే వేడుకల పర్వంలో భాగంగా 12వ తేదీన రామానుజులకు వైభవంగా అష్టోత్తర శతకలష క్షీరాభిషేకంతో వేడుకలు ఆసాం తం కానున్నాయి. ఈ వేడుకల్లో సముద్రాల శఠగోపాచార్య, టీకే శ్రీనివాసన్, హైదరాబాద్‌కు చెందిన వంశీ కృష్ణమాచార్య, తిరువరంగం దాసా శేషాచార్య, వోలేటి రవికుమారాచార్య తదితర ప్రముఖులు ఆలయంలో జరిగే ధార్మిక ఉప న్యాసాల్లో పాల్గొంటారు.

# భారత్‌కు మోదీ నాయకత్వం అవసరం


కాశిబుగ్గలో మాట్లాడుతున్న అరూరి రమేష్

- బీజేపీకి సంపూర్ణ మద్దతు అందించాలి
- మోదీ ఆశీస్సులతో వరంగల్ రూపు రేఖలను మారుస్తా..
- ఏకశిల పార్కులోని వాకర్స్‌తో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

హనుమకొండ టౌన్/బాలసముద్రం, మే 4 : దేశ ప్రజలు ప్రశాంతంగా బతుకుతూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే భారత్‌కు తిరిగి మోదీ నాయకత్వం అవసరమని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి హనుమకొండ ఏకశిలపార్కులోని వాకర్స్‌ను అరూరి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ.. 11వ ఆర్థిక శక్తిగా ఉన్న భారత్‌ను మోదీ ప్రపంచంలోనే 5వ స్థాయికి తీసుకొచ్చాడని, మూడోసారి ఆశీర్వదించి మోదీని ప్రధాని చేస్తే దేశాన్ని ప్రపంచంలోనే 3వ ఆర్థిక శక్తిగా నిలబెడుతాడన్నారు. దేశం వైపు ఉగ్రవాదులు తొంగిచూడొద్దంటే మోదీని దేశ రక్షకుడిగా నియమించుకోవాలన్నారు. మోదీని విస్మరిస్తే కాంగ్రెస్ చేతిలో చిత్రహింసలు పడక తప్పదన్నారు.

కాంగ్రెస్ వస్తే కర్ఫ్యూలు, మత కల్లోలాలు, స్కామ్‌లు వెంటాడుతాయని, తద్వారా దేశ ప్రజలు ఇబ్బందులకు గురవుతారని అరూరి హెచ్చరించారు. దేశంతోపాటు వరంగల్ బాగుపడాలంటే కమలం పువ్వుగుర్తుకు ఓటు వేయాలన్నారు. దేశ ప్రజలే కాకుండా ప్రపంచంలోని ఇతర దేశాలు మోదీ కావాలని కోరుకుంటున్నారని, దేశంలో మోదీ వచ్చి వరంగల్‌లో మోదీ ప్రతినిధి లేకుంటే అభివృద్ధికి దూరమవుతామన్నారు. వరంగల్ నుంచి లోక్‌సభకు తనను పంపిస్తే 10యేళ్ల అనుభవంతో వరంగల్ రూపురేఖలను మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రావుల కోమల కిషన్, డివిజన్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, ఉషారెడ్డి, జలేందర్‌రెడ్డి, ఆదిరెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, సీనియన్ సిటిజన్ వాకర్స్ అధ్యక్షుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### శ్రమిస్తున్న కర్మయోగి మోదీ

మిల్స్‌కాలనీ : దేశం కోసం అలుపెరగక శ్రమిస్తున్న కర్మ యోగి ప్రధాని నరేంద్ర మోదీ అని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటీవ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. కాశిబుగ్గలో బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల ప్రజల ఆదరణ చూరగొన్న మహనీయుడు మోదీ అని కొనియాడారు. రెండుసార్లు ప్రధానిగా అవినీతి, బంధుప్రీతి మచ్చుకు కూడా కనిపించని మోదీకి మరోమారు ప్రధానమంత్రిగా అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. దేశ ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనుభావుడు మోదీ అని కీర్తించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అవినీతి, ఆక్రమణలు, బంధుప్రీతి, స్వార్థం తొనికిసలాడేదన్నారు. అన్ని కుంభకోణాలేనని, వేలకోట్ల అవినీతి మరకలేనని ఆరోపించారు. ఈసారి కేంద్రంలో బీజేపీ వచ్చాక మామునూరు ఎయిర్‌పోర్టును పునరుద్ధరిస్తామని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసర విజయచందర్‌రెడ్డి, రత్నం సతీష్‌షా, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, ఆడెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీలో చేరిక

మడికొండ : గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌కు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు స్థానిక కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ ఆధ్వర్యంలో శనివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు సమక్షంలో వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చందరాజు యాదగిరి, అన్నందాస్ అశోక్, గన్నరం కుమార్, బండి వెంకటయ్య, గడ్డం సదానందం, మునిగాల వెంకటరత్నం, మునిగాల బాబు తదితరులున్నారు. కార్యక్రమంలో నాయకులు కుందూరు రాజేశ్‌రెడ్డి, మునిగాల కట్టయ్య, బొల్లికొండవినోద్, బుర్ర రాజన్‌బాబు, దువ్వ నవీన్, కొలిపాక కుమార్‌బాబు, పిట్టల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

# అభివృద్ధి చేయకుంటే మళ్లీ ఓట్లు అడగం


కాజీపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న కడియం కావ్య

- కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కాజీపేటలో కడియం కావ్య ఇంటింటి ప్రచారం

కాజీపేట, మే 4 : 'కాజీపేటను అభివృద్ధి చేయకుంటే మళ్లీ ఎన్నికల్లో ఓట్లే అడగను.. ఈ లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ ఎంపీగా కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి' అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కాజీపేట అభివృద్ధిని బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ పార్టీ కాజీపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కాజీపేట మీడియా పాయింట్‌లో శనివారం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడారు.

రైల్వేపరంగా సికింద్రాబాద్ తర్వాత అత్యంత ప్రాధాన్యమైన కాజీపేటను గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కాజీపేటలో బస్టాండ్, చౌరస్తా మోడల్ జంక్షన్, ఇంటర్, డిగ్రీ కళాశాలలను నిర్మించి తీరుతామన్నారు. మతతత్వాన్ని రెచ్చగొట్టే బీజేపీకి, కుటుంబపాలనలో భూ కబ్జాలకు పాల్పడిన బీఆర్ఎస్‌ను ప్రజలు బొందపెట్టాలన్నారు. రోడ్‌షోల పేరిట ప్రచారం పాల్గొంటున్న కేసీఆర్‌కు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలో రూ.30 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. రాబోయే రోజుల్లో కాజీపేట అభివృద్ధి పూర్తి బాధ్యత తానే తీసుకుంటానని చెప్పారు. శనివారం కాజీపేటలో జరుగనున్న కడియం కావ్య ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని ఎమ్మె ల్యే కోరారు. ఈ సమావేశంలో స్థానిక కార్పొరేటర్లు ఎలకంటి రాములు, జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీరజాలీ, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, నాయకులు ఎండీ అంకూస్, పాలడుగుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### కావ్య ఇంటింటి ప్రచారం

వరంగల్ ఎంపీగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కడియం కావ్య శనివారం ఉదయం కాజీపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాజీపేట 47, 62, 63వ డివిజన్‌లలో స్థాని క ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కడియం కావ్య ఇంటిం టి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో నాయకులు సందెల విజయ్, మేరుగు రాజయ్య, బైరబోయిని రమేష్, సిటీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కట్ల శ్రీను, కాసర్ల నగేశ్, ఎండీ అంకూస్, షేక్ అజ్గర్, పోగుల సంతోష్, మేకల ఉపేందర్, పసునూరి మనోహర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

## హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధికి కృషి

- వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య

మడికొండ, మే 4 : హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధికి కృషి చేస్తానని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య హామీ ఇచ్చారు. మడికొండలోని ఆర్ఎస్ఆర్ గార్డెన్స్‌లో శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన కాజీపేట మండల బూత్ కమిటీల సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి కడియం కావ్య పాల్గొని మాటాడారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుతోపాటు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయిస్తానన్నారు. విద్య ఉద్యోగ, ఉపాధిరంగాల్లో వరంగల్ నగరాన్ని ఎడ్యుకేషన్ హబ్, ఐటీ హబ్, ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. మడికొండ శివారులోని డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే స్వేచ్ఛగా బతకగలుగుతున్నామని, అలాంటి రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లను రద్దు చేయాలంటున్న బీజేపీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే కాంగ్రెస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

అలాగే బీజేపీ నుంచి దేశానికి విముక్తి కలగాలంటే రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతోనే సాధ్యమవుతుందని కావ్య తెలిపారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ భూకబ్జాలు అందరికీ తెలిసినవేనన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవిందర్‌రావు, దొమ్మాటి సాంబయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, నాయకులు వస్కుల శంకర్, కుర్ల మోహన్, బిల్ల రవిందర్, బైరి లింగమూర్తి, గుర్రం జ్యోతిఅమర్‌నాథ్, వస్కుల నాగరాజ్, వస్కుల బాస్కర్, రజినీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న
# బీజేపీని గద్దె దించాలి

- టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

మహబూబాబాద్‌టౌన్, మే 4: ప్రజా సమస్యలను విస్మరించి, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ- కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని తెలంగాణ జనసమితి (టీజేఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నేతలు ప్రకటనలు చేస్తున్నారని, దీంతో రిజర్వేషన్లు ఉంటాయో లేదోనన్న అనుమానం కలుగుతుందని చెప్పారు. బీజేపీ పాలకులు మేలు చేయకపోగా, దేశంలో సమస్యలు సృష్టించిందని విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్లను తీసుకువచ్చి అన్నదాతలకు అన్యాయం చేశారని విమర్శించారు. సమావేశంలో టీజేఎస్, టీపీజేఏసీ నేతలు అంబటి శ్రీనివాస్, మైస శ్రీనివాస్ మామిడాల సత్యనారాయణ, జావిద్, పట్టాభి లక్ష్మయ్య పాల్గొన్నారు.

# మొదలైన.. ఇంటి నుంచే ఓటు

- వరంగల్ లోక్‌సభ స్థానంలో 1,806 మంది దరఖాస్తు
- 121 మంది ఓటు హక్కు వినియోగం


నడికుడ మండలం చర్ల పల్లిలో ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకుం టున్న వృద్ధురాలు

హనుమకొండ, మే 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకోవడం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గంలో శుక్రవారం 121 మంది తమ ఓటు హక్కును ఇంటి నుంచి వినియోగించుకున్నారు. పోలింగ్ అధికారులు శుక్రవారం నుంచి 85 యేళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతానికి మించి వైకల్యం కలిగిన దివ్యాంగుల ఇంటి వద్దకే అధికారులు వెళ్లి ఓట్లు వేయిస్తున్నారు. వృద్ధులు, ఇందు కోసం అధికార యంత్రాంగం అన్నిఏర్పాట్లు చేసింది. అవసరమైన సిబ్బందిని నియమించింది. ఇంటి నుంచి ఓటు వేసే అవకాశాన్ని ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ఈ మేరకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి.

# కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కొడకండ్ల మండలంలో విస్తృత ప్రచారం


పాకాలలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల, మే 4 : కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన జనగామ జిల్లా కొడకండ్ల మండలం లక్ష్మక్కపెల్లి, పెదబావితండా, బోడోనికుంటతండా, సీఎం తండా, రామన్నగూడెం, నీలిబండ తండా, మొండ్రాయి, కొడకండ్ల, హక్యాతండా, జీబీతండా, రామవరం, రామేశ్వరం, పాకాల గ్రామాల్లో స్థానిక ముఖ్యనాయకులతో కలిసి ప్రచారం చేశారు. కొడకండ్లలో చెరువు వద్ద పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పని చేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని సూచించారు. తెలంగాణ హక్కులను కాపాడేది ఒక్క బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణ గళం పార్లమెంటులో వినిపించాలంటే బీఆర్ఎస్ ఎంపీల సంఖ్య అధికంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన కళ్ళబొల్లి మాటలు విని ప్రజలు వారికి ఓటు వేశారని, కానీ ఆ పార్టీ ఇచ్చిన హామీలలో ఇప్పటివరకు ఎన్ని అమలు చేశారో ఆలోచించాలని ప్రజలకు సూచించారు. రైతుబంధు అందరికీ రాలేదని, మహిళలకు ఇస్తానన్న నెలకు రూ.2500, రూ.2లక్షల రుణమాఫీ, రూ.500లకు గ్యాస్ సిలిండర్, కల్యాణలక్ష్మిలో అదనంగా తులం బంగారం అమలు కాలేదన్నారు. కరెంట్ సక్రమంగా వస్తోందా..? సాగు, తాగునీరుఅందుతోందా..? అంటూ జనాలను ప్రశ్నించారు. కాంగ్రెస్‌పార్టీ 420 హామీలు ఇచ్చి అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు ఎందుకు వేయాలో ఆలోచించాలన్నారు. ఆ రెండు పార్టీల వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని తెలియజేస్తూ మారేపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించేలా కృషి చేయాలని సూచించారు. కన్నతల్లిలాంటి బీఆర్ఎస్‌ను మోసం చేసిన కడియం శ్రీహరితో పాటు అరూరి రమేష్‌కు ఓటుతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.

### బీఆర్ఎస్‌లోకి పునరాగమనం

బీఆర్ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పెదబావితండా గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు వాంక్డోత్ లాలూనాయక్ శనివారం తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి.జ్యోతి, ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సింధె రామోజీ, నాయకులు డి.ఎ.గాంధీ నాయక్, పేరం రాము, మసురం వెంకటనారాయణ, మేటి సోమరాములు, సతీష్, ఆసిఫ్, షన్ను, దూపాటి వెంకన్న, గ్రామశాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

# హామీలు అమలు కావాలంటే కారు గుర్తుకు ఓటేయాలి


గన్నారంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

- కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పాల్సిందే..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, మే 4 : కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని తిర్మలాయపల్లి, గన్నారం, మైలారం, జత్తురాంతండా, గణేష్ కుంట తండా, రాగన్నగూడెం, మహబూబ్‌నగర్ గ్రామాల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ హక్కులు కాపాడేది బీఆర్ఎస్ పార్టీనేనని స్పష్టంచేశారు. అందుకే పార్లమెంటులో బీఆర్ఎస్ గళం విప్పేలా గులాబీ దళం ఉండాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిందని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి సంక్షేమ కనపడిందని, కాంగ్రెస్ వచ్చాక ఆగం, అధోగతి కనిపిస్తోందని అన్నారు. రాష్ట్రాన్ని ఆగంచేసిన కాంగ్రెస్‌పార్టీ మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని సూచించారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయించాలంటే ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని తెలిపారు. ఒక ఉద్యమకారుడికి ఇద్దరు మోసగాళ్లకు మధ్య జరుగుతున్న ఎన్నికలని గుర్తు చేశారు. తెలంగాణ కోసం గొంతెత్తి, తెలంగాణ హక్కులు కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. మార్పు అనగానే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని, కానీ రుణమాఫీ, రైతుబంధు, మహిళలకు రూ.2500 వచ్చాయా అంటూ.. ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిందన్నారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా రుణమాఫీ పేరిట రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఓట్లు వేసి ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఎందుకు ఓటు వెయ్యాలో చెప్పకుండా దేవుడిపై ఒట్లు వేసి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీకి చేసిన మోసానికి శాశ్వతంగా రాజకీయ సమాధి చేయాల్సిన అవసరం ఉందని ఎర్రబెల్లి పేర్కొన్నారు. బీజేపీలో చేరిన అరూరి రమేష్ సైతం వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలను మోసం చేశాడని, వీరికి ఓటుతోనే సమాధానం చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ రాగానే రైతులు, నేతన్నల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం, మోటార్లు కాలడం మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఇందు కోసం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్‌ల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. ప్రజలను అమాయకులను చేసి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని, వీటిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ రంగు కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## కొండపర్తిలో కేంద్ర బలగాల కవాతు

ఐనవోలు, మే 4: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కొండపర్తిలో శనివారం కేంద్రబలగాలు కవాతు నిర్వహించాయి. పర్వతగిరి సీఐ శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై అనిల్‌కుమార్‌ల నేతృత్వంలో గ్రామ పుర వీధుల్లో కవాతు నిర్వహించగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతీ ఓటరు ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా ప్రశాంత వాతావరణంలో ఏలాంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని సూచించారు పర్వతగిరి ఎస్సై జి.వెంకన్న, స్థానిక పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.


కొండపర్తిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

# గుడిసెవాసులకు నీటి కష్టాలు

బాలసముద్రం, మే 4: ఎండలు దంచికొడుతున్నాయి, హనుమకొండలోని బాలసముద్రం జితేందర్‌సింగ్, అంబేద్కర్ నగర్‌లోని గుడిసెవాసులకు తాగునీరు లేక గొంతు తడువక కాలనీవాసులు అల్లాడుతున్నారు. వీరికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ చేయకపోవడంతో గుడిసెలలో నివాసం ఉంటున్న వీరి సమస్యలను ఎవరూ పట్టించుకోవడంలేదని గుడిసెవాసులు అధికారులపై మండిపడుతున్నారు. తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నట్టు కాలనీవాసులు వాపోతున్నారు. మూడు రోజులకోసారి ట్యాంకుల ద్వారా నీరు పంపిణీ చేస్తున్నా సరిపోవడంలేదని చెబుతున్నారు. నీటి కోసం నక్కలగుట్ట, 'కుడా' కార్యాలయం సమీపం నుంచి బిందెలతో సైకిళ్లపై నీరు తీసుకువస్తున్నట్లు చెబుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా సమస్యలు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

2014లో అప్పటి ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి కొందరికి ఇళ్ల ప్రొసిడింగ్‌లు పంపిణీ చేశారు. ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి ఆరు ఎళ్లు గడుస్తున్నా ఇళ్ల పంపిణీ చేయకుండా ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు చెబుతున్నారు. ఇండ్లు నిర్మించిన పేదలకు ఇండ్ల పంపిణీ చేయడంలేదని స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని పలుమార్లు కలిసినా పట్టించుకోవడంలేదని తెలిపారు. ఏళ్ల తరబడి గుడిసెల్లో నివాసముంటున్న తమకు తాగునీటి సమస్య పరిష్కరించి ఎన్నికల తరువాత డబుల్ ఇళ్లు పంపిణీ చేయాలని అధికారులను, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని గుడిసెవాసులు కోరుతున్నారు.


ట్యాంకర్ ద్వారా బిందెలలో నీరు పట్టుకుంటున్న గుడిసెవాసులు

### నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నాం..

వానాకాలం వస్తే గుడిసెలు మునుగుతున్నాయి, ఎండకాలంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం, నగరంలోని పలు ఇళ్లల్లో పనిచేసి బతుకుతున్నాం. ఓట్ల కోసం వచ్చిపోతండ్లు ఎవరూ పట్టించుకోవడంలేదు

యాదమ్మ, జితేందర్ సింగ్ కాలనీ



### ట్యాంకర్ల నీళ్లు సరిపోవడంలేదు

గుడిసెలలో ఉంటున్న మాకు ట్యాంకర్లద్వారా నాలుగురోజులకోసారి తాగునీటిని పంపిణీ చేస్తున్నారు. సుమారు 5 వందల కుటుంబాలు గుడిసెలలో నివాసముంటున్నాం. ట్యాంకర్ల నిరు సరిపోవడంలేదు ఎమ్మెల్యే పట్టించుకుని తాగునీటి సమస్య పరిష్కరించాలి

-మోరె శిల్ప, జితేందర్ సింగ్ కాలనీ




హోమం నిర్వహిస్తున్న రాధాకృష్ణ శర్మ

## శ్వేతార్కలో వరుణ హోమం

కాజీపేట, మే 4: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో శనివారం వరుణహోమం నిర్వహించారు. ఐనవోలు అనంతమల్లయ్య ఆధ్వర్యంలో రోహిత్ ఉపాధ్యాయ వరుణ హోమం నిర్వహించారు. ఎండ వేడి తగ్గించాలని, సూర్యుడి తాపం వల్ల మానవులు నీరసంగా శరీరంలోని శక్తిని కోల్పోతారని, వరుణ దేవుడు మానవాళిని కనికరించాలని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## నేడు ముల్కనూర్‌కు హరీష్‌రావు రాక

భీమదేవరపల్లి, మే 4: ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆది వారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు ఎన్నికల ప్రచారానికి రానున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మండల సురేందర్ శనివారం తెలిపారు. కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ తరుపున ప్రచారం చేయనున్నట్లు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి కావ్యకు మద్దతుగా 6న సదస్సు

కాళోజీ జంక్షన్, మే 4: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతుగా ఈ నెల 6న మాదిగ ఉప కులాల ఐక్య సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ప్రకటించారు. నక్కలగుట్టలోని ఓ ప్రైవేటు హోటల్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల అభివృద్ధి, సంక్షేమం కోసం మొదటి నుంచి పాటుపడేది కాంగ్రెస్ పార్టీయేనని అందుకే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. హనుమకొండలోని అభిరామ్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న సదస్సుకు మాదిగ ఉపకులాలకు చెందిన వారందరిని తరలించాలన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అందరికంటే ఎక్కువగా మాదిగలే నష్టపోయారని, జరిగిన నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు వీలుగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపాలని పిలుపునిచ్చారు. మీడియా సమావేశంలో ఇంకా మాది గ ఉపకులాల ఐక్యవేదిక నాయకులు చింతల రాజలింగం, మాదిగ దండోరా నాయకులు జన్ను కనకరాజు మాదిగ తదితరులు కాంగ్రెస్ అభ్యర్థి కావ్యకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ మాట్లాడారు.


మాట్లాడుతున్న మాదిగ ఉపకులాల నాయకులు

## పటిష్ట భద్రత నడుమ ఈవీఎంల కమిషనింగ్

వరంగల్ కార్పొరేషన్, మే 4: పటిష్ట భద్రత నడుమ ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభమైందని లోక్‌సభ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శనివారం వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌లను అక్కడి సిబ్బందితో కలిసి పరిశీలించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను తెరిచారు. ఈ సందర్భంగా అశ్విని తానాజీ మాట్లాడుతూ.. నియోజకవర్గానికి కేటాయించబడిన మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో 21 టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మొబైల్ ఫోన్‌ల అనుమతి లేకుండా మెటల్ డిటెక్టర్ల సహాయంతో సేకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో పాటు తహసీల్దార్ మహమ్మద్ అక్బాల్ పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న కమిషనర్

# అక్రమ నల్లా కనెక్షన్‌పై ఫిరాదు

### ఫిర్యాదుదారుడికి బెదిరింపులు

హనుమకొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో అక్రమ నల్లా కనెక్షన్లు పెరిగిపోతున్నాయి. వరంగల్ నగర పాలక సంస్థ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అనేక మంది అక్రమంగా నల్లాకనెక్షన్లు తీసుకుంటున్నారు. నల్లా పన్నులు కట్టకుండా తప్పించుకుంటున్నారు. దీంతో వరంగల్ కార్పొరేషన్ ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతోంది. ఇటీవల ప్రకాశ్‌రెడ్డిపేట న్యూమిలీనియం కాలనీలో అక్రమ కనెక్షన్లపై కార్పొరేషన్‌కు అందిన ఫిర్యాదే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ.

హనుమకొండ సుబేదారి పరిధిలోని ప్రకాశ్‌రెడ్డిపేటలోని న్యూ మిలీనియం కాలనీలో తన ఇంటి దగ్గరలోని ఒక వ్యక్తి, మరికొందరు ఒక ముఠాగా ఏర్పడి ఇళ్లకు అనుమతి లేకుండా నల్లా కలనెక్షన్లను బిగించుకున్నారు. ఈ అక్రమ నల్లాల వల్ల ప్రెషర్‌తగ్గి కాలనీలోని మిగతా ఇళ్లకు నీళ్ల రావడం తగ్గిపోయింది. దీనితో ఆ కాలనీలో నివాసముండే ఎన్. హనుమంతునాయక్ అక్రమ నల్లా కనెక్షన్లపై వరంగల్ కార్పొరేషన్ కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. అక్రమంగా నల్లాలను బిగించుకోవడంపై ప్రశ్నిస్తే వారు తన ఇంటిపైకి వచ్చి దౌర్యానికి పాల్పడ్డారని, బెదిరించారని ఆ ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉన్నదని తెలిపారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌కు, పోలీసు కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

# నేరస్తులకు శిక్ష పడాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

వరంగల్ క్రైం, మే 4: నేరస్తులను కోర్టులో శిక్ష పడే విధంగా పోలీసు అధికారులు విధులు నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అధికారులకు సూచించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో వివిధ నేరస్తులకు కోర్టులో యావజ్జీవ కారాగార శిక్ష విధించడంలో విశేష కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, దర్యాప్తు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి సీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. కోర్టు విధులు నిర్వహించే పోలీస్ అధికారులు కోర్టు, బాధితులు, పోలీసులు వారధిగా నిలుస్తూ శిక్షల శాతం గణనీయంగా పెంచాల్సిన బాధ్యత పోలీసు సిబ్బందిపై ఉందన్నారు. నేరం చేస్తే శిక్ష తప్పదనే నమ్మకాన్ని నేరస్థులకు భయం కలిగించాలని అన్నారు. మహిళలు, చిన్నారులపై దాడులకు పాల్పడిన నేరస్తులకు తప్పక పడేందుకు కోర్టు డ్యూటీ పోలీసు అధికారులు, దర్యాప్తు అధికారులు తీవ్రంగా కృషి చేయాలని, గ్రేవ్ కేసుల్లో నేరస్తులకు వందశాతం శిక్ష పడేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో మరింత ప్రతిభ కనబర్చి నేరస్తులకు శిక్షలు పడటంలో తెలంగాణలోనే వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రథమ స్థానంలో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ ఎం.సత్యనారాయణ, సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజ్, ఇన్స్‌స్పెక్టర్ శ్రీధర్‌రావు, గణేష్, మామునూరు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, అశోక్, అడిషనల్ పీపీలు రంజిత్, రాజమల్లారెడ్డి, స్టీవేన్, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, సీసీఆర్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు

## కాజీపేటలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

కాజీపేట, మే 4: వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలిపించాలని కోరుతూ శనివారం బీఆర్ఎస్ నాయకులు కాజీపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నార్లగిరి రమేశ్‌లు ప్రచారం మాట్లాడారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ ఫలాల దృష్ట్యా ప్రజలంతా బీఆర్ఎస్ అభ్యర్థికి ఓట్లు వేయాలని కోరారు. ఈ ప్రచారంలో 47వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ కనుకరాజ్, నాయకులు గబ్బెట శ్రీనివాస్, నయూమ్ జుబేర్, ఎండీ అప్జల్, కోండ్ర శంకర్, మర్యాల కృష్ణ, ఇమ్మడి రవితోపాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎమ్మెల్సీ టికెట్ కేదారి యాదవ్‌కు ఇవ్వాలి

కాజీపేట, మే 4 : కాజీపేటకు చెందిన బీజేపీ నాయకుడు మేకల కేదారి యాదవ్‌ను బీజేపీ ఎంఎల్‌సీ అభ్యర్థిగా ప్రకటించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్ కుమార్ కోరారు. కాజీపేటలో శనివారం ఆ సంఘం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ బీసీ యాదవ సంఘం నాయకు లు, విద్యావేత్త, పలుసంఘాలతో ప్రత్యక్ష సంబంధాలున్న మేకల కేదారి యాదవ్‌ను బీజేపీ అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి బర్కం రాం మోహన్‌తోపాటు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కాజీపేట టౌన్, మే 4: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎస్ఎం.స్వామి అన్నారు. కాజీపేట 48వ డివిజన్‌లోని దర్గాలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన అభినందన సమావేశంలో ఆయన మాట్లాడారు. 9.7, 8.7 జీపీఏ సాధించిన నిషాత్‌బేగం, చరన్‌తేజలకు పూర్వ ఉపాధ్యాయులు రవీందర్, అంబప్రసాద్ అందించిన రూ.7వేల నగదు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. ఈ సమావేశంలో శనిగరపు రాజ్‌మోహన్, స్టాఫ్ సెక్రటరీ కట్కూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు సంతోషికుమారి, సతీష్‌పాల్, సునీత తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికులు భద్రత నిబంధనలు పాటించాలి

హనుమకొండ టౌన్, మే4: విద్యుత్ కార్మికులంతా భద్రత నియమ, నిబంధనలు పాటించాలని హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ సూచించారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం నయీంనగర్ సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బందికి అవగహన కల్పించి, వారితో భద్రత వాల్ పోస్టర్స్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోహంతో తయారుచేయబడిన వస్తువులను విధి నిర్వహణలో వెంటపెట్టుకోరాదన్నారు. ఇతరులను నమ్ముకొని మరమ్మతుల కొసం లైన్‌పైకి వెళ్లొద్దన్నారు. వినియోగదారులు విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి, ఏడీఈ సంధ్య, నయీంనగర్, యాదవనగర్ ఏఈలు అరుణ్‌కుమార్, రాంబాబు, లైన్ ఇన్స్‌పెక్టర్స్, లైన్‌మెన్స్, జూనియర్ లైన్‌మెన్స్ తదితరులు పాల్గొన్నారు.


భద్రత వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఈ, డీఈ, విద్యుత్ సిబ్బంది



లా కాలేజీ ఎదురుగా కుండీలో ఏర్పాటు చేసిన మొక్కలు ఎండిపోయిన దృశ్యం

# మండుతున్న ఎండలు..

### ఎండుతున్న మొక్కలు

సుబేదారి, మే 4: భానుడి ప్రతాపంతో ఎండలు మండుతున్నాయి. ఫలితంగా సుబేదారిలోని రోడ్లకు ఇరువైపులా కుండీలలో ఏర్పాటు చేసిన పూల మొక్కలు ఎండిపోతున్నాయి. మొక్కలు ఎండిపోతున్నప్పటికీ 'కుడా'తోపాటు మహా నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగర సుందరీకరణలో భాగంగా 'కుడా' ఆధ్వర్యంలో సుబేదారి ప్రాంతంలో రోడ్లకు ఇరువైపులా కుండీలను ఏర్పాటు చేసి పూలమొక్కలను నాటారు. ఆహ్లాదాన్ని పంచాల్సిన ఈ మొక్కలకు ఆలనా పాలన కొరవడి ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో నీటిని అందించకపోవడంతో ఎండి పోతున్నాయి. నిత్యం జిల్లా ఉన్నతాధికారులు పర్యటించే ప్రాంతంలో ఏర్పాటు చేసిన మొక్కలు ఎండిపోతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటుచేసిన మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా 'కుడా' అధికారులు స్పందించి సుబేదారి ప్రాంతంలో రోడ్లకు ఇరువైపులా కుండీలలో నాటిన పూలమొక్కలకు నీటిని సరఫరా చేయించి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.


ఎమ్మెల్యే నాయిని ని కలిసి పుష్పగుచ్ఛం అందచేస్తున్న ప్రణయ్‌దీప్ ముదిరాజ్

## జిల్లా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్‌గా ప్రణయ్‌దీప్ ముదిరాజ్

హనుమకొండ సిటీ, మే 4: హనుమకొండ జిల్లా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ (మత్స్యశాఖ) కమిటీ చైర్మన్‌గా దారబోయిన ప్రణయ్‌దీప్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రణయ్‌దీప్ ముదిరాజ్ శనివారం హనుమకొండలోని ప్రజాభవన్‌లో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే మద్దతు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 4: ఖమ్మం - వరంగల్ - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకే తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు పీఆర్టీయూ - తెలంగాణ జిల్లా అధ్యక్షురాలు కొలేపాక సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజాచైతన్యంలో నూతన ఒరవడిని సృష్టించిన తీన్మార్ మల్లన్న గెలుపు కోసం సంఘ సభ్యులందరూ కృషి చేయాలని ఆమె కోరారు.

## అరూరి గెలుపు కోసం ప్రచారం

వడ్డెపల్లి, మే 4: వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం గ్రేటర్ వరంగల్ 60వ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ వడ్డెపల్లిలోని మిడిదొడ్డి వీధి, ముదిరాజ్ వీధిలో ఇంటింటా ప్రచారం చేశారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో బీజేపీ 60వ డివిజన్ అధ్యక్షుడు రేకుల సతీష్, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, నాయ కులు మట్టెపల్లి రాంరాజ్, యాదగిరి, అడప రాము, ప్రవీణ్, నరేశ్, బాబీ, చందు, శివ, శ్రీకాంత్, రమేశ్, లక్ష్మీప్రసన్న, శృతి, నిరోష తదితరులు పాల్గొన్నారు.

# వెటరన్స్ గుప్పింట్లో గ్రౌండ్

### క్రీడాకారులకు చోటివ్వకుండా ఇష్టారాజ్యంగా ఆటలు

### వాకింగ్ పేరుతో మైదానల్లోకి చేరి అడ్డంకులు

### చోద్యం చూస్తున్న డీఎస్‌ఏ అధికారులు

వరంగల్ స్పోర్ట్స్ మే 4: రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా క్రీడాకారులకు తర్ఫీదులు ఇప్పించే కర్మాగారంగా విరాజిల్లుతున్న హనుమకొండలోని జవహర్‌లాల్‌నెహ్రూ క్రీడా మైదానం (జేఎన్ఎస్).. నేడు కొందరి గుప్పిట్లోకి వెళ్లిందనే భావన నెలకొంది. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ పేరుతో కొందరు జేఎన్ఎస్‌లోకి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) అధికారుల అనుమతి లేకుండానే ప్రవేశించి వారికి నచ్చిన ఆటను ఎంచుకొని యువ క్రీడాకారులకు అంతరాయం కలిగించడం పరిపాటిగా మారింది. రూ.లక్షలు వెచ్చించి మైదానంలో వివిధ క్రీడా కోర్టులను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు డీఎస్ఏ అభివృద్ధి చేసింది. అనుభవజ్ఞులైన కోచ్‌ల సమక్షంలో వర్ధమాన క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా.. దీనికి భిన్నంగా కొందరు తమ ఇష్టానురీతిలో స్పోర్ట్స్ అధికారుల అనుమతులు లేకుండా క్రీడా మైదానాల్లోకి వెళ్లి ఆటల్లో పాల్గొని ఆటంకపరుస్తున్నారు.

జేఎన్ఎస్‌లో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన అథ్లెటిక్స్ సింథటిక్‌ట్రాక్, హ్యాండ్‌బాల్‌కోర్టు, వాలీబాల్‌కోర్టు, కబడ్డీ, క్రికెట్, టెన్నికాయిట్ క్రీడల్లో తర్ఫీదులు పొందేందుకు వర్ధమాన క్రీడాకారులకు ఆదివారం, పండగలు మినహాయించి ప్రతితీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో డీఎస్ఏ తాత్కాలిక కోచ్‌లు శిక్షణ అందిస్తుంటారు. జేఎన్ క్రీడా మైదానంలోని సాట్ అదేశాల మేరకు డీఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతూ ప్రతీ రోజు వివిధ క్రీడాంశాలలో శిక్షణ తీసుకోవడానికి పదుల సంఖ్యలో క్రీడాకారులు మైదానాలకు పరుగులు తీస్తుంటారు. అదే విధంగా కొందరు ఉత్సాహవంతులైన క్రీడాకారులు వారి ఇళ్ల నుంచి క్రీడల్లో శిక్షణ తీసుకోవడానికి క్రీడా మైదానాలకు వచ్చి డీఎస్ఏకు పేఅండ్‌ప్లే (నామమాత్రపు) పద్ధతిన ఫీజు చెల్లించి శిక్షణ పొందుతుంటారు. అయితే వర్ధమాన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే జేఎన్ఎస్‌లోకి వాకింగ్ పేరుతో కొందరు వచ్చి ఆధిపత్యం చెలాయిస్తున్నారు. జేఎన్ఎస్‌లో ప్రధానంగా వాలీబాల్ కోర్టులో కొందరు వెటరన్స్ బెడద రోజు రోజుకూ పెరుగుతోంది. వాలీబాల్ కోర్టును వారి చేతుల్లోకి తీసుకొని హల్‌చల్ చేయడంతో పక్కనే క్రికెట్ మైదానంలో శిక్షణ పొందుతున్న యువ క్రికెటర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. చేసేదేమీ లేక మైదానం బయటే సాధన చేయాల్సిన దుస్థితి నెలకొంది.


జేఎన్ఎస్ వాలీబాల్ కోర్టులో ఆటలు ఆడుతున్న వెటరన్స్

#### అవకాశం కరువు

జేఎన్ స్టేడియంలో కొన్ని క్రీడాంశాలలో యువతకు, వెటరన్స్‌కి జిల్లా స్పోర్ట్స్ అధికారులు పే అండ్ ప్లే (నామ మాత్రపు)పద్ధతిన ఫీజు తీసుకుని మైదానాల్లోకి అనుమతించడంతో యువ క్రీడాకారులకు ఆటల్లో పాల్గొనే అవకాశం లేకుండాపోతోంది. పేఅండ్‌ప్లే పద్ధతిన ఆటల్లో వెటరన్స్‌కు అవకాశం కల్పించడంతో యువ క్రీడాకారులు ఆడుకోవాలంటే మైదానాలు సరిపోకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరైతే ఫీజులు చెల్లించకుండా మైదానాలను తమ ఆధీనంలోకి తీసుకొని యువ క్రీడాకారులకు అవకాశం ఇవ్వకుండా అడ్డుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆరోగ్యం కాపాడుకోవడానికి వాకింగ్ చేయడానికి జేఎన్ మైదానానికి వచ్చే కొందరు వ్యక్తులు వాకింగ్ చేసుకోకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ యువ క్రీడాకారులకు ఇబ్బందిగా మారడం సరైంది కాదని విమర్శలు వెల్లువెత్తున్నాయి.

#### పే ఆండ్ ప్లే పద్ధతిన ఫీజు చెల్లించారు..

**జీవన్, డీఎస్ఏ వాలీబాల్ కోచ్**



వాలీబాల్ కోర్టులో ప్రతీ రోజు వాకర్స్ అసోసియేషన్‌లకు చెందిన వెటరన్స్ వాలీబాల్ ఆడుతున్నారు. డీఎస్ఏ నిబంధనల మేరకు పేఅండ్‌ప్లే పద్ధతిన ఫీజు కట్టాలని చెప్పగా ఇందులో ఒక అసోసియేషన్‌కు చెందిన వాకర్స్ ఒక నెల ఫీజు చెల్లించారు. కొందరు పట్టించుకోకపోవడంతో స్పోర్ట్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ఫీజు చెల్లిస్తేనే అనుమతి ఉంటుందని చెప్పగా వారు డీఎస్ఏకు ఫీజు చెల్లిస్తామన్నారు. వెటరన్స్ మెయిన్ కోర్టులో ఆటలో పాల్గొనడం ద్వారా యువ క్రీడాకారులకు కొంత మేర ఇబ్బందులు పడుతున్నారు.



అలనాటి కథ

# గంగా జమునా తెహజీబ్... మహరాజా కిషన్ ప్రసాద్

నిజాంల పాలనలో ఉన్నత పదవులన్నీ ముస్లింలకు మాత్రమే ఇచ్చేవారని కొందరు భావిస్తూ ఉంటారు. కానీ అది వాస్తవ విరుద్ధం. నిజాంల పాలనలో అనేకమంది హిందువులు ఉన్నత పదవులు పొందారు. మహరాజా కిషన్ ప్రసాద్ వంటి వారు దేశంలోనే అతి పెద్ద సంస్థానాలలో ఒకటైన హైదరాబాద్‌కు ప్రధానిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన కుటుంబంతో మాకు తరతరాలుగా అనుబంధం ఉంది. అది ఈ నాటికీ కొనసాగుతూనే ఉంది.



"గంగా జమునా తెహజీబ్"... హిందూ-ముస్లిం సఖ్యతకు ఒక ప్రాతిపదిక. దీనిని ఆచరించి నిరూపించిన వ్యక్తి మహరాజా కిషన్ ప్రసాద్. ఆయన నిజాం సంస్థానంలో ముందు పేష్కార్‌గా, ఆ తర్వాత దివాన్‌గా పని చేశారు. ప్రజలు ఆయన్ను ముద్దుగా 'మహరాజ్' అని పిలుచుకొనేవారు. ఒకప్పటి పురానా మహల్ ప్రాంతం (ప్రస్తుతం పాతబస్తీ)లో ఆయన తెలియని వ్యక్తి ఎవరూ ఉండేవారు కాదు. ఆల్వాల్ ప్రాంతంలో మహరాజ్‌కు ఒక ఎస్టేట్ ఉండేది. అక్కడే ఆయన ఒక పెద్ద దేవాలయం నిర్మించినట్లు జ్ఞాపకం. సంస్కృత పాఠశాలకు కూడా భూమిని విరాళంగా ఇచ్చారు. నిజాం పరిపాలనలో హిందూ-ముస్లింల మధ్య అంతరం లేకుండా చూడటంలో కిషన్ ప్రసాద్ కీలకమైన పాత్ర పోషించారు. అందుకే సామాన్య ప్రజలకు ఆయనపై చాలా అభిమానం. నా చిన్నప్పుడు మా మ్యూజిక్ రూమ్‌లో మహరాజ్ ఫొటో ఒకటి ఉండేది. ఒక రోజు నేను దానిని చూసి... "ఆ ఫ్యాన్సీ డ్రస్సు చాలా బాగుంది" అన్నానట. నాన్న (రాజా ధన్‌రాజ్‌గిర్) ఈ విషయం అప్పుడప్పుడూ చెప్పి నవ్వేవారు. మహరాజ్ మనువరాలు షాద్‌ని... తమ్ముడు ధైర్యవాన్‌కి ఇచ్చి వివాహం చేశారు. ఈ విధంగా మాకు బంధుత్వం కూడా ఉంది.

మహరాజ్ గురించి రాయటం మొదలుపెట్టినప్పుడు మూడు సంఘటనలు జ్ఞాపక పొరల నుంచి బయటకు వచ్చాయి. ఈ మూడూ ఆయన ఓరిమిని, సమయస్ఫూర్తిని తెలియజేస్తాయి. చిన్నప్పుడు మహరాజ్ మా ఇంటికి తరచూ వస్తూ ఉండేవారు. వచ్చినప్పుడు ఆయనకు నాలుగు వైపులా దండా పేషీ (నలుగురు సైనికులు రక్షణగా నిలబడేవారు) ఉండేది. అది దాటి ఎవరినీ ఆయన దగ్గరకు రానిచ్చేవారు కాదు. ఒకసారి మా తమ్ముడు అనుకుంటా... అది దాటి లోపలకి వెళ్లి, సరదాగా ఆదాబ్ చేశాడు. వెంటనే మహరాజ్ లేచి తమ్ముడికి ఆదాబ్ చేశారు. నాన్న కంగారు పడ్డారు. "మీరు అంత చిన్న పిల్లాడికి ఆదాబ్ చేయకూడదు.." అని చెప్పబోయారు. అప్పుడు మహరాజ్... "నేను చేసిన ఆదాబ్ అతను ఎప్పుడూ మర్చిపోడు. నేర్చుకుంటాడు" అన్నారు. ఇలాంటి మరొక సంఘటన బొంబాయి ధన్‌రాజ్ మహల్‌లో జరిగింది. ఒకసారి ఆయన ధనరాజ్ మహల్‌కు వచ్చారు. పిల్లలందరినీ పిలిచి... అందరికీ తలో బంగారు అష్రఫీ ఇచ్చారు. ఆ అష్రఫీని చూసి తమ్ముడు చున్నుకు కోపం వచ్చింది. వెంటనే ఆయన మొహం మీద విసిరాడు. నాన్నకు విపరీతమైన కోపం వచ్చింది. కానీ మహరాజ్ చాలా ఓరిమితో... 'ధన్‌రాజ్... వాళ్లు పిల్లలు. వాళ్లకేం తెలుసు! నాదే తప్పు... వాళ్లకు ఆడుకోవటానికి ఏదైనా తేవాల్సింది. అష్రఫీ వాళ్లేం చేసుకుంటారు' అని సర్ది చెప్పారు. ఆ మర్నాడు నేవీ స్టోర్స్ నుంచి మా అందరికీ రకరకాల ఆట బొమ్మలు తెచ్చి ఇచ్చారు.



### మొఘల్స్‌తో సంబంధం...

మొఘల్ చక్రవర్తి అక్బర్ వద్ద మహరాజా తోడర్మల్ ఆర్థిక మంత్రిగా పని చేసేవారు. ఆయన వంశానికి చెందిన రాజా మూల్‌చంద్... నిజాముల్క్ ఉల్క్ హైదరాబాద్ సంస్థానికి పునాది వేసినప్పుడు, ఆయనతో పాటుగా హైదరాబాద్‌కు వచ్చారు. ఆ తర్వాత ఆ వంశంవారు అసఫ్ జాహీల వద్దే ఉండిపోయారు. నిజాం... మహరాజ్ చిన్నప్పటి నుంచీ కలిసి చదువుకున్నారు. కలిసి గుర్రపు స్వారీ చేసేవారు. నిజాం రాజ్యాభిషేకం తర్వాత మహరాజ్ కిషన్ ప్రసాద్ ప్రధాని అయ్యారు.


ఇక రాజ భక్తికి సంబంధించిన సంఘటన ఫలక్‌నామా ప్యాలెస్‌లో జరిగింది. ఒకసారి ఫలక్‌నామా ప్యాలెస్ ఆస్తుల విషయంలో నోటీస్ వచ్చింది. ఈ నోటీస్ వచ్చిన సమయానికే నిజాం లోపలి నుంచి బయటకు వస్తున్నారు. నోటీసు విషయం నిజాంకు తెలిస్తే కోపం వచ్చే అవకాశం ఉందని... మహరాజ్ ఆ నోటీసును తీసుకొని నమిలి మింగేశారు. ఆ తర్వాత అధికారుల ద్వారా ఆ నోటీసును మళ్లీ తెప్పించుకున్నారు.

మహరాజ్ ప్రధానిగా ఉన్న సమయంలో అనేకమంది కవులను, కళాకారులను ప్రోత్సహించారు. ఆయన ఉర్దూ, పర్షియన్, అరబిక్ భాషల్లో నిష్ణాతుడు. 'షాద్' అనే కలం పేరుతో కవిత్వం రాసేవారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్... మహరాజ్‌కు మంచి మిత్రుడు. విశ్వకవి హైదరాబాద్ వచ్చినప్పుడు మహరాజ్ ప్యాలెస్‌లోనే ఉండేవారు. ప్రస్తుతం షాద్‌నగర్... ఒకప్పటి ఆయన జాగీరులోనిదే. ఆయనకు కాలిగ్రఫీ (అందంగా రాయడం)లో మంచి నైపుణ్యం ఉంది. ఆయన అక్షరాలు ముత్యాల్లా ఉండేవి. సాధారణంగా రాజ కుటుంబీకులు సామాన్య ప్రజలతో కలవటం చాలా తక్కువ. కానీ మహరాజ్... ఇటు సామాన్యులతో... అటు రాజకుటుంబీకులతోనూ ఒకే విధంగా కలిసిపోయేవారు. రోజూ ఆయన ప్యాలెస్ నుంచి బయటకు వస్తున్న సమయంలో కారులో నుంచి వెండి నాణేలు విసిరేవారు. వీటి కోసం ప్యాలెస్ ముందు కొన్ని వందల మంది గుమ్మిగూడేవారు. మహరాజ్ మరణం తర్వాత వారి కుటుంబ పరిస్థితులు మారిపోయాయి. వేల ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. కొద్దికాలం క్రితం మహరాజ్ మనవడు... ఆయన ఫొటో ఆల్బమ్‌లను అమ్మకానికి పెట్టాడు. ఒకో ఆల్బమ్‌కు రెండు లక్షల రూపాయలు ఇచ్చి కొని, వాటిని నా దగ్గర భద్రపరిచాను. నిజాంల సమయంలో అనేక మంది మహరాజులు వారికి సేవ చేసి ఉండచ్చు. కానీ సామాన్య ప్రజలు కూడా మహరాజ్ అని పిలుచుకొనేది కిషన్ ప్రసాద్ అంకుల్‌నే!

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

---

సండే సెలబ్రిటీ



**సినీ రంగంలో రెండు దశాబ్దాలు హీరోయిన్‌గా కొనసాగటం అంత సులభమైన విషయం కాదు. అలాంటి అరుదైన హీరోయిన్లలో కాజల్ అగర్వాల్ ఒకరు. కొవిడ్ సమయంలో పెళ్లి చేసుకుని... ఆ తర్వాత మళ్లీ కొన్ని ప్రధాన పాత్రల్లో ప్రేక్షకుల ముందుకు వస్తున్న కాజల్‌ను 'నవ్య' పలుకరించింది. ఆ విశేషాలలోకి వెళ్తే...**

# మై లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్

**మీరు మీడియా ముందుకు వచ్చి చాలా కాలమయింది. ఎలా ఉన్నారు? పెళ్లి తర్వాత జీవితం ఎలా మారిపోయింది?**

మా అబ్బాయి... ఫ్యామిలీ... షూటింగ్‌లు... ఈ మూడింటితో చాలా బిజీగా ఉంటున్నా. ప్రస్తుతం 'ఇండియన్-2', 'సత్యభామ' చిత్రాలు పూర్తి చేశా. ఇంకొన్ని షూటింగ్‌లు చివరి దశలో ఉన్నాయి. పెళ్లికి ముందు కేవలం షూటింగ్‌లపైనే దృష్టి ఉండేది. ఒక షూటింగ్ నుంచి మరొక షూటింగ్‌కు వెళ్తూ ఎప్పుడూ బిజీగా ఉండేదాన్ని. కుటుంబం కోసం సమయమే ఉండేది కాదు. కానీ ఇప్పుడలా కాదు. షూటింగ్‌లు.. ఫ్యామిలీ.. మా బాబు... మై లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్.

**నాకు చాలా అవకాశాలు వస్తున్నాయి. కానీ కొన్నింటినే ఎంచుకొంటున్నా. షూటింగ్ సమయంలో పిల్లాడికి దూరంగా ఉండాలి. అలాంటప్పుడు నాకు తృప్తి ఇచ్చే పాత్రలను మాత్రమే చేయాలని నిర్ణయించుకున్నా.**

**ఒక వర్కింగ్ యంగ్ మదర్‌గా మీపై ఎలాంటి ఒత్తిళ్లు ఉంటాయి?**

పిల్లలు పుట్టిన తర్వాత ఒక మహిళ జీవితంలో అనేక మార్పులు వస్తాయి. ముందుగా తన జీవితం మారిపోయిందనే విషయాన్ని గమనించాలి. దానిని అంగీకరించాలి. ఇదొక పెద్ద సవాల్. ఆ కేవలం నా జీవితాన్ని, నా షెడ్యూల్స్‌ను ప్లాన్ చేసుకుంటే సరిపోయేది. మిగిలినవారు నా షెడ్యూల్స్ ఆధారంగా ప్లాన్ చేసుకొనేవారు. కానీ ఇప్పుడు నేను నా షెడ్యూల్స్ మాత్రమే కాదు, పిల్లాడినీ, కుటుంబాన్నీ చూసుకోవాలి.దీనికోసం కనీసం రెండు వారాల ముందే నా షెడ్యూల్స్ అన్నీ ఫిక్స్ చేసుకొంటా.

**మీ బలాలు, బలహీనతలేమిటి?**

తల్లి... భార్య... నటి... ఎంటర్‌ప్రెన్యూర్... ఇలా రకరకాల పాత్రలను ఒకేసారి పోషించగలగటమనేది నా బలం. అయితే ఈ మధ్యకాలంలో మా అబ్బాయి విషయంలో కొంత ఆందోళన, భయం పట్టుకున్నాయి. వాడు లేకుండా షూటింగ్‌కు కానీ, ఏదైనా పని మీద కానీ వెళ్తే... వాడు ఎలా ఉన్నాడో అనే ఆలోచనలు భయపెడుతున్నాయి. అందువల్ల ఎప్పటికప్పుడు ఇంటికి ఫోన్ చేస్తూ ఉంటా. గతంలో నాకు ఇలాంటి ఆందోళనలు లేవు. రిలాక్స్‌డ్‌గా ఉండేదాన్ని. నా మీద నాకు నమ్మకం ఉండేది. బహుశా యంగ్ మదర్స్ అందరికీ ఈ ఆందోళన ఉంటుందనుకొంటా.

**షెడ్యూల్ ప్రకారం పనులు జరగకపోతే నాకు చాలా చికాకుగా అనిపిస్తుంది. నేను చాలా క్రమశిక్షణగా ఉంటా. ఉదాహరణకు నేను నా షెడ్యూల్‌ను ఒక వారం రోజులకు ముందే ఫిక్స్ చేసుకొంటా. నా పనులన్నిటినీ వాటిలో జాగ్రత్తగా అమర్చుకుంటా.**

తర్వాత పిల్లల అవసరాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారికి అవసరమైనవి గుర్తుంచుకొంటూ ఉండాలి. ఇవి సహజంగానే కొంత ఆందోళన, ఒత్తిడి కలగిస్తాయి. అంతే కాదు... నాకు తెలిసి వర్కింగ్ యంగ్ మదర్స్‌లో కొంత గిల్ట్ ఉంటుంది. పనికి వెళ్లినప్పుడు... బేబీని సరిగ్గా చూసుకోవటం లేదనే గిల్ట్. బేబీతో సమయం గడుపుతున్నప్పుడు... పని ఎగ్గొడుతున్నామనే గిల్ట్. ఈ భావోద్వేగాల సయ్యాటలో ఏర్పడే సందిగ్ధత పెద్ద సవాల్‌గా మారుతుంది. నాకైతే రోజుకు 24 గంటలు చాలవనిపిస్తోంది!

**మీరు మంచి ఆర్గనైజరా?**

కాదు. మా ఆయన మంచి ఆర్గనైజర్. నేను కూడా నెమ్మదిగా నేర్చుకుంటున్నా. గతంలో

**రకరకాల పాత్రలు చేయాలని ఉంది. నేను నా ఐడెంటిటీని ఎప్పుడూ వదులుకోను. మా అబ్బాయికి కూడా... 'మా అమ్మ నటి. వర్కింగ్ మదర్' అనే విషయం తెలియాలి. అయితే ప్రస్తుతం మాత్రం నా ప్రాధాన్యత మా అబ్బాయి మాత్రమే.**



**కెరీర్ బాగా సాగుతున్న సమయంలో హఠాత్తుగా పెళ్లెందుకు చేసుకున్నారు?**

జీవితాన్ని ఎలా జీవించాలనే విషయంలో చిన్నప్పటి నుంచి నాకు అనేక కలలు ఉండేవి. సినిమాల్లోకి వచ్చిన తర్వాత వాటి గురించి ఆలోచించే సమయం కూడా లేకుండా పోయింది. ఒక దశలో ఏడాదికి 9 సినిమాలు చేశాను. ఎప్పుడూ బిజీగా ఉండేదాన్ని. నా గురించి నేను ఆలోచించుకోవటానికి కూడా సమయం ఉండేది కాదు. అలాంటి సమయంలో కొవిడ్ వచ్చింది. ప్రపంచమంతా స్తంభించిపోయింది. మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఇంట్లో కూర్చోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మా ఆయన నాకు చాలా కాలంగా తెలుసు. కొద్ది కాలం డేటింగ్‌కు వెళ్లాం. ఆ తర్వాత తను బిజినెస్‌లో, నేను నా సినిమాల్లో మునిగిపోయాం. కొవిడ్ సమయంలో మళ్లీ మేమిద్దరం కనెక్ట్ అయ్యాం. తను వచ్చి మా అమ్మానాన్నలను అడిగాడు. వాళ్లు కూడా ఒప్పుకున్నారు. పెళ్లయిన ఏడాదికి పిల్లాడు పుట్టాడు. వాడు పుట్టిన మూడు నెలలకు మళ్లీ షూటింగ్‌లకు వెళ్లటం మొదలుపెట్టా. ఇది నా జీవితంలో చాలా ఛాలెంజింగ్ ఫేజ్ అని చెప్పాలి.

**పిల్లవాడు పుట్టిన వెంటనే షూటింగ్‌కు రావటం కష్టమనిపించలేదా?**

చాలా కష్టమనిపించింది. కానీ ఒక సవాల్‌గా తీసుకున్నా. బాబు పుట్టాక 'ఇండియన్-2', 'సత్యభామ' సినిమాల్లో ప్రధాన పాత్రలు పోషిస్తున్నా. ఇవి రెండూ యాక్షన్ ఓరియెంటెడ్ రోల్స్. నా కెరీర్‌లో ఈ తరహా పాత్రలు చేయలేదు. నా శరీరాకృతిని మళ్లీ అదుపులోకి తెచ్చుకోవాలి. యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం ట్రైనింగ్ తీసుకోవాలి. ఇలా చాలా కష్టపడ్డాను.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

**యంగ్ మదర్స్ తమ కోసం కూడా కొంత సమయాన్ని కేటాయించుకోవాల్సి ఉంటుంది. నేను వారంలో కొంత సమయాన్ని నా కోసమే కేటాయించుకొంటా.**

**నేను చాలా ఎమోషనల్. కొన్ని విషయాలకు నాకు వెంటనే ఏడుపు వచ్చేస్తుంది. కానీ అదే సమయంలో నేను చాలా స్ట్రాంగ్ కూడా.**

**మా ఆయన, నేను... మా లైఫ్ గోల్స్‌ను ఎప్పటికప్పుడు రివ్యూ చేసుకొంటూ ఉంటాం. మా కోసం కొంత సమయాన్ని పెట్టుకొంటాం. అప్పుడప్పుడూ డిన్నర్స్‌కు వెళతాం. మా భవిష్యత్తును ముందే ప్లాన్ చేసుకొంటాం.**

---

మేకప్

# మలి వయసు మేకప్



"ఏజ్ ఈజ్ జస్ట్ ఎ నంబర్" అంటారు. కానీ పైబడే వయసు చర్మం చెప్పేస్తూ ఉంటుంది. పైబడే వయసుతో చర్మం బిగుతు సడలి, జారిపోయి, ముడతలు పడి అందవిహీనంగా మారిపోతుంది. ఇలాంటి ఏజ్‌డ్ స్కిన్‌ను నవయవ్వనంగా మార్చే మేకప్ చిట్కాలు ఇవే!

**హైడ్రేషన్ ముఖ్యం**

మేకప్ ఉత్పత్తులను ముఖానికి అప్లై చేసే ముందు చర్మాన్ని హైడ్రేట్ చేయాలి. వయసు పైబడిన చర్మం జీవం కోల్పోయి, పొడిగా మారుతుంది. కాబట్టి మేకప్ ముడతలు పడిపోతుంది. ఇలా జరగకుండా ఉండడం కోసం, మేకప్‌కు ముందు మాయిశ్చరైజర్ అప్లై చేయాలి. కొన్ని మాయిశ్చరైజర్లలో ఎస్‌పిఎఫ్ కూడా ఉంటుంది. ఇలాంటివి చర్మం మరింత డ్యామేజ్ అవకుండా కాపాడి, వయసు పైబడే లక్షణాలను నియంత్రిస్తాయి.

**ఫౌండేషన్ ఇలా...**

లైట్ వెయిట్ ఫౌండేషన్ ఎంచుకోవాలి. హెవీ లేదా మ్యాట్ ఫౌండేషన్లు ముఖ చర్మం మీద ఉండే సన్నని గీతల్లో, రంధ్రాల్లో ఇరుక్కుపోయి చర్మాన్ని మరింత అలసటగా కనిపించేలా చేస్తాయి. వాటికి బదులుగా షీర్ టు మీడియం కవరేజ్ ఉండే ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. దీంతో చర్మం సహజ మెరుపును సంతరించుకుంటుంది. ఫౌండేషన్‌లో ఫేసియల్ సీరం ఆయిల్ కలుపుకుంటే, ముఖానికి మెరుపు కూడా దక్కుతుంది. తడి స్పాంజ్ లేదా ఫ్లఫ్ఫీ బ్రష్‌తో ఫౌండేషన్ ముఖమంతా పరుచుకునేలా అద్దుకోవాలి. కళ్లు, ముక్కు, నోరు.. ఇలా ముడతలకు వీలున్న ప్రదేశాల్లో వీలైనంత తక్కువ ఫౌండేషన్ అప్లై చేసుకోవాలి.

**కన్‌సీలర్ ఇలా...**

కళ్ల కింద నల్లని వలయాలు, మచ్చలను దాచడానికి కన్‌సీలర్ చాలా బాగా ఉపయోగపడుతుంది. అయితే దీన్ని అవసరానికి మించి ఉపయోగిస్తే తగిన ఫలం దక్కకపోగా, అదనపు నష్టం జరుగుతుంది. ఎక్కువైతే కేకీ లుక్‌తో కనిపిస్తాం. కాబట్టి ఏ ప్రదేశాలను దాచాలనుకుంటున్నారో కనిపెట్టి, ఆచితూచి కన్‌సీలర్ అప్లై చేసుకోవాలి. కళ్ల కింద పీచ్ ఎల్లో టోన్ కన్‌సీలర్ వాడుకోవాలి. మచ్చల కోసం స్కిన్ టోన్‌కు దగ్గరగా ఉండే కన్‌సీలర్ ఎంచుకోవాలి. చిన్న బ్రష్ లేదా వేలితో కన్‌సీలర్‌ను అద్దుకుని, స్పాంజ్‌తో బ్లెండ్ చేసుకోవాలి.

---

## నవ్య చిత్రజ్యోతి



### 19న డైరెక్టర్స్ డే ఈవెంట్

దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతిని ప్రతి ఏటా మే 4న డైరెక్టర్స్ డేగా జరుపుకొంటున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా ఈ వేడుకలను తెలుగు డైరెక్టర్స్ అసోసియేషన్ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ మాట్లాడుతూ "దాసరి నారాయణరావు సినిమా పరిశ్రమకు పెద్ద దిక్కుగా ఉండేవారు. ఈ ఏడాది డైరెక్టర్స్ డే ఈవెంట్‌ను 19న సాయంత్రం ఆరు గంటలకు ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తాం" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, ప్రొడ్యూసర్ కౌన్సిల్ ప్రెసిడెంట్ నిర్మాత దామోదర ప్రసాద్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ సెక్రటరీ అనుపమ రెడ్డి, ఫిల్మ్ నగర్ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, నిర్మాతలు ప్రసన్న కుమార్, సి కల్యాణ్, దర్శకులు అనిల్ రావిపూడి, వశిష్ఠ, గోపీచంద్ మలినేని, విజయ్ కనకమేడల, శంకర్, రేలంగి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



**రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం తాజా షెడ్యూల్ శనివారం ముంబైలో మొదలైంది. సుదీర్ఘంగా సాగే ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తామనీ, దీంతో మేజర్ పార్ట్ షూటింగ్ పూర్తవుతుందని యూనిట్ తెలిపింది. పూరీ జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ**

### విజయ్ దేవరకొండతో మరో సినిమా




'ఫ్యామిలీ స్టార్' చిత్రం తర్వాత విజయ్ దేవరకొండతో మరో చిత్రాన్ని నిర్మించనున్నారు దిల్ రాజు, శిరీష్. 'రాజావారు రాణివారు' సినిమాతో పేరు తెచ్చుకున్న దర్శకుడు రవికిరణ్ కోలా ఈ సినిమాను డైరెక్ట్ చేయనున్నారు. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో రూపుదిద్దుకొనే ఈ సిసిమాకు సంబంధించిన పూర్తి వివరాలు విజయ్ దేవరకొండ పుట్టిన రోజు(మే 9)న వెల్లడిస్తారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై రూపుదిద్దుకొనే 59వ చిత్రం ఇది కావడం గమనార్హం.

### కామెడీ స్పోర్ట్స్ డ్రామా



పతంగుల పోటీతో రూపుదిద్దుకొన్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా 'పతంగ్' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ఈ వేసవిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతీ పగడాల, 'జీ సరిగమప' రన్నరప్ ప్రణయ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం టీజర్‌ను గురువారం సాయంత్రం దర్శకుడు సానా బుచ్చిబాబు విడుదల చేశారు. మరో అతిథి ఎంపీ సిరిసిల్ల రాజయ్య సినిమా కాంటెస్ట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ప్రణీత్ మాట్లాడుతూ 'ఒక కమర్షియల్ సినిమాకు కావాల్సిన ఎలిమెంట్స్ అన్నీ మా చిత్రంలో ఉన్నాయి. సినిమా టీజర్ మీకు నచ్చిందని అనుకుంటున్నాను. సినిమా కూడా మీకు తప్పకుండా నచ్చుతుంది' అన్నారు. 'చాలా వ్యయప్రయాసలతో ఈ సినిమా తీశాం. రిజల్ట్ బాగా రావడానికి టీమ్ ఎంతో కృషి చేసింది. మ్యాచ్ కోసం ఈ సినిమాను మళ్లీ మళ్లీ చూస్తారు' అని నిర్మాతలు విజయ్ శేఖర్ అన్నె, సంపత్ మక, సురేశ్ కొత్తింటి అన్నారు.

### పీరియాడికల్ పొలిటికల్ యాక్షన్ డ్రామా



'ఉయ్యాల జంపాల', 'మజ్ను' వంటి సున్నితమైన ప్రేమ కథా చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు విరించి వర్మ. ఈ సారి తన రూట్ మార్చి పీరియాడికల్ పొలిటికల్ యాక్షన్ డ్రామా 'జితేందర్ రెడ్డి' సినిమాకు దర్శకత్వం వహించారు. 1980లో జరిగిన యదార్థ సంఘటనల నేపథ్యంలో స్టూడెంట్ లీడర్ జితేందర్ రెడ్డి జీవితం ఆధారంగా ఈ సినిమా రూపొందింది. రాకేశ్ వర్రే, వైశాలి రాజ్, రియా సుమన్ హీరో హీరోయిన్లుగా నటించారు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన టైటిల్ పోస్టర్, గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. శుక్రవారం ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేసి రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ నెల 10న మూవీ విడుదలవుతోంది. ఈ చిత్రానికి డీఓపీ: వి.ఎస్.జ్ఞానశేఖర్, సంగీతం: గోపి సుందర్, కో ప్రొడ్యూసర్: ఉమ రవీందర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వాణిశ్రీ పొడుగు.

### రెండు చిత్రాలు సెట్స్‌పైకి



ఈస్ట్ వెస్ట్ ఎంటర్టైనర్స్ బేనర్ సమర్పణలో ఒకే రోజు రెండు సినిమాల చిత్రీకరణ ప్రారంభమైంది. 'సీత ప్రయాణం కృష్ణతో', 'త్రిగుణి' చిత్రాల ముహూర్తం షాట్‌కు దర్శకుడు వీరశంకర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దాసరి మారుతి క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్లను ఆవిష్కరించింది. కామెడీ డ్రామాగా రూపొందుతున్న 'సీత ప్రయాణం కృష్ణతో' చిత్రంలో రోజా ఖుషీ, దినేశ్ జంటగా నటిస్తున్నారు. దేవేందర్ దర్శకుడు. 'త్రిగుణి' చిత్రంలో కుషాల్ కథానాయకుడు. వైతహవ్య వడ్లమాని దర్శకత్వం వహిస్తున్నారు.

### 'లగ్గం' టాకీ పూర్తి



'భీమదేవరపల్లి బ్రాంచి' ఫేమ్ రమేష్ చెప్పాల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'లగ్గం'. సాయి రోనక్, ప్రగ్యా నగ్రా హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్, రోహిణి, ఎల్ బి శ్రీరామ్, సప్తగిరి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. వేణుగోపాల్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టాకీ పార్ట్‌ను పూర్తి చేసుకుంది. "ప్రతీ ఒక్కరూ ఈ చిత్రం చూసి ఇందులోని సన్నివేశాల గురించి గొప్పగా మాట్లాడుకుంటారు. ఇందులోని స్టైల్ ఆఫ్ మేకింగ్, స్క్రీన్ ప్లే అందరినీ ఆకట్టుకుంటుంది" అని చిత్ర దర్శకుడు రమేశ్ తెలిపారు. నిర్మాత వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ "కొన్ని తరాలు గుర్తుంచుకునేలా ఉంటుంది" అని విశ్వాసం వ్యక్తం చేశారు.

### మంచి దెయ్యం



హారర్ చిత్రాల్లో వైవిధ్యం చూపిస్తూ రూపుదిద్దుకొన్న 'ఓ.ఎం..జీ.' (ఒక మంచి ఘోస్ట్)చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. హారర్ సన్నివేశాలకు హాస్యం జోడించి నేటి తరం ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యేలా చిత్రాన్ని రూపొందించినట్లు దర్శకుడు శంకర్ మార్తాండ్ చెప్పారు. వెన్నెల కిశోర్, నందితా శ్వేత, రఘుబాబు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం గ్లింప్స్, కాన్సెప్ట్ పోస్టర్ ఇటీవల విడుదల చేశారు. చిత్రంలో షకలక శంకర్ భూత వైద్యుని పాత్ర పోషించారు. అతి త్వరలో సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత డాక్టర్ అనినికా ఇనాబతుని చెప్పారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/m38MKD8లో చదవండి.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/CWM6aiZలో చదవండి.


గుడివాడ అమర్‌నాథ్, మంత్రి

అబ్బ ఛా!

## స్టీల్ ప్లాంటు కోసం పదవిని వదిలేస్తా!

విశాఖపట్నం స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించబోమని అనకాపల్లి పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటిస్తే 'ఈ పదవిని' త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నా. అవసరమైతే గాజువాక సీటు కూడా వదిలేస్తా. నా తాత ఎమ్మెల్యే, నా తండ్రి మంత్రిగా చేశారు. నేను కూడా చిన్న వయసులోనే మంత్రినయ్యా. ఇంకా నాకు బోలెడు వయస్సుంది. పదవులు లేకపోయినా ఫరవాలేదు.


జగన్‌కు పంపుతానంటూ విలేకర్లకు అద్దాన్ని చూపుతున్న షర్మిల

## జగన్ మానసిక స్థితిపై నాకు భయంగా ఉంది

- జగన్... అద్దం పంపిస్తున్నా చూసుకో
- అందులో మీకు ఎవరి ముఖం కనిపిస్తోంది?
- చంద్రబాబుదా... మీదా..?
- నేను బాబుతో చేతులు కలిపానా?
- నన్ను ఎవరూ కంట్రోల్ చేయలేరు: షర్మిల

కడప, మే 4(ఆంధ్రజ్యోతి): 'జగన్ గారూ... మీ కోసం అద్దం పంపుతున్నా. ఆ అద్దంలో చూడండి. మీకు మీ ముఖం కనిపిస్తుందా? చంద్రబాబు ముఖం కనిపిస్తుందా? నేను చంద్రబాబుతో చేతులు కలిపినట్లు, ఆయన కంట్రోల్ చేస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్నారు. ఒక్క సాక్ష్యమైనా, ఒక్క ఆధారమైనా చూపించగలరా? జగన్... మీ మానసిక పరిస్థితిపై నాకు ఆందోళనగా ఉంది" అని ఏపీసీసీ చీఫ్, కడప పార్లమెంటు అభ్యర్థి వైఎస్ షర్మిల అన్నారు. శనివారం కడపలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలోనూ, వివేకా కూతురు డాక్టర్ సునీత, కడప కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్‌తో కలసి పాల్గొన్న రోడ్‌షోలోనూ ఆమె మాట్లాడారు. 'నా జన్మకు నేను చంద్రబాబును ఒక్కసారి మాత్రమే కలిశాను. నా కొడుకు పెళ్లికి పిలవడానికి వెళ్లాను. ఆనాడు వైఎస్సార్ కూడా పెళ్లి కార్డు ఇవ్వడానికి వెళ్లాడు. ఆ స్ఫూర్తితో నేను చంద్రబాబును కలవడానికి వెళ్లా. నేను ఐదు నిమిషాలు కూడా ఏనాడు బాబుతో మాట్లాడలేదు. కానీ నేను చంద్రబాబుతో చేతులు కలిపానని, ఆయన కంట్రోల్‌లో ఉన్నానంటూ జగన్ ఏదో ఊహించుకుని మాట్లాడుతున్నాడు. నేను చంద్రబాబు చెబితేనే నీ కోసం 3,500 కి.మీ పాదయాత్ర చేశానా? బై బై బాబు అని క్యాంపెయిన్ చేశానా? సునీత, రేవంత్‌రెడ్డి కూడా చంద్రబాబు చెప్పినట్లు వింటారంట. 'సునీత చేస్తున్న న్యాయ పోరాటం మీకు కనిపించలేదా? వివేకా హత్య వెనుక అవినాశ్‌రెడ్డి హస్తం లేకుంటే ఎందుకు మీకింత భయం? నేను బాబు మాట వింటున్నానంట. నేను వైఎస్సార్ బిడ్డను. నేను ఎంతటి మొండిదాన్నో జగన్‌కు తెలుసు. నేను ఎవరో కంట్రోల్ చేస్తే తిరిగేదానిని కాను' అని షర్మిల స్పష్టం చేశారు.

# చించి చెత్తబుట్టలో వేయండి

## చీకటి చట్టంతో బానిసలమవుతాం: చంద్రబాబు నాయుడు

- ల్యాండ్ టైటిలింగ్ యాక్టు కాదు.. అది జగన్ లాండ్ గ్రాబింగ్ యాక్టు
- కూటమి విజయానికి ముహూర్తం ఫిక్స్
- ఎన్నికల్లో నరకాసుర వధ చేసి జూన్ 4న దీపావళి జరుపుకొందాం
- ప్రజాగళంలో టీడీపీ అధినేత పిలుపు

ఒంగోలు/ఏలూరు/నూజివీడు/కాకినాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇది ఏపీ ప్రభుత్వ లాండ్ టైటిలింగ్ యాక్టు కాదు.. జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు.. ఈ నల్ల చట్టాన్ని చించి చిత్తుకాగితం చేసి చెత్తబుట్టలో వేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపిచ్చారు. 'భూమంతా జగన్‌దా? ఈ భూమి మీది కాదా? పట్టాదార్ పాస్‌పుస్తకం మీది కాదా? దీనిపై జగన్ ఫొటో ఎందుకు? ఆయన తాత ఇచ్చాడా? తండ్రి ఇచ్చాడా? ఆ చట్టాన్ని చించి డస్ట్‌బిన్‌లో పడేయండి' అంటూ తన చేతిలో ఉన్న చట్టం ప్రతిని చించి ముక్కలు వేశారు. ప్రజాగళంలో భాగంగా శనివారం ఆయన ప్రకాశం జిల్లా దర్శి, ఏలూరు జిల్లా నూజివీడుల్లో, కాకినాడ నగరంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో మాట్లాడారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కరప మండలం నడకుదురు నుంచి కాకినాడ సిటీలోని జగన్నాథపురం వంతెన మీదుగా సంతచెరువు సెంటర్ వరకు ఆరు కిలోమీటర్ల మేర



దర్శి సభలో జగన్ బొమ్మ ముద్రించిన పాసు పుస్తక ప్రతిని చించివేస్తున్న చంద్రబాబు

భారీ రోడ్ షో నిర్వహించారు. ఆయా సందర్భాల్లో జగన్ పాలనపై నిప్పులు చెరిగారు. ఐదేళ్లుగా సంక్షేమం పేరుతో రూ.10 ప్రజలకు ఇచ్చి రూ.100 వారి నుంచి లాగేసుకున్నాడని ధ్వజమెత్తారు. టీడీపీ మళ్లీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం బడ్జెట్‌లో సంక్షేమానికి 15.80 శాతం మాత్రమే కేటాయిస్తే, గత టీడీపీ ప్రభుత్వం 19.50 శాతం ఖర్చుచేసిందన్నారు. సంక్షేమం అంటేనే టీడీపీ అని.. జగన్ వచ్చాక అనేక సంక్షేమ పథకాలను రద్దుచేశారని తెలిపారు. 'పెన్షన్లు రూ.200 నుంచి 2 వేలకు మేం పెంచి ఇస్తే.. పింఛన్లు ఇస్తున్నది తన ప్రభుత్వమే అన్నట్లుగా జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు' అని ధ్వజమెత్తారు. 'టీడీపీ, జనసేన, బీజేపీ కలిసిన తర్వాత తిరుగుంటుందా? జగన్ గెలుస్తానన్న నమ్మకం లేక గజగజలాడుతున్నారు. ఓటమి భయం పట్టుకుంది. జగన్ ఓటమికి.. కూటమి గెలుపునకు ముహూర్తం ఫిక్స్ అయింది. మూడు పార్టీలు ఏకమై పోటీచేస్తున్న తర్వాత రాష్ట్రంలో మరొకరికి స్థానం లేదు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడడం ఖాయం. మే 13న ఫ్యాన్ రెక్కలు విరగొట్టి డస్ట్‌బిన్‌లో వేయాలి. ఈ అహంకారికి బుద్ధి చెప్పాలి. మీరంతా సిద్ధమేనా..? రాతియుగం పోవాలి.. స్వర్ణయుగం రావాలి. నరకాసుర వధ తరహాలో జగనాసుర వధ చేసి జూన్ 4న దీపావళి మాదిరిగా పెద్దఎత్తున రాష్ట్ర ప్రజలు పండుగ చేసుకోవాలి' అని చంద్రబాబు అన్నారు.

## అనకాపల్లిలో సీఎం రమేశ్‌పై దాడి

అనకాపల్లి/దేవరాపల్లి, మే4(ఆంధ్రజ్యోతి): ఏపీలోని అనకాపల్లి కూటమి అభ్యర్థి, బీజేపీ నేత సీఎం రమేశ్‌పై ఉప ముఖ్యమంత్రి, ప్రస్తుత అనకాపల్లి పార్లమెంటు వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అనుచరులు దాడికి తెగబడ్డారు. బూడి అనుచరుల దాడిలో గాయపడిన బీజేపీ నేతను పరామర్శించేందుకు వెళ్తున్న క్రమంలో సీఎం రమేశ్‌ను అడ్డగించడంతోపాటు.. ఆయనపై దాడి చేసి.. చొక్కా చింపేశారు. పోలీసులు సీఎం రమేశ్‌ను వాహనంలో తరలిస్తున్నా.. ఆ వాహనంపైనా దాడి చేసి అద్దాలు పగులకొట్టారు. దీంతో బూడి స్వగ్రామమైన దేవరాపల్లి మండలం తారువలో శనివారం ఉద్రిక్తత నెలకొంది. తారువలో బీజేపీ నేతలు డ్రోన్‌తో పార్టీ జెండాను ఎగరేసే ప్రయత్నం చేశారు. ఆ సమయానికి గ్రామంలోనే ఉన్న బూడి ముత్యాలనాయుడు, ఆయన అనుచరులు తమను చంపడానికి డ్రోన్‌తో రెక్కీ నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ బీజేపీ నేతలపై దాడి చేశారు. గాయపడిన వారిని పరామర్శించేందుకు తారువ గ్రామానికి బయలుదేరిన సీఎం రమేశ్ వాహనాన్ని వైసీపీ నేతలు చుట్టుముట్టి ఆయనపై దాడి చేశారు.


పోలీస్ స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న సీఎం రమేశ్


చంద్రబాబు X.O పుస్తకం విడుదల చేస్తున్న దృశ్యం

## చంద్రబాబు X.O పుస్తకం విడుదల

హైదరాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడికి వివిధ రంగాల్లో ఉన్న మేధస్సు, అనుభవాలపై రాసిన ఒక పుస్తకం విడుదల అయ్యింది. చంద్రబాబు X.O పేరిట రాసిన ఆ పుస్తకాన్ని మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ, రేరా మాజీ ఛైర్మన్ రామ్‌నాథ్ శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. పుస్తక రచయిత శ్రీనివాస్ ప్రసాద్, పబ్లిషర్ మిక్కిలినేని శ్రీకాంత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జగన్‌కూ కేసీఆర్ గతే..! : కె.లక్ష్మణ్

భీమవరం రూరల్, మే 4: 'తెలంగాణలో టీఆర్ఎస్‌తో విసిగిపోయిన ప్రజలు బయటకు వెళ్లగొట్టారు. అలాగే ఏపీలోనూ జగన్‌తో ప్రజలు విసిగిపోయారు.. ఇక్కడా జగన్‌ను వెళ్లగొడతారు' అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ జోస్యం చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శనివారం జరిగిన బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏపీలో ఉన్నంత అవినీతి ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదన్నారు. జగన్ యువతకు శిక్షణ ఇచ్చి మంచి ఉద్యోగాలు ఇవ్వాల్సింది పోయి పథకాలు అంటూ సోమరులుగా చేస్తున్నారని లక్ష్మణ్ విమర్శించారు.

## మీ ఆస్తుల తనఖాకే ఆ చట్టం

- వైసీపీకి ఓటేస్తే మీ ఆస్తులను వారి చేతుల్లో పెట్టినట్లే : పవన్



మచిలీపట్నం/గుడివాడ/అవనిగడ్డ/బాపట్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): జనం ఆస్తులను తనఖా పెట్టడానికే జగన్ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తెచ్చారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దుయ్యబట్టారు. 'ఆ చట్టం ప్రకారం మీ ఆస్తుల మీద మీకు నియంత్రణ ఉండదు. కోర్టు పరిధిలో కూడా లేకుండా చేసి మీ భూములను మీకు కాకుండా చేసే కుట్ర ఇది' అని స్పష్టం చేశారు. వారాహి విజయభేరి యాత్రలో భాగంగా శనివారం ఆయన కృష్ణా జిల్లా గుడివాడ, అవనిగడ్డ, బాపట్ల జిల్లా రేపల్లెల్లో జరిగిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో దొంగ చేతికి తాళాలు ఇచ్చినట్లేనని, మిధున్‌రెడ్డో, పెద్దిరెడ్డో లేక మోపిదేవో వచ్చి భూములను కబ్జా చేసేస్తారని అన్నారు. మీరు వైసీపీకి ఓటేస్తే కొరివితో తల గోక్కున్నట్లే. మీ ఆస్తులను మీరే వారిచేతిలో పెట్టినట్లే అని అన్నారు. భూములు దోచుకోవడమే జగన్ స్వభావం. రైతులూ ఆలోచించి ఓటేయండి. వైసీపీ ఐదేళ్ల పాలనలో నోట్లో బూతులు, రోడ్లపై గోతులు తప్ప సాధించింది ఏముందని పవన్ ప్రశ్నించారు.






## ఎన్నికల పరిశీలనకు 23 దేశాల ప్రతినిధుల రాక

న్యూఢిల్లీ, మే 4: భారత్ ఆహ్వానం మేరకు లోక్‌సభ ఎన్నికల పరిశీలనకు 23 దేశాలకు చెందిన ఎన్నికల సంఘాల ప్రతినిధులు ఢిల్లీ చేరుకున్నారు. ఆస్ట్రేలియా, రష్యా, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి వచ్చిన 75 మంది ప్రతినిధులు బృందాలుగా పర్యటిస్తారు. వారు మహారాష్ట్ర, గోవా, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించనున్నారు. వారితో పాటు ఐఎఫ్ఈఎస్ సభ్యులు, భూటాన్, ఇజ్రాయెల్‌కు చెందిన మీడియా బృందాలు కూడా పర్యటించనున్నాయి. సీఈసీ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూ ఆదివారం విదేశాల ప్రతినిధులతో భేటీ కానున్నారు.

## ప్రజ్వల్ తండ్రి హెచ్‌డీ రేవణ్ణ అరెస్టు

» రాసలీలలు, బాధితురాలి కిడ్నాప్ కేసుల్లో సిట్ చర్యలు



బెంగళూరు, మే 4(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వ్యవహారంలో ఆయన తండ్రి, జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణను ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అరెస్టు చేసింది. బాధితురాలి కిడ్నాప్, రాసలీలల కేసుల్లో ఏ1 నిందితుడైన హెచ్‌డీ రేవణ్ణ ముందస్తు బెయిల్ అభ్యర్థనను ప్రజాప్రతినిధుల కోర్టు శనివారం తిరస్కరించింది. ఆ వెంటనే రంగంలోకి దిగిన సిట్ అధికారులు.. పద్మనాభనగర్‌లోని మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ ఇంట్లో ఉన్న రేవణ్ణను అరెస్టు చేశారు. సిట్ అధికారులు నమోదు చేసిన మొదటి కేసులో బెయిలబుల్ సెక్షన్లు ఉండటంతో రేవణ్ణ అరెస్టు సాధ్యం కాదని తొలుత భావించారు. అయితే, బాధితురాలు కిడ్నాప్‌కు గురైన కేసులో ఆమెను ఇంటినుంచి తీసుకెళ్లిన రేవణ్ణ అనుచరుడు సతీశ్‌బాబణ్ణను శుక్రవారమే సిట్ అరెస్టు చేసింది. తాజాగా ఏ1 నిందితుడు రేవణ్ణను సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా, ప్రజ్వల్ రాసలీలల వ్యవహారంపై కర్ణాటక సీఎం సిద్దరామయ్య శనివారం సిట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజ్వల్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఆదేశించారు. దర్యాప్తు వివరాలను సిట్ అధికారులు సీఎంకు వివరించారు. సీబీఐ త్వరలోనే ప్రజ్వల్‌పై బ్లూ కార్నర్ నోటీస్ జారీ చేయనుందని, తద్వారా ప్రజ్వల్ కదలికలను గుర్తించేందుకు సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. విమానాశ్రయాల నుంచి సమాచారం రాగానే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. మరోవైపు, ప్రజ్వల్ జర్మనీ నుంచి దుబాయ్‌కి అక్కడి నుంచి హంగేరీలోని బుడాపెస్ట్‌కి వెళ్లి తలదాచుకున్నట్లు సిట్ గుర్తించింది. ఇదిలా ఉండగా, రేవణ్ణ, ప్రజ్వల్‌ల నివాసాలలో సిట్ అధికారులు సోదాలు నిర్వహించి, పలు ఆధారాలను సేకరించారు.

## నాలుగో దశ బరిలో 476 మంది కోటీశ్వరులు

» చేవెళ్ల అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి ఆస్తులు రూ.4,568 కోట్లు



న్యూఢిల్లీ, మే 4 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమరంలో భాగంగా నాలుగో దశ ఎన్నికల్లో 476 మంది కోటీశ్వరులు పోటీ చేస్తున్నారు. వీరిలో 170 మంది మహిళలున్నారు. మొత్తం అభ్యర్థుల్లో కోటీశ్వరులది 28శాతం మాత్రమే! ఇక మొత్తం అభ్యర్థుల్లో 360 మందిపై క్రిమినల్ కేసులు, 274 మందిపై తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులున్నాయి. ఈ నెల 13న జరగనున్న నాలుగో దశ ఎన్నికల్లో 96 స్థానాలకుగాను పోలింగ్ జరగనుంది. ఈ స్థానాల్లో వివిధ పార్టీల నుంచి 1717 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరిలో 1710 మంది అభ్యర్థుల అఫిడవిట్‌లను విశ్లేషించిన అసోషియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) ఈ మేరకు నివేదిక విడుదల చేసింది. 30 మంది అభ్యర్థులపై హత్యాయత్నం కేసులు, 11 మందిపై హత్య కేసులున్నాయి. ఐదుగురిపై రేప్ కేసులున్నాయి. పోటీ చేస్తున్న మొత్తం అభ్యర్థుల సగటు అస్తుల విలువ రూ.11.72 కోట్లు. తెలంగాణలో 17 స్థానాల్లో బరిలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థులలో 10 మందిపై క్రిమినల్ కేసులతో పాటు తీవ్రమైన క్రిమినల్ కేసులున్నట్లు ఏడీఆర్ నివేదిక పేర్కొంది. ఏపీలోని వైసీపీ ఎంపీ అభ్యర్థులలో 12 మందిపై క్రిమినల్ కేసులున్నాయి.

### తెలుగు రాష్ట్రాల్లో ఈ దశలోనే పూర్తి

నాలుగో దశ ఎన్నికలలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్ని లోక్‌సభ నియోజకవర్గాలకు ఒకే విడతలో ఎన్నికలు జరుగనున్న సంగతి తెలిసిందే. రెండు రాష్ట్రాల్లో కలిపి చూస్తే టీడీపీ తరఫున గుంటూరు నుంచి పోటీ చేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు రూ. 5,705 కోట్ల ఆస్తులతో మొదటి స్థానంలో ఉన్నారు. రెండో స్థానంలో బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఉన్నారు. తనకు రూ.4,568 కోట్ల ఆస్తులున్నట్లు అఫిడవిట్‌లో ఆయన ప్రకటించారు. అప్పుల్లోనూ పెమ్మసాని చంద్రశేఖరే ముందున్నారు. ఆయనకు రూ.1,038 కోట్ల మేర అప్పులున్నాయట!

## వచ్చే ఐదేళ్లూ అవినీతిపై కొరడా

సిసయీ, పలాము(ఝార్ఖండ్), మే 4: దేశంలోని అవినీతిపరుల మాస్కులను ఎన్డీయే ప్రభుత్వం తొలగించివేసిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. అవినీతికి పాల్పడినవారందరూ వచ్చే ఐదేళ్లలో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అవినీతిపరులకు మద్దతుగా ప్రతిపక్ష ఇండియా కూటమి ర్యాలీలు చేస్తోందని ఎద్దేవా చేశారు. ఝార్ఖండ్‌లోని లోహర్‌దగా, పలాము నియోజకవర్గాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అవినీతికి పాల్పడినందుకు ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి(హేమంత్ సోరెన్) కటకటాలపాలయ్యారు. ఆ రుగ్మతను అంతం చేయడానికి మోదీ కట్టుబడి ఉన్నాడు. అవినీతికి పాల్పడినవారందరూ వచ్చే ఐదేళ్లలో చట్టపరమైన చర్యలు ఎదుర్కొంటారు. పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన ఇండియా కూటమి నేతలు అవినీతిపరులకు మద్దతుగా ఢిల్లీ, రాంచీలలో సహా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అదే వారి నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తోంది' అన్నారు. ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్ పట్ల గత కాంగ్రెస్ ప్రభుత్వం మెతక వైఖరి అవలంబించిందని మోదీ విమర్శించారు. ఈ ఎన్నికల తర్వాత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవ్వాలని పాక్ నేతలు కోరుకుంటున్నారని చెప్పారు. 'గతంలో ఉగ్రవాదులు అమాయకులను చంపేసేవారు. నాటి ప్రభుత్వాలు పాకిస్థాన్‌కు ప్రేమ లేఖలు రాసేవి. వాటికి స్పందనగా పాకిస్థాన్ మరింతమంది ఉగ్రవాదులను పంపేది. కానీ, మీ ఒక్క ఓటు బలంతో నేను ఇక చాలని చెప్పాను. నేటి కొత్త భారతదేశం పత్రాలు ఇవ్వదు. ఇంట్లోకి దూరి కొట్టింది' అన్నారు.

# వారసత్వం రసవత్తరం

మూడుచోట్ల ములాయం కుటుంబసభ్యుల పోటీ

## యూపీ మూడో దశలో 7న 10 సీట్లకు పోలింగ్




(సెంట్రల్ డెస్క్)

రసవత్తర రాజకీయానికి పేరుగాంచిన ఉత్తరప్రదేశ్‌లో మూడో దశలో ఆసక్తికర సమరం జరగనుంది. వారసత్వం, తిరుగుబాట్లు, చిరకాల విరోధుల మధ్య పోటాపోటీ నెలకొంది. ఈ నెల 7న మూడో దశలో యూపీలోని 10 సీట్లకు పోలింగ్ జరగనుంది. వీటిలో 3 స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) వ్యవస్థాపకుడు, దివంగత ములాయంసింగ్ యాదవ్ కుటుంబ సభ్యులే బరిలో ఉన్నారు. గట్టి ప్రత్యర్థులతో తలపడుతున్న వీరంతా విజయం సాధించడం ద్వారా తమ పెద్దల పేరు నిలబెట్టాలని భావిస్తున్నారు.

### ములాయం ఇంటినుంచి మరో వారసుడొచ్చాడు

ఈ ఎన్నికల్లో ములాయం కుటుంబం నుంచి మరో నాయకుడు ఎన్నికల అరంగేట్రం చేస్తున్నారు. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ తొలుత తన బాబాయ్, జశ్వంత్‌నగర్ ఎమ్మెల్యే శివపాల్‌సింగ్ యాదవ్‌కు బదౌన్ టికెటిచ్చారు. కానీ, కుమారుడు ఆదిత్య యాదవ్ రాజకీయ ప్రవేశానికి ఇదే సరైన సమయమని భావించి ఆయన వెనక్కుతగ్గారు. ఇప్పుడు ఆదిత్య తరఫున అంతా తానై ప్రచారం చేస్తున్నారు. ఇక అఖిలేశ్ భార్య డింపుల్ యాదవ్ తమ కుటుంబ కంచుకోట మెయిన్‌పురి నుంచి మళ్లీ బరిలో నిలిచారు. ఇక్కడి నుంచి ఐదుసార్లు గెలిచిన ములాయం 2022లో చనిపోయారు. తర్వాత ఉప ఎన్నికలో డింపుల్ గెలిచారు. ములాయం మరో సోదరుడు, ఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంగోపాల్ యాదవ్ కుమారుడు అక్షయ్ ఫిరోజాబాద్‌ను వశం చేసుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. సంభాల్‌లో ఎస్పీ కుందర్కి నియోజకవర్గ ఎమ్మెల్యే జియాఉర్ రెహ్మాన్ బార్క్ పోటీ చేస్తున్నారు. ఈయన ఇటీవల మృతిచెందిన ఎంపీ షఫీఖుర్ రెహ్మాన్ బార్క్‌కు మనుమడు.

### ఎటాలో కల్యాణ్‌సింగ్ కుమారుడికి..

యూపీ రాజకీయాలపై చెరగని ముద్రవేసిన మాజీ సీఎం కల్యాణ్‌సింగ్ కుమారుడు రాజ్‌వీర్‌సింగ్‌ను బీజేపీ ఎటా నుంచి నిలిపింది. ఫతేపూర్ సిక్రీలో కమలానికి తిరుగుబాటు తలనొప్పి తెస్తోంది. సిటింగ్ ఎంపీ రాజ్‌కుమార్ చహర్‌కు మరోసారి టికెట్ ఇచ్చింది. అయితే స్థానిక ఎమ్మెల్యే చౌదరి బాబూలాల్ కుమారుడు రామేశ్వర్ స్వతంత్రుడిగా పోటీకి దిగారు. 2014లో బాబూలాల్ ఎంపీగా గెలిచినా, 2019లో టికెట్ ఇవ్వలేదు. ఎంతచెప్పినా వెనక్కు తగ్గకపోవడంతో రామేశ్వర్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. బరేలీ నుంచి 8సార్లు గెలిచిన కేంద్ర మాజీ మంత్రి సంతోష్ గంగ్వార్‌ను తప్పించిన బీజేపీ రాష్ట్ర మాజీ మంత్రి ఛత్రపాల్ గంగ్వార్‌ను పోటీకి దించింది.

### హథ్రస్‌లో ఈసారి తీర్పు ఏమిటో?

2020లో హథ్రస్‌లో దళిత యువతిపై సామూహిక అత్యాచారం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన హథ్రస్‌లో 2019లో బీజేపీ నుంచి రాజ్‌వీర్ సింగ్ దిల్లర్ గెలిచారు. ఈసారి ఆయనను కాకుండా అనూప్ ప్రధాన్‌ను నిలిపింది. ఎస్పీ.. రామ్‌జీలాల్ సుమన్ బదులు జస్వీర్ వాల్మీకిని పోటీకి దింపింది.

**3వ దశలో పోలింగ్ జరిగే నియోజకవర్గాలు:** సంభాల్, హథ్రస్, ఆగ్రా, ఫతేపూర్ సిక్రీ, ఫిరోజాబాద్, మెయిన్‌పురి, ఎటా, బదౌన్, ఓన్లా.

## డిగ్గీ రాజా గట్టెక్కేనా?



సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగిస్తూ ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ మాజీ ఇన్‌చార్జి దిగ్విజయ్‌సింగ్ మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్‌లో గెలుపునకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఒకప్పటి కంచుకోట అయిన ఈ స్థానంలో 77 ఏళ్ల దిగ్విజయ్.. బీజేపీ సిటింగ్ ఎంపీ రోడ్మల్‌నగర్‌తో తలపడుతున్నారు. గత రెండు ఎన్నికల్లోనూ రోడ్మల్ ఇక్కడి నుంచి గెలుపొందారు. రాజ్‌గఢ్ లోక్‌సభ పరిధిలో 8 అసెంబ్లీ సీట్లుంటే.. 6 చోట్ల బీజేపీ ఎమ్మెల్యేలున్నారు. 2003లో అధికారం కోల్పోయిన అనంతరం 16ఏళ్ల ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు దిగ్విజయ్. 2019లో భోపాల్ నుంచి పోటీ చేసి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ చేతిలో పరాజయం పాలయ్యారు. ఇప్పుడు రాజ్‌గఢ్ నుంచి బరిలో దిగారు. ఇవే తనకు చివరి ఎన్నికలంటూ ప్రజల్లో సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారు. "అభ్యర్థిని కాదు.. మోదీని చూసి ఓటేయమని కోరుతున్నారు. ఆయన వచ్చి మీ సమస్యలు తీరుస్తారా? నన్ను గెలిపిస్తే అందుబాటులో ఉంటూ మార్పు చూపిస్తా"అని కోరుతున్నారు. 2018లో ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ కూల్చివేసిన కుట్రను వివరిస్తూ, ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దిగ్విజయ్ వెంట యువకులతో కూడిన వృత్తి నిపుణుల బృందం ఉంటోంది. వీరు కాల్ సెంటర్ నిర్వహిస్తూ రాజ్‌గఢ్‌లోని యువతతో అనుసంధానమవుతున్నారు. దిగ్విజయ్‌కు మద్దతుగా ఆయన భార్య, మాజీ జర్నలిస్టు అమృతా సింగ్ ప్రచారం చేస్తున్నారు.

### మూడో దశలో చౌహాన్, సింధియా, అధిర్

రాజ్‌గఢ్‌కు మూడో దశలో పోలింగ్ జరగనుంది. దిగ్విజయ్‌తోపాటు ఈ ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్న ప్రముఖుల్లో బీజేపీ నుంచి మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్-విదిశ, కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా-గుణ (మధ్యప్రదేశ్) ఉన్నారు. ఇతర రాష్ట్రాల్లో ప్రహ్లాద్ జోషి-ధార్వాడ్ (కర్ణాటక), పల్లవి డెంపో-దక్షిణ గోవా, లోక్‌సభలో కాంగ్రెస్ సభాపక్షనేత అధిర్ రంజన్-బహరంపూర్ (పశ్చిమ బెంగాల్), ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ యాదవ్-మెయిన్‌పురి (యూపీ) బరిలో ఉన్నారు.

- సెంట్రల్ డెస్క్

## ప్రచారానికి నిధుల్లేవు.. పోటీ చేయలేను!

» టికెట్ వెనక్కిచ్చిన ఒడిశాలోని పూరీ కాంగ్రెస్ అభ్యర్థి సుచరిత



భువనేశ్వర్, మే 4: లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే సూరత్, ఇండోర్‌లలో ఆ పార్టీ అభ్యర్థులను కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా ఒడిశా రాష్ట్రం పూరీ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగిన సుచరితా మొహంతి ప్రచారానికి నిధుల్లేవంటూ పోటీ నుంచి తప్పుకున్నారు. తన టికెట్‌ను వాపసు చేస్తున్నట్లు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌కు శనివారం లేఖ రాశారు. ఎన్నికల ప్రచారం కోసం పార్టీ నుంచి నిధులు అందడం లేదని ఆరోపించారు. సొంత నిధులతోనే ఎన్నికల్లో పోరాడాలని ఏఐసీసీ ఒడిశా ఇన్‌చార్జి అజోయ్ కుమార్ సూచించారని, తనకు అంత స్థోమత లేదని ఆమె పేర్కొన్నారు. పార్టీ నిధులు ఇవ్వకుండా పూరీలో ప్రచారం నిర్వహించడం సాధ్యం కాదని, అందుకే తన టికెట్‌ను వెనక్కి ఇస్తున్నట్లు తెలిపారు. పూరీ లోక్‌సభ స్థానానికి ఈ నెల 25న పోలింగ్ జరగనుంది. నామినేషన్ల సమర్పణకు తుది గడువు ఈ నెల 6. ఈ సమయంలో మొహంతి పోటీ నుంచి విరమించుకోవడంతో అక్కడ మరో అభ్యర్థి కోసం కాంగ్రెస్ పార్టీ అన్వేషించాల్సిన పరిస్థితి నెలకొంది.

## బీజేపీలో చేరిన అర్విందర్ లవ్లీ

న్యూఢిల్లీ, మే 4 : ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)తో పొత్తును విభేదిస్తూ పార్టీని వీడిన ఢిల్లీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అర్విందర్ సింగ్ లవ్లీ శనివారం బీజేపీలో చేరారు. లవ్లీతోపాటు కాంగ్రెస్ మాజీ నేతలు రాజ్‌కుమార్ చౌహాన్, నసీబ్ సింగ్, నీరజ్ బసోయ, అమిత్ మాలిక్ కూడా కాషాయం కండువా కప్పుకున్నారు. ఆప్‌తో పొత్తు నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల సీట్ల కేటాయింపుల్లో పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాలపై నిరసన వ్యక్తం చేస్తూ వీరంతా కాంగ్రెస్‌ను వీడారు. కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి, పార్టీ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించి బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టడం ఖాయమని, ఆ తర్వాత ఢిల్లీలోనూ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని అర్విందర్ సింగ్ లవ్లీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. 2017లో తొలిసారి బీజేపీలో చేరిన లవ్లీ 2018లో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆయన తిరిగి బీజేపీ గూటికి చేరారు.

## బెంగాల్ రాజ్‌భవన్ ఉద్యోగుల విచారణ

కోల్‌కతా, మే 4: పశ్చిమ బెంగాల్ గవర్నర్ సి.వి. ఆనంద బోస్ తనను లైంగికంగా వేధించారంటూ రాజ్‌భవన్‌లో పనిచేసే ఓ మహిళా ఉద్యోగి చేసిన ఫిర్యాదుపై కోల్‌కతా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కోల్‌కతా సెంట్రల్ డిప్యూటీ కమిషనర్ ఇందిరా ముఖర్జీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక విచారణ బృందం శుక్రవారం నుంచే పని ప్రారంభించింది. శనివారం రాజ్‌భవన్‌కు చెందిన నలుగురు ఉద్యోగులను పిలిపించి విచారణ జరిపింది. రాజ్‌భవన్‌కు చెందిన సీసీటీవీ కెమేరా ఫుటేజీలను ఇవ్వాలని కోరింది. రానున్న రోజుల్లో మరికొందర్ని విచారించే అవకాశం ఉంది. గవర్నర్‌పై పోలీసు కేసు నమోదైనప్పటికీ రాజ్యాంగపరమైన రక్షణ ఉండడంతో ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం లేదు. రాజ్యాంగంలోని 361(2) అధికరణం ప్రకారం గవర్నర్ పదవిలో ఉన్నంతకాలం ఆయనపై ఏ కోర్టులోనూ ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీల్లేదు. మరోవైపు రాజ్‌భవన్‌లోకి పోలీసులు ప్రవేశకూడదంటూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా గవర్నర్‌పై ఫిర్యాదు చేయడం దురుద్దేశపూరితమని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఫిర్యాదు చేసిన ఆ మహిళకు అధికార పక్షమైన తృణమూల్ కాంగ్రెస్‌తో సంబంధాలు ఉన్నాయని బీజేపీ, సీపీఎంలు చెబుతున్నాయి.

## కోటలోనే ఉండే చక్రవర్తి మోదీ

ఆయన ప్రజలకు ఎప్పుడో దూరమయ్యారు: ప్రియాంక గాంధీ




లఖానీ (గుజరాత్), మే 4: కాంగ్రెస్ నేత, తన సోదరుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి 'యువరాజు' అంటూ ప్రధాని మోదీ ఎద్దేవా పట్ల కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా దీటైన జవాబిచ్చారు. ప్రధాని మోదీ తన సోదరుడిని యువరాజు అంటున్నారని, అయితే ఈ యువరాజే కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4వేల కిలో మీటర్లు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను విన్నారని చెప్పారు. మోదీని ప్యాలెస్‌లో ఉండే చక్రవర్తి అన్న ప్రియాంక.. ఆయన ఏనాడో ప్రజలకు దూరమయ్యారని విమర్శించారు. అధికారం కోసం గుజరాత్ ప్రజలను వాడుకుని, తర్వాత వారిని మరచిపోయారని ఆమె అన్నారు. శనివారం గుజరాత్‌లోని బనస్కాంత లోక్‌సభ నియోజకవర్గంలోని లఖానీ వద్ద కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్యాలెస్‌లో ఉంటారు. ఆయనను ఎప్పుడైనా టీవీలో చూశారా? ఆయన దుస్తులు చాలా శుభ్రంగా, వెంట్రుకలు చెక్కుచెదరకుండా ఉంటాయి. మీ కష్టాలు, ద్రవ్యోల్బణంతో మీపై అధిక భారం పడేది ఆయన ఎలా అర్థం చేసుకుంటారు?" అని ఆమె అన్నారు. రాహుల్ గాంధీని భారత్‌కు తదుపరి ప్రధానిని చేయాలని పాకిస్థాన్ తహతహలాడుతోందని, కాంగ్రెస్ అధికారం కట్టబెడితే మంగళసూత్రాలు, ఆభరణాలు దోచుకునేందుకు ఎక్స్‌రే మిషన్లను వాడతారంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యల పట్ల ప్రియాంక మండిపడ్డారు. భారత్‌లో ఎన్నికలు జరుగుతుంటే పాకిస్థాన్ గురించి మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ 55 ఏళ్ల అధికారంలో ఉందని, ఎక్స్‌రే విషన్‌ను ఉపయోగించి ఎప్పుడైనా గేదెలు, ఆభరణాలను దొంగిలించిందా.. అని ఆమె ప్రశ్నించారు. దేశ ప్రధాని హోదాలో ఉండి ఆయన దిగజారి మాట్లాడుతున్నారన్నారు. రైతుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమూల్, బనాస్ డెయిరీ వంటి కోఆపరేటివ్ రంగాలను ఏర్పాటు చేసిందని, ఇప్పుడు బీజేపీ నేతలు ఆ రంగాన్ని హస్తగతం చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందని ప్రియాంక ఆందోళన వ్యక్తం చేశారు.

## ముందు రాయ్‌బరేలీలో గెలవండి!

» రాహుల్‌గాంధీ చెస్ వీడియోపై కాస్పరోవ్

» జోక్‌గా అన్నానని చెప్పిన రష్యా చెస్ దిగ్గజం



న్యూఢిల్లీ, మే 4: చెస్ అంటే తనకెంతో ఇష్టమని రాహుల్‌గాంధీ చెప్పిన ఓ వీడియోపై ప్రపంచ చెస్ మాజీ చాంపియన్ గ్యారీ క్యాస్పరోవ్.. ముందు రాయ్‌బరేలీలో గెలవండి అంటూ వ్యాఖ్యానించడం కలకలం రేపింది. దీనిపై క్యాస్పరోవ్ మళ్లీ స్పందిస్తూ.. అది జోక్ మాత్రమేనని, భారత రాజకీయాల మీద సాధికారిక వ్యాఖ్యగా తీసుకోవద్దని వివరణ ఇచ్చారు. తాను ఎంతో ప్రేమించే చదరంగంపై ఒక రాజకీయవేత్త (రాహుల్) స్పందించటం చూసి తాను ప్రతిస్పందించానే తప్ప మరేమీ కాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న రాహుల్ మార్గమధ్యంలో తన మొబైల్‌లో చెస్ ఆడుతున్న వీడియోను ఇటీవల కాంగ్రెస్ ఎక్స్‌లో షేర్ చేసింది. దీన్ని కాంగ్రెస్ విమర్శకుడు, నటుడు రణ్‌వీర్ షోరీతోపాటు మరికొందరు కాస్పరోవ్, విశ్వనాథన్ ఆనంద్‌లకు ట్యాగ్ చేశారు. దీనిపై క్యాస్పరోవ్ స్పందిస్తూ.. తొలుత రాయ్‌బరేలీలో గెలవండి అని వ్యాఖ్యానించారు. కాస్పరోవ్ వ్యాఖ్యపై మళ్లీ రణ్‌వీర్ షోరీ తదితరులు స్పందించటంతో క్యాస్పరోవ్ తాజాగా.. తన వ్యాఖ్యను జోక్‌లాగానే తీసుకోవాలని వివరణ ఇచ్చారు.

## బంగారం స్మగ్లింగ్ చేసిన అఫ్ఘాన్ దౌత్య అధికారిణి రాజీనామా

» దుబాయి నుంచి వస్తూ దుస్తుల్లో 25 కిలోల గోల్డ్

» ముంబైలో పట్టుకున్న డీఆర్ఐ అధికారులు



న్యూఢిల్లీ, మే4: భారత్‌లో అఫ్ఘానిస్థాన్ తాత్కాలిక రాయబారిగా పనిచేస్తున్న జాకియా వర్దక్ (58) శనివారం తన పదవికి రాజీనామా చేశారు. గత నెల 25న ముంబై విమానాశ్రయంలో రూ.18.6కోట్ల విలువైన 25కిలోల బంగారాన్ని స్మగ్లింగ్ చేయడానికి ప్రయత్నించి పట్టుబడ్డ నేపథ్యంలో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆమె దుబాయి నుంచి ఈ బంగారాన్ని తీసుకురాగా డీఆర్ఐవర్గాలు పట్టుకున్నాయి. ఆమెకు దౌత్యపరమైన రక్షణ ఉండడంతో అరెస్టు వంటి చర్యలు తీసుకోలేదు. ఆమె తొలుత ముంబైలోని కాన్సులేట్ కార్యాలయంలో చేరారు. తాలిబన్లకు ముందున్న అష్రాఫ్ ఘనీ పాలనలో ఆమె నియమితులయ్యారు. గతేడాది నుంచి న్యూఢిల్లీలో తాత్కాలిక రాయబారిగా వ్యవహరిస్తున్నారు. బంగారం పట్టుబడ్డ సంగతిని ప్రస్తావించనప్పటికీ కొంతకాలంగా తనపై, కుటుంబ సభ్యులపై దుష్ప్రచారం జరుగుతుండడంతో రాజీనామా చేసినట్టు తెలిపారు. విశ్వసనీయ వర్గాల ప్రకారం ఏప్రిల్ 25న జకియా వర్దక్ తన కుమారునితో కలిసి దుబాయి నుంచి ఎమిరేట్స్ ఫ్లైట్‌లో దిగారు. గ్రీన్ చానెల్ ద్వారా బయటకు బయలుదేరారు. 5ట్రాలీ బ్యాగులు, ఒక హ్యాండ్‌బ్యాగు, దిండు, ఒక స్లింగ్ బ్యాగు వారిదగ్గరున్నాయి. అయితే రాయబార కార్యాలయానికి చెందిన వారని తెలిపే ట్యాగులేవీవాటికి లేకపోవడంతో తనిఖీ చేశారు. ఆమెను తనిఖీ చేయగా ఆమె ధరించిన ప్రత్యేక తరహా జాకెట్, లెగ్గిన్స్, బెల్టు, మోకాలికి పెట్టుకున్న క్యాప్‌ల్లో ఒక్కోటి కేజీ బరువున్న 25బంగారు కడ్డీలు దొరికాయి.

## ఖలిస్థాన్ పేరుతో మా ఎన్నికల్లో జోక్యం

» భారత్‌పై కెనడా ఆరోపణలు

» నిజ్జర్ హత్య కేసులో ముగ్గురు భారతీయుల అరెస్టు



కమల్‌ప్రీత్, కరణ్‌ప్రీత్, కరణ్ బ్రార్

న్యూఢిల్లీ, మే4: భారత్, కెనడాల మధ్య మరో దౌత్య పర వివాదం తలెత్తింది. తమ ఎన్నికల్లో జోక్యం చేసుకుంటోందంటూ భారత్‌పై కెనడా ఆరోపణలు చేసింది. ఖలిస్థాన్ వేర్పాటువాదుల సమస్య పేరుతో కెనడా రాజకీయ నాయకులపై ప్రభావం చూపిస్తోందని విమర్శలు చేసింది. రాజధాని ఒట్టావాలోని కమిషనర్ మారీ జోస్సీ హోగ్ శుక్రవారం సమర్పించిన మధ్యంతర నివేదికలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. భారత దేశ అధికారులు, వారి ప్రాపకంతో కెనడాలో పనిచేస్తున్న కొందరు వ్యక్తులు రాజకీయ నాయకులు, వివిధ వర్గాలపై ప్రభావం చూపుతున్నారని తెలిపారు. 2019, 2021 ఫెడరల్ ఎన్నికల్లోనూ ఇదే విధంగా జోక్యం చేసుకున్నారని పేర్కొన్నారు. అయితే కెనడా ఎన్నికల వ్యవస్థ పటిష్ఠంగా ఉండడంతో ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపలేదని తెలిపారు. 194 పేజీలు ఉన్న ఈ నివేదికలో భారత్ పేరును 43 సార్లు ప్రస్తావించారు. చట్టబద్ధమైన ఖలిస్థాన్ అనుకూల రాజకీయ వాదనలకు, కెనడాలో అతి స్వల్పంగా ఉన్న ఖలిస్థానీ తీవ్రవాదానికి మధ్య ఉన్న తేడాను భారత్ గమనించడం లేదని, రెండింటినీ ఒకటిగానే భావిస్తోందని అభిప్రాయపడ్డారు. భారత అధికారుల తరఫున కెనడాలో 'ప్రాక్సీ ఏజెంట్లు' నెట్‌వర్క్ మాదిరిగా పనిచేస్తున్నారని ఆ నివేదిక తెలిపింది. భారత అనుకూల వ్యక్తులు విజయం సాధించేలా వారు అక్రమ మార్గాల్లో నిధులు కూడా అందజేస్తున్నారని ఆరోపించింది. భారత్‌తో పాటు చైనా కూడా ఎన్నికల్లో జోక్యం చేసుకుంటున్నట్టు ఆరోపించింది.

### విద్యార్థి వీసాలపై వచ్చి ఏజెంట్లుగా ?

ఖలిస్థాన్ తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో శుక్రవారం కెనడా పోలీసులు ముగ్గురు భారతీయులను అరెస్టు చేశారు. కరణ్‌ప్రీత్ సింగ్, కమల్‌ప్రీత్ సింగ్, కరణ్ బ్రార్‌లను అరెస్టు చేసినట్టు రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసుల అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. ఈ ముగ్గురు 20ల్లో ఉన్నవారే. వారిపై ఫస్ట్ డిగ్రీ మర్డర్ కేసులు పెట్టడంతో పాటు, హత్యకు కుట్ర పన్నారన్న ఆరోపణలను కూడా నమోదు చేశామని చెప్పారు. వారికి భారత్ ప్రభుత్వంతో ఉన్న సంబంధాలపై ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు. విద్యార్థి వీసాలపై వచ్చిన ఆ ముగ్గురు భారత్ నిఘా అధికారుల సూచనల మేరకు నిజ్జర్‌ను హత్య చేశారా అన్నదానిపై దర్యాప్తు చేయనున్నారు.

## ఉగ్రవాదుల కాల్పుల్లో వాయుసేన జవాను మృతి

ఐదుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

న్యూఢిల్లీ, మే 4: జమ్మూకశ్మీర్‌లో భారత భద్రతా బలగాలపై శనివారం ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ దాడిలో భారత వాయుసేనకు చెందిన ఓ జవాను మృతి చెందగా నలుగురు సైనికులకు గాయాలయ్యాయి. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఉన్న శశిధర్ ప్రాంతంలో వాయుసేనకు చెందిన వాహనంతో పాటు మరో వాహనంపై ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. గాయపడిన సైనికులను ఉదంపూర్ కమాండ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందన్నా రు. ఉగ్రవాదులను పట్టుకునేందుకు అదనపు బలగాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. గతేడాది ఇదే ప్రాంతంలో సైన్యంపై వరుస ఉగ్రదాడులు జరగగా, ఈ ఏడాది ఇదే అతి పెద్ద దాడి. పూంచ్ జిల్లాలో మే 25న ఆరో విడతలో ఎన్నికలు జరగనున్నాయి.

## భార్యతో అసహజ శృంగారం రేప్ కాదు

భోపాల్, మే 4: భార్యతో అసహజ శృంగారం జరపడం అత్యాచారం కిందికి రాదని మధ్యప్రదేశ్ హైకోర్టు తెలిపింది. ఇందుకు ఆమె అనుమతి తీసుకున్నారా, లేదా అన్నదానితో సంబంధం లేదని పేర్కొంది. వైవాహిక సంబంధం ఉన్నప్పుడు జరిగే అత్యాచారం నేరమేమీ కాదని న్యాయమూర్తి జస్టిస్ జి.ఎస్.అహ్లూవాలియా తెలిపారు. భర్త అసహజ శృంగారం, అత్యాచారం చేశాడంటూ అత్తింటికి దూరంగా ఉంటున్న భార్య కేసు పెట్టింది. విచారణ జరిపిన న్యాయమూర్తి.. ఐపీసీ సెక్షన్ 377లోని కొన్ని అంశాలు నేరపూరిత చర్యలు కావంటూ 2018లో సుప్రీంకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో దాన్ని ఆధారంగా చేసుకొని తాజా తీర్పును వెలువరించారు.

## 17 మందిని చంపిన నర్సుకు 760 ఏళ్ల జైలు!

పెన్సిల్వేనియా, మే 4: అమెరికాలో ఇన్సులిన్ డోసు పెంచి 17 మంది మరణానికి కారణమైన నర్సు హీథర్ ప్రెస్డీ(41)కి పెన్సిల్వేనియా కోర్టు 700 ఏళ్ల జైలు శిక్ష విధించింది. రోగుల పట్ల విసుగు చెందడం వల్లనే వారి ప్రాణాలు తీసినట్లు హీథర్ విచారణలో అంగీకరించింది. 2020 నుంచి 2023 మధ్యలో మొత్తం 17 హత్య కేసులు ఆమెపై నమోదు కాగా.. కోర్టు మూడు హత్యలు, 19 హత్యాయత్నాల కేసుల్లో హీథర్‌ను దోషిగా తేల్చింది. వైద్య సిబ్బందే రోగుల ప్రాణాలు తీసిన సంఘటనలు గతంలోనూ అమెరికాలో చోటుచేసుకున్నాయి. న్యూజెర్సీ, పెన్సిల్వేనియాల్లో ఛార్లెస్ కల్లెన్ అనే వ్యక్తి 29 మంది రోగులకు హై డోస్ ఇన్సులిన్ ఇచ్చి ప్రాణాలు తీశాడు. టెక్సాస్‌లో ఓ వ్యక్తి నలుగురు రోగుల ధమనుల్లోకి గాలి పంపించి చంపేశాడు.






# అబ్ కీ బార్?



## బీజేపీ గెలిస్తే ఓటును లాక్కుంటారు

హైదరాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి మనుగడ ఉండదు. ప్రజల ఓటు హక్కును కూడా లాగేసుకుంటారు.మోదీ పాలనలో దేశ ప్రజల జీవన పరిస్థితులు అధ్వానంగా మారాయి. నిరుద్యోగం, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. వీటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మోదీ రామ జపం చేస్తున్నారు.

- సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ



## అమిత్ షా ఫేక్ వీడియో కేసు.. కాంగ్రెస్ నేత అరుణ్‌రెడ్డి అరెస్టు

న్యూఢిల్లీ, మే 4 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫేక్ వీడియో కేసులో తెలంగాణకు చెందిన కాంగ్రెస్ నేత అరుణ్‌రెడ్డిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎక్స్‌లో 'స్పిరిట్ ఆఫ్ కాంగ్రెస్' ఖాతాను కాంగ్రెస్ సోషల్ మీడియా జాతీయ కన్వీనర్ అరుణ్‌రెడ్డి నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన ఇంటెలిజెన్స్ ఫ్యూజన్ అండ్ స్ట్రాటజిక్ ఆపరేషన్స్(ఐఎఫ్ఎస్‌వో) అధికారులు అరెస్టు చేసి, పటియాలా కోర్టు న్యాయమూర్తి నివాసంలో హాజరుపరిచారు. అమిత్ షా ఫేక్ వీడియోలో అరుణ్‌రెడ్డి పాత్ర ఉన్నట్లు పోలీసులు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లి.. వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. దీంతో అరుణ్ రెడ్డిని మూడు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు. అరుణ్ రెడ్డి ఫోన్లను సీజ్ చేసినట్లు అధికారులు వివరించారు. ఈ అరెస్టుపై కాంగ్రెస్ నేత, ఎంపీ మాణిక్యం ఠాగూర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అరుణ్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### కాంగ్రెస్‌కు అండగా ఉంటాం: జాజుల

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): కులగణన హామీకి కట్టుబడి ఉన్న కాంగ్రెస్‌కు అండగా ఉంటామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. టీపీసీసీ కార్యానిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి సీఎం రేవంత్‌తో బీసీ సంఘాల నేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కులగణనకు చర్యలు తీసుకోవడంతో పాటు, దేశంలోనూ అధికారంలోకి రాగానే కులగణన చేపడతామని రాహుల్ ప్రకటించడం హర్షణీయమన్నారు.

### చంద్రబాబు అరెస్టును ఖండించని కేసీఆర్, కేటీఆర్‌కు ఎందుకు సహకరించాలి?

- ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి నామాకు నిరసన సెగ
- చెప్పుతో కొట్టుకొని నిరసన తెలిపిన టీడీపీ నేత

ఖమ్మం మామిళ్లగూడెం, మే 4: ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు ఆదివారం ఖమ్మం జిల్లా టీడీపీ కార్యాలయంలో నిరసన సెగ తగిలింది. టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ అక్రమంగా అరెస్టు చేసి జైలుకి పంపితే నోరుమెదపని కేసీఆర్, కేటీఆర్‌కు లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ ఎందుకు సహకరించాలంటూ టీడీపీ అనుబంధ సంఘం టీఎస్‌టీయూసీ నేత వాసిరెడ్డి భాస్కరరావు ఏకంగా తన చెప్పుతో చెంపలు వాయించుకుంటూ నిరసన వ్యక్తం చేశాడు. లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ మద్దతు కోసం నామా నాగేశ్వరరావు ఆ పార్టీ జిల్లా కార్యాలయానికి వెళ్లగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశ వేదికపైకి నాయకులను ఆహ్వానించారు. అదే సమయంలో భాస్కరరావు... జగన్‌కు మద్దతుగా మాట్లాడిన బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో మద్దతు ఎందుకివ్వాలని ప్రశ్నించారు. 'నామా గారూ మీరంటే మాకేం ఇబ్బంది లేదు.. కానీ మీ పార్టీ అధినేతలు వ్యవహరించిన తీరు పార్టీకి, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసింది. అలాంటిది ఇప్పుడు టీడీపీ మద్దతు కోసం ఎలా వచ్చారు' అంటూ తన చెప్పుతో చెంపలు కొట్టుకుంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ హఠాత్పరిణామంతో విస్తుబోయిన నాయకులు భాస్కరరావును సముదాయించారు.

### 'పట్టభద్రుల' స్థానానికి మరో 4 నామినేషన్లు

నల్లగొండ టౌన్, మే 4: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో నలుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నేషనల్ నవక్రాంతి పార్టీ అభ్యర్థిగా కర్నె రవి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా బక్క జడ్సన్ రెండు సెట్లు, భైరవ భట్ల శ్రీనివాసరావు, ధైద సోమ సుందరం ఒక్కో సెట్ నామినేషన్ దాఖలుచేశారు. ఇందులో కర్నె రవి నవక్రాంతి పార్టీ తరఫున, స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

### బీఆర్ఎస్‌కు రాపోలు ఆనందభాస్కర్ రాజీనామా

న్యూఢిల్లీ, మే 4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్.. బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను పార్టీ అధినేత కేసీఆర్‌కు స్పీడ్ పోస్టు ద్వారా పంపారు. కేసీఆర్ ఎప్పుడు ఏ నిర్ణయాలు తీసుకుంటారో అర్థం కాని పరిస్థితి ఉందని రాపోలు అన్నారు. తన లాంటి నేతలను బీఆర్ఎస్‌లో ఆహ్వానించి, తీరా చేరాక పార్టీ గడప బయటే ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు తన అవసరం లేదని భావించి ఆ పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం క్రియాశీలకంగా పనిచేస్తోందని, కుల గణన దిశగా అడుగులు వేస్తోందని ప్రశంసించారు. తనతో పాటు మెదక్ జిల్లా నేత మహమ్మద్ మొహినుద్దీన్, వరంగల్ జిల్లా నేత తీగల లక్ష్మణ్ గౌడ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్లు చెప్పారు.

### కాంగ్రెస్‌లోకి సంగారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, మే 4: సంగారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, రవి దంపతులు కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. సోమవారం గాంధీ భవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. వారితో పాటు పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిసింది.

### కాంగ్రెస్‌లోకి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం



హైదరాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ తెలంగాణ శాఖ ఉపాధ్యక్షుడు డి.శ్రీశైలం శనివారం కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అంతకుముందు ఆయన టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. శ్రీశైలంతో పాటు పలువురు టీడీపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

### బీజేపీ, బీఆర్ఎస్‌కు డిపాజిట్లూ దక్కవు:ఉత్తమ్

మఠంపల్లి, మే 4: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా దక్కవని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీకి ఓటు వేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు తొలగిస్తారని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగు కానుందని, ఆ పార్టీకి చెందిన 20మంది ఎమ్మెల్యేలు ఎన్నికలత తర్వాత కాంగ్రెస్‌లో చేరబోతున్నారని అన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టి కేంద్రంలో అధికారంలోకి రావాలని బీజేపీ చూస్తోందని ధ్వజమెత్తారు. నల్లగొండలో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని ఐదు లక్షల మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

### నేడు నిర్మల్, గద్వాలలో రాహుల్ సభలు

నిర్మల్, గద్వాల, హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఆదివారం రాష్ట్రానికి రానున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రం, జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లిలలో జరిగే బహిరంగ సభల్లో ఆయన పాల్గొంటారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ సభలకు హాజరవుతారు. నిర్మల్ కలెక్టరేట్ రోడ్డులో ఉన్న క్రషర్ గ్రౌండ్‌లో ఉదయం 11 గంటలకు బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు మంత్రి సీతక్క విలేకరులకు చెప్పారు. నిర్మల్, ముథోల్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి 65 వేల మందిని రాహుల్ సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గద్వాల జిల్లా ఎర్రవల్లిలో నిర్వహించే సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం అధికారులు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. కాగా, ఈ నెల 9వ తేదీన కూడా రాహుల్ గాంధీ రాష్ట్రంలో పర్యటించనున్నారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని సరూర్‌నగర్‌లో లేదా కరీంనగర్‌లో నిర్వహించే కాంగ్రెస్ సభలో ఆయన పాల్గొంటారని సమాచారం. అలాగే ఈ నెల 10వ తేదీన ప్రియాంక గాంధీ రాష్ట్రంలో పర్యటించనున్నట్లు తెలిసింది.

# 8వ తేదీకి రైతు భరోసా పూర్తి

(మొదటి పేజీ తరువాయి)



కొత్తగూడెం సభకు హాజరైన జనం

జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో జరిగిన జనజాతర సభలో, వనపర్తి జిల్లా కొత్తకోటలో కార్నర్ మీటింగ్‌లో, సికింద్రాబాద్, ముషీరాబాద్ నియోజకవర్గాల పరిధిలో రోడ్‌షోలలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. భద్రాచలం శ్రీరాముడి సాక్షిగా, పాలమూరు జిల్లా దైవం కురుమూర్తి స్వామి సాక్షిగా పంద్రాగస్టు నాటికి రైతుల 2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని చెప్పారు. లేకపోతే తన జన్మ ఎందుకని, ఈ సీఎం పదవి ఎందుకని పేర్కొన్నారు. సిద్దిపేటకు శనిలా పట్టుకున్న శనీశ్వరరావు రాజీనామా పత్రంతో రెడీగా ఉండాలని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'ఇచ్చిన మాట ప్రకారం నేను రైతు రుణమాఫీ చేస్తే కేసీఆర్, హరీశ్‌రావు అమరవీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాస్తారా? చెప్పిన గడువులోపు రుణమాఫీ చేయలేకపోతే ముక్కు నేలకు రాయడానికి నేను సిద్ధం' అని సీఎం సవాల్ విసిరారు. తల్లిని చంపి బిడ్డను బతికించారని, పార్లమెంటు తలుపులు మూసి తెలంగాణ బిల్లు ఆమోదించారని తెలంగాణ ఆవిర్భావాన్ని ప్రధాని మోదీ తప్పుబట్టారని గుర్తు చేశారు. రాష్ట్రంపై మోదీ ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపిందని.. గాడిద గుడ్డు తప్ప ఏమీ ఇవ్వలేదని చెప్పారు. అటువంటి మోదీకి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

### ఇప్పుడు ఎవరిని చెప్పుతో కొట్టాలి?

రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పిన వాళ్లను చెప్పుతో కొట్టాలని బీజేపీ నేత బండి సంజయ్ చేసిన వ్యాఖ్యను ప్రస్తావిస్తూ.. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుశ్యంత్ కుమార్ గౌతమ్.. తాము మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పారని సీఎం రేవంత్ పేర్కొన్నారు. 'బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలను అడుగుతున్నా. ఇప్పుడు ఎవరిని చెప్పుతో కొట్టాలి?' అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బోర్లాపడి బొక్కలు విరిగిన కేసీఆర్‌ను లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి పూర్తిగా పక్కకు నెట్టాలని రేవంత్ పిలుపునిచ్చారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.వేల కోట్ల అప్పులకు ఇప్పుడు తాము వడ్డీలు కడుతూ, అందరికీ పథకాలు అందిస్తున్నామని, ఉద్యోగులకు 1న వేతనాలు అందిస్తున్నామని గుర్తు చేశారు. 9లోపు ఆసరా పింఛన్లు ఇస్తామన్నారు.

### కేటీఆర్ చీర కట్టుకొని బస్సు ఎక్కాలి!

వందరోజుల్లో తాము పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తే, కాంగ్రెస్ పార్టీ ఏమి చేయడం లేదని కేటీఆర్ అంటున్నారని, ఆయన మంచిగా చీర కట్టుకొని తయారై ఆర్టీసీ బస్సు ఎక్కాలని, ఒకవేళ నిన్ను టికెట్ అడిగితే మేమేమీ చేయనట్టేనని సీఎం ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ నుంచి యాదగిరిగుట్టకైనా, జూబ్లీహిల్స్ నుంచి సిరిసిల్లకైనా, జూబ్లీహిల్స్ నుంచి మీ నాన్న సొంత ఊరు చింతమడకకైనా బస్సులో నిన్ను ఒక్క పైసా అడిగితే నా మీద ఒట్టే అని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జంట నగరాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించలేదని, ముషీరాబాద్ నుంచి అంజన్‌కుమార్ యాదవ్ గెలిచి ఉంటే మంత్రి అయ్యేవారని తెలిపారు. రాహుల్ గాంధీ, సోనియా, ఖర్గే నాయకత్వంలో ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని, దానం నాగేందర్‌ను గెలిపిస్తే కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించే బాధ్యత తనదని చెప్పారు.

### రాజకీయాలకు దిక్సూచి ఖమ్మం

దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ఖమ్మం జిల్లా ఒక దిక్సూచి అని, చైతన్యవంతమైన ప్రజలు ఈ జిల్లాలో ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా రాజకీయాలంటే ఆచితూచి వ్యవహరిస్తానని, ఈ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో తాను తలదూర్చబోనన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు.. 23 జిల్లాలకుగాను 22 జిల్లాల వ్యవహారాలను స్వయంగా ఆయనే చూసుకునేవారని, ఖమ్మం జిల్లాను మాత్రం అక్కడి ప్రజాప్రతినిధులకే వదిలిపెట్టేవారని తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఖమ్మం జిల్లా ప్రజలు కేసీఆర్ నిజస్వరూపాన్ని ముందే గమనించారని, అందుకే 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటు మాత్రమే ఇచ్చారన్నారు. ఈసారి కూడా ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యరులను 3 లక్షలకు పైగా మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. ఉంటే ప్రజాసేవలో ఉంటారు, లేదంటే పొలంలో ఉంటారని, వ్యవసాయం గురించి ఆయన కంటే ఎక్కువ ఎవరికి తెలుసని ప్రశంసించారు.

### పాలమూరు బిడ్డను నేను


తాను ఏ అమెరికా నుంచో ఊడిపడలేదని, తాత తండ్రుల రాజకీయ వారసత్వంతో రాలేదని, వనపర్తిలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నానని, ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కాలేజీలోనే ఇంటర్ చదివానని సీఎం తెలిపారు. తాను పదోతరగతి పూర్తి చేశాక.. అప్పటి యువనేత చిన్నారెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తే వనపర్తిలో, కొత్తకోటలో గోడలపై ఆయన తరుఫున నినాదాలు రాసి (వాల్ రైటింగ్ చేసి) ప్రచారం చేశానని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో పాలమూరు బిడ్డ బూర్గుల రామకృష్ణారావుకు సీఎంగా అవకాశమొచ్చిందని, మళ్లీ 70 ఏళ్ల తర్వాతే ఆ అవకాశం తనకు దొరికిందన్నారు. మల్లికార్జున్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, మల్లు అనంతరాములు, మహేంద్రనాథ్, చిన్నారెడ్డి వంటి ఎందరో గొప్పనేతలు ప్రాతినిధ్యం వహించినా వారికి దక్కని అవకాశాన్ని సోనియమ్మ ఇచ్చారన్నారు. పాలమూరు బిడ్డ సీఎం కుర్చీలో కూర్చొని 150 రోజులు కాకముందే.. కాకుల్లా, గద్దల్లా పొడుస్తున్నారని, దిగిపో, దిగిపో అంటున్నారని, అండగా ఉండాల్సి వారే శత్రువులతో జతకట్టారని సీఎం ఆవేదన చెందారు. రేవంత్‌ని పడగొడతానని, కాంగ్రెస్‌ని ఖతం చేస్తానని డీకే అరుణమ్మ అంటున్నారని చెప్పారు. 'మోదీ చేతిలో చురకత్తిలా మారిన అరుణమ్మ కాంగ్రెస్‌ను పొడిచేందుకు వస్తున్నారు. నాయకురాలిగా ఆమె పేరు దేశమంతా తెలిసే స్థాయికి ఆమెకు కాంగ్రెస్ సహకరించింది.. అయినా, పార్టీని ఖతం చేస్తావా? రేవంత్‌ను అరెస్టు చేయడానికి అమిత్‌షాతో పైరవీ చేయించి మరీ ఢిల్లీ పోలీసులను తెప్పించారు.. అరుణమ్మా! నీకిది న్యాయమా?' అని సీఎం ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తనపై పగబట్టారని అరుణమ్మ అంటోందని, తాను ఆమెపై ఎందుకు పగబడతానని, తమ మధ్య ఏమైనా ఆస్తి, గట్టు పంచాయితీలున్నాయా అని నిలదీశారు.





## తప్పుడు కేసులు పెడితే భయపడతామా?

- రాహుల్ చెప్పిన మాటలనే రేవంత్ చెప్పారు
- రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది
- సింగరేణి గనులను ప్రైవేటు పరం కానివ్వం: భట్టి
- ఈ ఎన్నికలు మా పాలనకు రెఫరెండమే: తుమ్మల
- బీజేపీ మోసపూరిత హామీలిస్తోంది: పొంగులేటి



కొత్తగూడెం, మే 4: రాజ్యాంగాన్ని కాపాడతామని రాహుల్ గాంధీ చెప్పిన మాటలనే సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తప్పుడు కేసులు పెట్టి ఢిల్లీకి పిలిస్తే భయపడతామా? అని ప్రశ్నించారు. రిజర్వేషన్లతో పాటు విలువైన ఆస్తులు, వ్యవస్థలను కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కొత్తగూడెంలో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర బహిరంగ సభలో భట్టి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షిస్తామని జోడో యాత్ర ద్వారా రాహుల్ చాటిచెప్పారన్నారు. సింగరేణి కార్మికులకు లాభాలు పంచకుండా గత ప్రభుత్వం మొద్దు నిద్రపోయిందని విమర్శించారు. సింగరేణి బొగ్గు బావులను ప్రైవేటు పరం కాకుండా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఐదేళ్లలో డ్వాక్రా సంఘాలకు లక్ష కోట్ల వడ్డీలేని రుణాలను అందజేస్తామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎర్రటి ఎండలో ఉన్న జన ప్రభంజనమే.. కాంగ్రెస్ విజయానికి సూచిక అని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని, ఈ ఫలితాలు తమ పాలనకు రెఫరెండమేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తమ ప్రభుత్వం వైపు కన్నెత్తి చూడకుండా ఉండేలా 15 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మోసపూరిత హామీలు ఇచ్చి బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలని కుటిల ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చే ఆలోచనతో ఉన్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. పదేళ్లలో ఏనాడూ ఖమ్మం జిల్లాకు రాని కేసీఆర్.. ఇప్పుడు కర్ర పట్టుకొని వచ్చి ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. ఎంపీ రేణుకాచౌదరి మాట్లాడుతూ రాజ్యసభలో తాను, లోక్‌సభలో రఘురాంరెడ్డి, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఉంటే రాష్ట్రానికి వచ్చే నిధులను ఎవరూ ఆపలేరన్నారు.

# మెదక్‌లో కాంగ్రెస్‌ను గెలిపిద్దాం

- రాహుల్‌గాంధీని ప్రధానిని చేసుకుందాం
- నలభై ఏళ్ల కిందట ఇందిర ఇక్కడే గెలిచారు
- ఆమె హయాంలో అనేక పరిశ్రమల ఏర్పాటు
- గజ్వేల్‌లో కాంగ్రెస్‌కు 25వేల మెజారిటీ వస్తే
- అభివృద్ధి బాధ్యత నేను తీసుకుంటా: జగ్గారెడ్డి

గజ్వేల్/సంగారెడ్డి, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించాలని, తద్వారా రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకునే ఆస్కారం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోతోపాటు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల కిందట ఇదే నియోజకవర్గం నుంచి రాహుల్‌గాంధీ నానమ్మ దివంగత ఇందిరాగాంధీ గెలుపొంది ప్రధాని అయ్యారని గుర్తు చేశారు. ఇందిరా గాంధీ హయాంలోనే ఇక్కడ అనేక పరిశ్రమలు ఏర్పాటు చేశారని వెల్లడించారు. ఈ సారి రాహుల్ గాంధీ ప్రధాని అయి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు కనీసం 25వేల ఓట్ల మెజార్టీని అందిస్తే, ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనుల బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు రావాల్సిన పరిహారాన్ని ఇప్పించడంతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారులతో కలిసి గతంలో బీఆర్ఎస్ నేతలు.. కాంగ్రెస్ వాళ్లను ఆడుకున్నారని, ఇప్పుడు మనం ఆడుకుందామని అన్నారు. ఏ పోలీస్ కూడా కాంగ్రెస్ కార్యకర్తలను టచ్ చేయలేరని, కార్యకర్తలకు ఏదైనా జరిగితే తానే స్వయంగా వస్తానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. కలెక్టర్, ఎస్పీ మొదలు ఇతర అధికారులందరూ మీరు చెప్పినట్టే పని చేస్తారని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీ.నర్సారెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షురాలు టి.ఆంక్షారెడ్డి, జి.ఎలక్షన్‌రెడ్డి, ఎం.భూంరెడ్డి పాల్గొన్నారు.



గజ్వేల్‌లో జరిగిన రోడ్‌షోలో మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి, కాంగ్రెస్ నాయకులు



# బోనస్ బోగస్సే

(మొదటి పేజీ తరువాయి)

కొట్టుకుంటున్నారని గుర్తుచేశారు. పల్లె, పట్టణ ప్రగతిలో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పనులను చేపడితే.. ప్రస్తుత సర్కారు వాటిని పూర్తిగా మాయం చేసిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ చేపట్టిన పనులన్నింటినీ నిలిపివేసిందని, సాగు నీరు అందక లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నా కాంగ్రెసోళ్లకు సోయి లేకుండాపోయిందని మండిపడ్డారు. మంచిర్యాల ప్రజల చిరకాల వాంఛ ప్రత్యేక జిల్లా అని, అది ఉండాలా? పోవాలా? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ మొండి వైఖరి, మూర్ఖపు పట్టుదలతో ప్రజలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. రైతుల నోట్లో మట్టికొట్టే పరిస్థితి తెచ్చిందని, ముఖ్యమంత్రి ఐదెకరాలకే రైతుబంధు అంటున్నాడని, భవిష్యత్తులో దున్నేటోనికే పథకాన్ని ఇస్తానన్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. కేంద్రంలోని మోదీ సర్కారుపైనా కేసీఆర్ విరుచుకుపడ్డారు. "సింగరేణి సంస్థ తెలంగాణ కొంగు బంగారం. అలాంటి సింగరేణిని ప్రైవేటుపరం చేయడానికి మోదీ సర్కారు కుట్ర పన్నుతోంది. నరేంద్రమోదీ నా మెడపై కత్తి పెట్టి.. ఆస్ట్రేలియా బొగ్గు కొనాలని ఒత్తిడి తెచ్చారు. దానికి నేను ఒప్పుకోలేదు. సింగరేణిని కాపాడాలంటే.. బీఆర్ఎస్ గెలవాలి. కృష్ణా, గోదావరి నదులను మోదీ ఎత్తుకుపోతానంటుంటే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోరు మెదపడం లేదు. మంచిర్యాల జిల్లాను తీసేస్తామంటున్నారు. మంచిర్యాలను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించాలి. నా ప్రాణాలను బలిచేసి అయినా.. రాష్ట్రాన్ని కాపాడతాను" అని ఉద్వేగంగా అన్నారు. రైతుల ఆదాయం పెంచుతామన్న మోదీ హామీ ఏమైందని నిలదీశారు. మోదీది గ్యాస్ కంపెనీ అని, పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరు గెలవాలో ప్రజలే నిర్ణయించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ అన్నివర్గాల ప్రజలను నట్టేట ముంచిందని, బీజేపీతో ఒరిగేదేమీ లేదన్నారు. తెలంగాణకు రక్షణ.. బలం.. బలగం.. అంతా బీఆర్ఎస్సేనన్నారు. "బీఆర్ఎస్ హయాంలో గిరిజనులకు 4.5 లక్షల ఎకరాల పోడు భూములు ఇచ్చాం. రైతుబంధు అమలు చేశాం. ముస్లింలకు రంజాన్ తోఫా ఇచ్చాం. కాంగ్రెస్ హయాంలో ఎందుకు ఇవ్వడం లేదు? బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుస్తున్నారని అన్ని సర్వేలు చెబుతున్నాయి. ప్రజలు మళ్లీ తప్పుచేయొద్దు. మోసపోవొద్దు. గోస పడవద్దు" అని వ్యాఖ్యానించారు. కాగా.. శనివారం సాయంత్రం కేసీఆర్ మంచిర్యాల రోడ్‌షోకు వచ్చే ముందు గోదావరిఖని వద్ద బ్రిడ్జిపై ఆగారు. అక్కడ గోదారమ్మకు పూలు, వస్త్రాలు సమర్పించి నమస్కరించారు. అక్కడే కొందరు మహిళలు కేసీఆర్‌కు హారతులతో స్వాగతం పలికారు.

# అవి అయోధ్య అక్షింతలు కావు.. రేషన్ బియ్యం

- దేవుడిని అడ్డంపెట్టుకునే లంగలు బీజేపోళ్లు
- దేవుడి పేరిట మేమెన్నడూ రాజకీయాలు చేయలేదు
- కేసీఆర్ అభివృద్ధి చేస్తే రేవంత్‌రెడ్డి ఉల్టా చేస్తున్నాడు
- కొత్త జిల్లాలను కొనసాగించకుంటే ఉద్యమం
- రాష్ట్రంలో పిచ్చోడి చేతులో రాయిలా పాలన
- కూటమిలో లేని పార్టీలూ ఢిల్లీని శాసించొచ్చు: కేటీఆర్



కంటోన్మెంట్ రోడ్డు షోలో మాట్లాడుతున్న కేటీఆర్


సిరిసిల్ల/హైదరాబాద్ సిటీ/జీడిమెట్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): 'బీజేపోళ్లు ఇంటింటికి వచ్చి అక్షింతలు నెత్తిమీద చల్లుతున్నారా? అవి ఆడికెళ్లి (అయోధ్య నుంచి) రాలేదు. ఇక్కడే రేషన్ బియ్యం, పసుపు కలిపి నెత్తిమీద చల్లిపోతున్నారు. దేవుడిని అడ్డంపెట్టుకొని రాజకీయం చేసే లంగలు బీజేపోళ్లు' అని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. మార్కెట్, లేబర్ అడ్డా, కార్మిక వాడల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీజేపీ నేతలు దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ యాదగిరిగుట్టపై గుడి కట్టించారని, అయినా దేవుడి పేరు చెప్పి తామెన్నడూ రాజకీయాలు చేయలేదన్నారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే.. ధరలు ఇంకా పెరగడం ఖాయమన్నారు. 2014లో రూ.15 లక్షలు అకౌంట్లలో వేస్తామని చెప్పి మోసం చేసిన మోదీ, ఇప్పుడు తులం బంగారం ఇస్తానని మోసం చేసిన రేవంత్‌రెడ్డికి ఓటుతోనే సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో కరెంట్ కోతలు ఎక్కువయ్యాయని, మంచినీళ్లకు గోస పడుతున్నారని, మరమగ్గాలు బంద్ అయ్యాయన్నారు. ఈ మార్పు బాగుందా? అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు 10 నుంచి 12 ఎంపీ సీట్లు ఇస్తే కేసీఆర్ మళ్లీ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారని ఆయన అన్నారు. రాష్ట్రంలో పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని, నాలుగున్నర నెలలుగా చిల్లర మాటలు, ఉద్దెర పనులు తప్ప ముఖ్యమంత్రి చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయ భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి బాటలో నడిపించారని పేర్కొన్నారు. కేసీఆర్ ఏం చేస్తే దానికి ఉల్టా చేయాలన్న ఒకే ఒక్క ఆలోచనలో రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని నడిపించే విధానం కనిపిస్తోందన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 10 జిల్లాలు ఉన్న తెలంగాణను 33 జిల్లాలు చేసిందని పేర్కొన్నారు. పరిపాలనను వికేంద్రికరించడం వల్ల ప్రజలకు అధికారులు చేరువయ్యారని, సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నానని, కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కొత్త జిల్లాలను కొనసాగించాలని, లేకుంటే ప్రజా ఉద్యమం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.

### కేసీఆర్‌ను తిట్టడం పాలన కాదు

'ఎన్‌డీఏ, ఇండియా కూటమిలలో లేని బీఆర్ఎస్, బిజూ జనతా దళ్, వైఎస్ఆర్‌సీపీ వంటి పార్టీలున్నాయి. రేపు కాలం కలిసొస్తే.. ఏదైనా జరగొచ్చు.. కూటముల్లో లేని 13 పార్టీలు ఢిల్లీలో చక్రం తిప్పొచ్చు.. దేశ రాజధానిని శాసించొచ్చు. శాసించి ఢిల్లీని లొంగదీసుకుందామా..? యాచించి వాళ్ల వద్దకు పోదామా ఆలోచించాలి' అని కేటీఆర్ అన్నారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్ వద్ద నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌ను తిట్టడం పాలన కాదని రేవంత్‌రెడ్డినుద్దేశించి అన్నారు.



# పాతకాపుల పోరు




- మానుకోటలో మరోసారి త్రిముఖ పోటీ
- రెండోసారి గెలుపు కోసం బరిలో మాజీలు.. బలరాం నాయక్, కవిత, సీతారాంనాయక్
- అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఊపులో కాంగ్రెస్
- ప్రతిష్ఠను కాపాడుకునే యత్నంలో బీఆర్ఎస్
- సీతారాంను చేర్చుకుని రేసులో నిలిచిన బీజేపీ

**ముగ్గురూ ముగ్గురే. నియోజకవర్గ ప్రజలతో ఆత్మీయ అనుబంధం ఉన్నవారే. ఒక్కోసారి ఒక్కొక్కరు ఎంపీగా గెలిచి.. పనితీరులో తమదైన ముద్ర వేసినవారే. రాజకీయ పరిస్థితులు కలిసివస్తే విజయకేతనం ఎగురవేసే సత్తా కలిగినవారే. అలాంటి ముగ్గురు దీటైన అభ్యర్థుల మధ్య మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో ఈసారి ముక్కోణపు పోటీ జరుగుతోంది. ఎవరు గెలిచినా.. రెండోసారి పార్లమెంటులో అడుగు పెట్టనుండడంతో విజయం కోసం ఎవరికి వారు తీవ్రంగా శ్రమిస్తున్నారు.**

(ఆంధ్రజ్యోతి, మహబూబాబాద్)

2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడ్ పార్లమెంట్ స్థానం ఏర్పాటైంది. ఏజెన్సీ బెల్టులోని ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, భద్రాచలం, పినపాక అసెంబ్లీ సెగ్మెంట్లను కలుపుకొని నూతన లోక్‌సభ నియోజకవర్గంగా ఆవిర్భవించింది. ఈ స్థానానికి తొలిసారి 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోరిక బలరాంనాయక్, నాటి మహాకూటమి తరఫున సీపీఐ నుంచి కుంజా శ్రీనివాసరావు, చిరంజీవి నేతృత్వంలోని ప్రజారాజ్యం పార్టీ నుంచి రిటైర్డ్ పోలీస్ అధికారి డీటీనాయక్ పోటీ చేయగా.. త్రిముఖ పోరు జరిగింది. ఆ పోరులో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపొందాడు.. కేంద్రంలోని నాటి యూపీఏ ప్రభుత్వంలో మంత్రి కూడా అయ్యారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014లో జరిగిన ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ చేతిలో ఓడిపోయారు. ఇక 2019లో జరిగిన గత ఎన్నికల్లో బీఆర్ఎస్.. సిటింగ్ ఎంపీగా ఉన్న సీతారాం నాయక్‌ను కాదని మాజీ ఎమ్మెల్యే మాలోత్ కవితను ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించింది. బీజేపీ తరఫున జాటోతు హుస్సేన్‌నాయక్ కూడా పోటీ చేసినా.. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే హోరాహోరీ పోరు జరిగింది. ఈసారి మాలోత్ కవిత చేతిలో బలరాం ఓటమి చవిచూశారు.

## అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం..

తెలంగాణ ఆవిర్భావం నుంచి వరుసగా రెండుసార్లు రాష్ట్రంలో అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ఇటీవల జరిగిన మూడో అసెంబ్లీ ఎన్నికల్లో బోల్తా కొట్టిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలు జరిగిన ఆరు నెలల్లోపే పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా.. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్, ఓటమిపాలైన బీఆర్ఎస్ మానుకోటలో నువ్వా? నేనా? అన్నట్టు తలపడుతున్నాయి. మరోవైపు తెలంగాణలో ఈసారి ఎలాగైనా అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకోవాలని ప్రయత్నిస్తున్న బీజేపీ కూడా మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇందుకోసం బీఆర్ఎస్ మాజీ ఎంపీ సీతారాం నాయక్‌ను తమ పార్టీలో చేర్చుకొని మహబూబాబాద్ బరిలోకి దింపింది. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ పరిధిలోని ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక శాసనసభ స్థానాల్లో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. ఒక్క భద్రాచలంలో మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందారు. కానీ, ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. మొత్తంగా పార్లమెంట్ పరిధిలో ప్రస్తుతం ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్ పక్షాన ఉన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు ప్రజలు మార్పు కోరుకున్న నేపథ్యంలో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఇప్పటికే ఐదు గ్యారెంటీలు అమలు చేస్తోందని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ విజయం లభిస్తే మరికొన్ని అమలు చేస్తామంటూ సీఎం సహా ఆ పార్టీ నేతలంతా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇక మోసపూరిత హామీలతో కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ప్రజలను మభ్యపెట్టిందంటూ ఓవైపు, కేంద్రంలోని బీజేపీ విభజన హామీలను విస్మరించి తెలంగాణకు అన్యాయం చేసిందని మరోవైపు రెండు అస్త్రాలు సంధిస్తూ బీఆర్ఎస్ ప్రచారంలోకి దిగింది. బీజేపీ మాత్రం తాము తెలంగాణ అభివృద్ధికి ఎంతో చేశామని, హ్యాట్రిక్ సాధిస్తే వచ్చే ఐదేళ్లలో మరింత అభివృద్ధి చేస్తామని చెబుతోంది.

### 2019 లోక్‌సభ ఎన్నికల్లో..

| బీఆర్ఎస్ | కాంగ్రెస్ | బీజేపీ |
|---|---|---|
| మాలోత్ కవిత | బలరాం నాయక్ | హుస్సేన్ నాయక్ |
| 4,62,109 | 3,15,446 | 27,487 |


| | |
|---|---|
| పురుషులు | 7,47,836 |
| మహిళలు | 7,84,424 |
| ఇతరులు | 106 |
| మొత్తం ఓటర్లు | 15,32,366 |

### ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

| | |
|---|---|
| కాంగ్రెస్ | ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక |
| బీఆర్ఎస్ | భద్రాచలం (ఎమ్మెల్యేగా గెలిచిన తెల్లం వెంకట్రావ్ ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరారు) |

### యువ ఓటర్లే కీలకం!

మహబూబాబాద్ పార్లమెంటు స్థానం ఫలితాన్ని ఈసారి యువ ఓటర్లే నిర్దేశించే అవకాశాలున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 15,32,366 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో సుమారు 7 లక్షల దాకా యువ ఓటర్లే ఉన్నారు. వీరిలోనూ ఈసారి కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య 46 వేలకు పైగా ఉంది. ఈ ప్రాంతలో సింగరేణి మినహా.. పరిశ్రమలంటూ లేకపోవడంతో నిరుద్యోగ సమస్య అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువత ఏ పార్టీవైపు మొగ్గు చూపుతారన్నదానిపైనే ఫలితం ఆధారపడి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



### 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?

| పార్టీ | ఓట్లు |
|---|---|
| కాంగ్రెస్ | 6,85,897 |
| బీఆర్ఎస్ | 4,43,910 |
| బీజేపీ | 34,431 |



### ఆకలి కాలం

ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా ఉంటున్న మాజీ మంత్రి హరీశ్‌రావు శనివారం సాయంత్రం రోడ్డు పక్కన హోటల్‌లో టిఫిన్ చేశారు. హైదరాబాద్ నుంచి భూంపల్లికి వెళ్తున్న ఆయన సిద్దిపేట హౌసింగ్ బోర్డు కమాన్ టిఫిన్ సెంటర్ వద్ద కారు దిగి.. 'బాబూ ఓ దోశ వేయి' అని కోరారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామరెడ్డితో కలిసి దోశ తిన్నారు.



### ఓటరు రికార్డు

హైదరాబాద్‌లో ఇంటి వద్ద ఓటు వేస్తున్న స్వాతంత్ర్య సమర యోధుడు, 96 ఏళ్ల త్రిపురనేని వెంకటేశ్వరరావు. తొలి సార్వత్రిక ఎన్నికల నుంచి ఓటు వేస్తుండడం ఈయన ఘనత.

## తెలుగు నేల నుంచి ఇద్దరు ప్రధానులు!



దేశంలో 29 రాష్ట్రాలు ఉంటే ప్రధానమంత్రులను అందించినవి ఐదారు మాత్రమే. ఇక దక్షిణాది నుంచి చూస్తే ఉమ్మడి ఏపీ ఉండగా.. అపర మేధాని పీవీ నరసింహారావు దేశ అత్యున్నత పదవిని అలంకరించారు. 1991లో ఈ బాధ్యతలను చేపట్టిన పీవీ.. మైనారిటీ ప్రభుత్వాన్ని ఐదేళ్ల పాటు దిగ్విజయంగా నడిపారు. అంతేకాక.. దేశ ప్రగతిని మలుపుతిప్పిన ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టి చరిత్రలో నిలిచిపోయారు. అయితే, తెలుగు గడ్డపై నుంచి ప్రధాని అయిన తొలి వ్యక్తి పీవీ కాదు..! ఈయన కంటే ముందే ఇందిరాగాంధీ ఆ ప్రత్యేకతను సాధించారు. జనతా ప్రభుత్వం పతనం అనంతరం 1980లో జరిగిన ఎన్నికల్లో యూపీలోని రాయ్‌బరేలీ, ప్రస్తుత తెలంగాణలోని మెదక్ నుంచి ఇందిరా పోటీ చేశారు. నాడు కాంగ్రెస్ విజయం సాధించడంతో ఆమె ప్రధాని కూడా అయ్యారు. అనంతరం తమ కంచుకోట అయిన రాయ్‌బరేలీని వదులుకుని మరీ మెదక్ ఎంపీగా కొనసాగారు. ప్రధాని హోదాలో మెదక్ జిల్లా పరిషత్ సమావేశానికీ హాజరయ్యారు. చివరకు మెదక్ ఎంపీగా ఉండగానే దారుణ హత్యకు గురయ్యారు. ఇలా చూస్తే తెలుగు గడ్డ నుంచి తొలుత ప్రధాని అయింది ఇందిరా గాంధీనే. కానీ, అచ్చ తెలుగు బిడ్డగా చూస్తే ఆ ఘనత పీవీ నరసింహారావుదే.



మీకు తెలుసా!?



## అందరికీ ఆయన పాటే!

- అన్ని పార్టీల ప్రచార రథాల్లోనూ ఒకే గొంతు
- దుమ్మురేపుతున్న నల్లగొండ గద్దర్ పాటలు
- ఏపీలోనూ చంద్రబాబుపై పాడిన నర్సన్న

(ఆంధ్రజ్యోతి, సిద్దిపేట)

ఓ గాత్రం.. మెదక్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు సంబంధించిన ప్రచార రథంలో పాటతో మార్మోగుతోంది. అదే గొంతు.. అదే పార్లమెంటు స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్న వెంకట్రామిరెడ్డిపై పాటతో దుమ్మురేపుతోంది. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకూ ఆ గొంతే పాడుతోంది. ఇలా ఒకే గాయకుడు మూడు పార్టీల అభ్యర్థుల తరఫున పాటలు పాడి.. ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఒక్క మెదక్‌లోనే కాదు.. పార్లమెంటు ఎన్నికల్లో ఎక్కడ చూసినా, ఏ పార్టీ ప్రచార రథాల్లో విన్నా ఆయన స్వరమే వినిపిస్తోంది. ఆయనే.. నల్లగొండ గద్దర్‌గా పేరు పొందిన నర్సన్న అలియాస్ కాసాల నర్సిరెడ్డి. తన ప్రత్యేకమైన గాత్రంతో పలు పాటలు ఆలపించడం ద్వారా వెలుగులోకి వచ్చిన నర్సన్న.. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోసం పాడిన 'మూడు రంగుల జెండా పట్టి' అనే పాట జనంలోకి బాగా వెళ్లింది. కాంగ్రెస్ సభలు నిర్వహించిన చోట జనానికి హుషారు తెప్పించడంతోపాటు ఓ సభలో ప్రియాంకగాంధీతో కూడా స్టెప్పులు వేయించింది. దీంతో తాజాగా జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో అన్ని పార్టీల నేతలూ నర్సన్నతో పాట పాడించుకునేందుకు క్యూ కట్టారు. అయితే అందరి ప్రచార రథాల్లోనూ నర్సన్న గొంతే వినిపిస్తుండడంతో.. అది ఏ పార్టీ ప్రచార రథమోనని ప్రజలు కొద్దిసేపు అయోమయానికి గురవుతున్నారు. కాగా, ఏపీ ఎన్నికల్లోనూ నర్సన్న.. టీడీపీ అధినేత చంద్రబాబుకు మద్దతుగా పాటలు పాడారు. ఈ పాటలకు అక్కడ విశేష స్పందన వస్తోంది.



బూర నర్సయ్య వాహనం



కొప్పుల ఈశ్వర్ వాహనం

## నాయకా.. నెమ్మది!

- పలువురు ఎంపీ అభ్యర్థుల వాహనాలపై అతివేగం చలాన్లు
- నామినేషన్ నాటికీ పెండింగ్.. విషయం తెలిసి వెంటనే చెల్లింపు

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): నాయకుల వాహనాలంటేనే హడావుడి.. పదుల సంఖ్యలో కార్లు రయ్‌రయ్‌మంటూ దూసుకెళ్తుంటాయి.. అతి వేగం, నిర్లక్ష్యం, సిగ్నల్ జంప్ సరేసరి. ప్రస్తుతం పోటీ చేస్తున్న పలువురు అభ్యర్థుల వాహనాలపై ట్రాఫిక్ చలానాలు భారీగానే ఉన్నాయి. నిబంధనల ప్రకారం.. నామినేషన్ సమయానికి వాటన్నిటినీ చెల్లించాలి. కానీ, ఆ పని చేయలేదు. ఈ విషయం శనివారం ప్రచారంలోకి వచ్చింది. దీంతో కొందరు ట్రాఫిక్ చలానాలు చెల్లించేశారు. కాగా, బాధ్యత గల వ్యక్తులుగా పరిమిత వేగం, నిబంధనలకు లోబడి డ్రైవింగ్ చేసేలా చూసుకోవాల్సిన బాధ్యత నాయకులపై ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### కొప్పులపైనే అధికం.. బూరకు సెకను తేడాలో

- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ వాహనం (టీఎస్02ఈఫై 0456)పై జనవరి 15- ఏప్రిల్ 22 మధ్య అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణాలతో ఆరుసార్లు ఉల్లంఘనలకు గాను సిద్దిపేట, మేడ్చల్, మంచిర్యాల పోలీసలు రూ.6210 జరిమానా విధించారు.
- బీజేపీ భువనగిరి అభ్యర్థి బూర నర్సయ్య (టీఎస్09ఎఫ్ఎస్ 6699) జనవరి 19న అతివేగంగా వెళ్తుండగా చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసలు రూ.1,035 జరిమానా వేశారు. గత నెల 22న ఐఐసీటీ హబ్సిగూడ వద్ద అతివేగం కారణంగా నల్లకుంట ట్రాఫిక్ పోలీసలు రూ.1035 చలానా రాశారు. అయితే, సెకన్ వ్యవధిలో మరో జరిమానా కూడా విధించడం గమనార్హం.
- కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు వాహనం (టీఎస్ 15ఎఫ్‌జే2345)పై నార్సింగి, మేడ్చల్, గజ్వేల్, బంజారాహిల్స్ ట్రాఫిక్ స్టేషన్ల పరిధిలో రూ.3,305, జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కర్ వాహనంపై రూ.3,105, పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ వాహనంపై రూ.2,070 చలాన్లు ఉన్నాయి.
- సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు వాహనంపై రూ.1,035, నల్లగొండ నుంచి పోటీ చేస్తున్న కంచర్ల కృష్ణారెడ్డి వాహనంపై రూ.200 జరిమానా ఉన్నాయి.

# ఐదు నెలల్లోనే పదేళ్ల వ్యతిరేకత

## కాంగ్రెస్ పాలనను ప్రజలు హర్షించడం లేదు.. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి




హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరం బీజేపీకి లేదని, పైగా రాజ్యాంగానికి తాము మరింత గౌరవం తెస్తామని ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిననే విషయాన్ని మరిచిపోయి మాట్లాడుతున్నారని, ఆయనను, ఆయన పార్టీని ప్రజలే తరిమి కొడతారని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన తరువాత వ్యతిరేకతను తెచ్చుకుంటే.. కాంగ్రెస్ ఐదు నెలల్లోనే పదేళ్ల వ్యతిరేకతను తెచ్చుకుందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక ముఖ్యమంత్రి తొండివాదన చేస్తున్నారని, హామీలపై రేవంత్‌వి దొంగ నాటకాలు అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఒక్క ఉచిత బస్సు హామీని అమలుచేసి.. దానిపైనే రిఫరెండం అంటారా? అని ఎద్దేవా చేశారు. రేవంత్ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం తమకు లేదని, ఐదేళ్ల తర్వాత ప్రజలే తరిమికొడతారని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదన్నారు. తెలంగాణ ప్రజలు ఈ ఎన్నికల్లో బీజేపీని ఆదరిస్తారని, ఐదేళ్ల తరువాత రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి రాబోతోందని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శనివారం 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో కిషన్‌రెడ్డి మాట్లాడారు.

**ఐదు నెలల పాలనే తమ ఎజెండా, దానికి రిఫరెండమే ఈ ఎన్నికలని సీఎం రేవంత్ అంటున్నారు. మీ ఎజెండా ఏంటి?**

అసలు ఏదైనా పని చేస్తే కదా రెఫరెండం. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినంత మాత్రాన ఈ ఎన్నికల్లో అది కాంగ్రెస్ పరిపాలనకు రెఫరెండం అవుతుందా? ఆరు గ్యారంటీలపై సీఎం రేవంత్‌రెడ్డి దొంగ నాటకాలాడుతున్నారు. చెప్పుకోవడానికి ఏమీ లేక గ్యారంటీల కు సంబంధించి దేవుడిపై ఒట్లు పెడుతున్నారు. ఆయనకు ముందుంది ముసళ్ల పండగ. హామీలు అమలు చేయలేకపోతే ఎలాంటి పరిస్థితి ఉంటుందో ఆయన చూడబోతున్నారు. తిట్ల రాజకీయం ఎన్ని రోజులు చేస్తారు? భూములమ్మితే ఎన్ని లక్షల కోట్లు వస్తాయి? ఇక మా ఎజెండా.. ప్రధాని నరేంద్రమోదీ పదేళ్లలో సాధించిన విజయాలు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం చేసిన సాయం. పదేళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణకు రూ.9 లక్షల కోట్లు ఇచ్చింది. వందశాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎన్నో ప్రాజెక్టులు చేపట్టింది. హార్టికల్చర్ యూనివర్సిటీ, సమ్మక్క, సారక్క గిరిజన విశ్వవిద్యాలయం, ఎన్టీపీసీ రెండో యూనిట్ ప్రారంభం, పసుపు బోర్డు ఏర్పాటుకు చర్యలు తదితర ప్రాజెక్టులు చేపట్టాం. వీటిపైనే ఇంటింటికీ వెళ్తున్నాం. తెలంగాణను బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల నుంచి విముక్తి చేయడమే మా లక్ష్యం.

**రాజ్యాంగ మూలసూత్రాలను తుడిచేయడానికి బీజేపీ యత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది?**



ఇది మా ఎజెండాలోనే లేదు. రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరం మాకు లేదు. మరింత సమర్థంగా రాజ్యాంగాన్ని అమలుచేస్తాం. దాని గౌరవాన్ని కాపాడుతాం. మేం అధికారంలోకి వచ్చిన తరువాతనే కశ్మీర్‌లో రాజ్యాంగాన్ని అమలు చేశాం. అంబేడ్కర్ పంచతీర్థాలను అభివృద్ధి చేశాం. పార్లమెంట్‌లో ఆయన ఫొటో మేమే పెట్టాం. మా వల్లనే అంబేడ్కర్‌కు భారతరత్న వచ్చింది. మేం ప్రజాస్వామ్యం మీద నమ్మకం ఉన్నవాళ్లం. మా పార్టీ ప్రజాస్వామ్యయుతంగా ఉంటుంది. పార్టీకి నడ్డా అధ్యక్షుడుగా ఉన్నారు.. సామాన్య కార్యకర్త కూడా అధ్యక్షుడయ్యే అవకాశం బీజేపీ పార్టీలో ఉంది. మిగతా పార్టీలు కుటుంబ, వ్యక్తి పార్టీలు. ఇప్పటికే 15 మంది బీజేపీ అధ్యక్షులు అయ్యారు. మోదీని విమర్శించడానికి ఏమీ లేదు. వామపక్షాలు, కాంగ్రెస్ నాయకులకు ఏమీ దొరక్క వితండవాదం చేస్తున్నారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు రాజ్యాంగాన్ని రక్షిస్తానని, దానిని మార్చేందుకు ఎవరు ప్రయత్నించినా ఒప్పుకోనని ప్రధాన మంత్రి చెప్పారు. ఇంతకంటే ఏం చెబుతారు?

**కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం రాబోతోందని, బీఆర్ఎస్ కీలకం కాబోతోందని కేసీఆర్ అంటున్నారు?**

మోదీ పోతాడు.. సంకీర్ణం వస్తుంది అని చెప్పడమంటే కాంగ్రెస్‌తో కలుస్తానని కేసీఆర్ ఒప్పుకొన్నట్లే కదా! ఆయన కాంగ్రెస్‌తో కలిశాడని ఇన్ని రోజులుగా మేం చెబుతున్నాం. ఇప్పుడు ఆయనే చెప్పారు. బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు కూడా రాదు. ఒకవేళ ఒకటీ అరా వచ్చినా.. దానివల్ల తెలంగాణకు ఒరిగేదేమీ ఉండదు. మేమైతే కేసీఆర్‌ను చేర్చుకోం. సంకీర్ణయుగానికి కాలం చెల్లింది.అసలు సంకీర్ణం అంటేనే బ్లాక్‌మెయిల్ రాజకీయాలు. అందుకే దేశ ప్రజలు సుస్థిర ప్రభుత్వం కావాలని ఆకాంక్షించారు. అందుకే రెండుసార్లు బీజేపీకి పట్టం కట్టారు.

**కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ కూల్చివేస్తుందని సీఎం కూడా అంటున్నారు?**

మాకున్నది 8 సీట్లు. మేమెట్లా కూలుస్తాం? ఎవరు ఏమి మాట్లాడినా మాకు అనవసరం. మేం నాలుగున్నరేళ్లు ఆగుతాం. ప్రజాస్వామ్యబద్ధంగా అధికారంలోకి వస్తాం. వాళ్ల పార్టీలో అంతర్గత అసమ్మతి వచ్చి రేవంత్‌రెడ్డిని గద్దె దింపే పరిస్థితి వస్తే మాత్రం ఆ ప్రభుత్వాన్ని కట్టెలు పెట్టి నిలపాల్సిన అవసరం కూడా మాకు లేదు.

**బీజేపీని గెలిపించేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ బలమైన అభ్యర్థులను పోటీలో పెట్టలేదంటున్నారు కదా?**

వాళ్లే పరస్పరం భిన్నంగా మాట్లాడుతున్నారు. అర్థం లేని ప్రశ్నలు, గందరగోళం కలిగించే ప్రకటనలు చేస్తున్నారు. నిరాధారమైన అంశాలకు మీడియా కూడా ప్రాధాన్యం ఇస్తోంది. రెండు పార్టీల నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. గతంలో బీఆర్ఎస్, బీజేపీ కలుస్తాయని రేవంత్ అన్నారు. అప్పుడు కలిశామా? ఇన్ని రోజులు మజ్లిస్ బీఆర్ఎస్‌తో ఉంది.. ఇప్పుడు కాంగ్రెస్‌తో కలిసింది కదా! ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. కేంద్రంలో మాకు సీట్లు తగ్గినా సరే.. బీఆర్ఎస్ మద్దతు తీసుకోం.

**ఈ ఎన్నికలు గుజరాత్ పెత్తనానికి, తెలంగాణ పౌరుషానికి మధ్య పోరు అని సీఎం రేవంత్ అంటున్నారు?**

ఇదేం పోలిక? అర్థం ఉందా? ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరుగుతున్నాయి. తెలంగాణలో నువ్వు, నీ పార్టీ, నీ చరిత్ర ఏంటో చెప్పు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు ఇస్తామన్నారు.. అమలు చేయకుండా ప్రజలు, రైతులు ప్రశ్నిస్తారని రేవంత్ తొండివాదన చేస్తున్నారు. ప్రజల వద్దకు వెళ్లే నైతికత వాళ్లకు లేదు. ఏం పౌరుషం? మొన్న మోదీ వేదిక మీద చిన్న అన్న, పెద్ద అన్న అన్నప్పుడు పౌరుషం లేదా? సీఎం దిగజారి మాట్లాడుతున్నారు. ఆయన ఇంకా సీఎం అని అనుకుంటున్నట్లు లేదు. టీఆర్ఎస్ పోవడానికి పదేళ్లు పట్టింది.. వచ్చే ఐదేళ్ల తర్వాత కాంగ్రెస్‌కు డిపాజిట్లూ రావు. గ్రామాల్లోకి వెళితే తరిమి కొడతారు..

**మోదీ పాలనలో తెలంగాణకు గాడిద గుడ్డే ఇచ్చారని సీఎం ఆరోపిస్తున్నారు?**

ఇప్పుడు ఆయన తన పార్టీ చేయి గుర్తు మానేసి గాడిద గుడ్డు నెత్తిమీద పెట్టుకుని ఊరూరా తిరుగుతున్నాడు. గాడిద గుర్తుకే ఓటు వేయండి అని ప్రచారం చేస్తున్నారు. ఆయన పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లు ఏం చేశారో చర్చకు వస్తారా? నైతిక విలువలు లేకుండా మాట్లాడుతున్నారు.

**రామాలయం పేరుతో మోదీ ఓట్లు అడుగుతున్నారని కాంగ్రెస్ అంటోంది?**

జాతీయ రహదారుల గురించి చెబుతున్నాం. రైల్వేల గురించి చెబుతున్నాం.. స్వచ్ఛ భారత్ గురించి చెబుతున్నాం. గ్యాస్ కనెక్షన్ల గురించి, ఎగుమతుల మీద, దేశ విదేశాల్లో దేశం ప్రతిష్ఠ పెంచిన అంశాన్ని చెబుతున్నాం. ఉగ్రవాదం గురించి చెబుతున్నాం.. గుడ్ గవర్నెన్స్ గురించి చెబుతున్నాం.. కుటుంబ పాలన గురించి, జమ్ముకశ్మీర్‌లో శాంతిని పునరుద్ధరించామని, అవినీతి గురించి, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల గురించి ఇలా అనేక అంశాలు చెబుతున్నాం.. రామాలయం ఒక్కటే కాదు కదా! ఇవన్నీ పోయినట్టేనా? మాకు చెప్పడానికి అన్నీ ఉన్నాయి. యూపీఏ పదేళ్ల కాలంలో ఏం చేశారో, మోదీ పదేళ్లలో ఏం చేశారనే దానిపై చర్చకు వస్తారా?

**తెలంగాణలో మీకు ప్రధాన ప్రత్యర్థి ఎవరు?**

ఎన్నికల్లో మాది మొదటి స్థానం. మా ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్. చాలా చోట్ల బీఆర్ఎస్‌ది మూడో స్థానమేనన్నది నాకున్న సమాచారం.

**గ్యారంటీలపై కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంపై మీ అభిప్రాయం?**

అసలు ఆపార్టీకి ఏమాత్రం నైతికత ఉన్నా అలాంటి ప్రచారం చేసుకోదు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు హామీలో దారుణంగా విఫలమైంది. కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిస్తున్నా. ముఖం చెల్లని కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగాన్ని బీజేపీ మారుస్తుందని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. వంద శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో పూర్తిచేసిన ప్రాజెక్టులను కూడా కాంగ్రెస్ తన ఖాతాలో ప్రచారం చేసుకుంటోంది.

**పారాచూట్ నేతలకు ఎక్కువ స్థానాలు ఇవ్వడాన్ని ఎలా సమర్థించుకుంటారు?**

మా బలాన్ని పెంచుకోవడం కోసం అక్కడక్కడా కొత్తవాళ్లకు ఇచ్చాం. తప్పేముంది? అలా అంటే బీఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థిని కాంగ్రెస్ వాళ్లు తీసుకువెళ్లి ఖరారు చేయడాన్ని ఏమనాలి? మేం అలా చేయలేదు కదా! ఇక్కడ మాది చిన్న పార్టీ.. పెరగాల్సి ఉంది. స్థానిక సంస్థల్లో మా పార్టీ వాళ్లకు బోలెడు అవకాశాలున్నాయి. ఇస్తాం కూడా.

**ఎస్సీ వర్గీకరణ పట్ల బీజేపీకి చిత్తశుద్ధి లేదని, అందుకే మేనిఫెస్టోలో పెట్టలేదని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు?**

ప్రధానమంత్రి ప్రకటించిన తర్వాత ఇంకా మేనిఫెస్టోలో ప్రస్తావన అవసరమా? అంతేకాదు.. కులగణనకు కూడా మేం వ్యతిరేకం కాదు. కరోనా కారణంగా నిలిచిపోయిన జనగణన పూర్తికావాల్సిందే.



సీఎం రేవంత్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న రోహిత్ తల్లి రాధిక

## రోహిత్ కేసుపై పునర్విచారణ చేపడతాం

- ఆ కుటుంబానికి అండగా ఉంటాం: సీఎం రేవంత్‌రెడ్డి
- న్యాయం చేయాలని సీఎంకు రోహిత్ తల్లి రాధిక వినతి

హైదరాబాద్/రాయదుర్గం, మే 4 (ఆంధ్రజ్యోతి): రోహిత్ వేముల కుటుంబానికి అండగా ఉంటామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. రోహిత్ తల్లి రాధిక వేముల.. శనివారం సీఎం రేవంత్‌ను ఆయన నివాసంలో కలిశారు. తన కుమారుడి ఆత్మహత్య కేసు విషయమై పునర్విచారణ చేపట్టి, తగిన విధంగా న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు స్పందించిన సీఎం.. ఎనిమిదేళ్ల క్రితం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ ఆత్మహత్య ఘటన తనను ఎంతగానో కలచి వేసిందని పేర్కొన్నారు. ఆ సమయంలోనే రాహుల్ గాంధీ హెచ్‌సీయూని సందర్శించి ఆ కుటుంబానికి అండగా ఉంటామని మాట ఇచ్చారని, ఆ మాటను నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. కేసు పునర్విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కాగా, గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ మెయిన్ గేటు వద్ద వర్సిటీ విద్యార్థి సంఘం నాయకులతో కలిసి రోహిత్ తల్లి రాధిక విలేకరులతో మీడియాతో మాట్లాడారు. రోహిత్ ఆత్మహత్యకు కారణమైన వారికి శిక్షపడే వరకూ పోరాడుతానని స్పష్టం చేశారు. కొంతమంది పోలీసులు బీజేపీకి అనుకూలంగా విచారణ చేపట్టారని, రోహిత్ కులంపై హైకోర్టుకు తప్పుడు రిపోర్టు ఇచ్చారని మండిపడ్డారు. చదవలేక రోహిత్ చనిపోయాడని పేర్కొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై పునర్విచారణ చేపట్టాలని కోరగా, సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## కేసీఆర్‌కు మహిళలంటే గౌరవం లేదు: తమిళిసై

మెదక్ అర్బన్, మే 4 : ప్రధాని మోదీ గ్యారెంటీలే భారతదేశ గ్యారెంటీలని, దేశాభివృద్ధి, ఆరోగ్యం సురక్షితంగా ఉండాలంటే బీజేపీ సర్కార్ రావాలని తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ చెప్పారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో శనివారం రాత్రి నిర్వహించిన మేధావుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగించారు. తమ ప్రధాని అభ్యర్థి ఎవరో చెప్పి కాంగ్రెస్ ఓట్లు అడగాలన్నారు. కాంగ్రెస్‌కు, బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే ఎవరు ప్రధాని అవుతారో తెలియదని ఎద్దేవా చేశారు. టీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్‌గా మారగానే ఖతమైందని, మాజీ సీఎం కేసీఆర్‌కు మహిళలంటే గౌరవం లేదన్నారు. ఓ మహిళగా ప్రాధాన్యం ఇవ్వకున్నా గవర్నర్ పదవికి అయినా మర్యాద ఇవ్వలేదని మండిపడ్డారు. మెదక్ అభివృద్ధి బీజేపీ అభ్యర్థి రఘునందన్‌తో సాధ్యమని, భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## క్రిశాంక్‌కు ఒక్క రోజు పోలీస్ కస్టడీ

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించింది. కోర్టు అనుమతితో ఆదివారం క్రిశాంక్‌ను దర్యాప్తు అధికారులు కస్టడీకి తీసుకుని విచారించనున్నారు. చంచల్‌గూడ జైలులో విచారణ ఖైదీగా ఉన్న క్రిశాంక్‌ను ఆదివారం ఉదయం కస్టడీకి తీసుకుని సాయంత్రం వరకు విచారిస్తారు. ఉస్మానియా వర్సిటీలో హాస్టల్స్, మెస్ మూసివేతపై ఫేక్ సర్క్యులర్ వైరల్ చేసిన కేసులో క్రిశాంక్ ప్రధాన నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే.

## సెట్- 2024 నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్ సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ల అర్హత పరీక్ష అయిన తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ -2024 నోటిఫికేషన్ శనివారం విడుదలైంది. ఉస్మానియా వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సెట్ నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి విడుదలచేశారు. ఈ నెల 14వ తేదీ నుంచి జూలై 2లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు సభ్య కార్యదర్శి నరేశ్‌రెడ్డి వెల్లడించారు. ఆగస్టు 28, 29, 30, 31వ తేదీల్లో సెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## దిగొచ్చిన గోదావరి బోర్డు

- ఆఫీసు మాన్యువల్ సిద్ధం చేయడానికి కమిటీ

హైదరాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): ఆఫీస్ మాన్యువల్ విషయంలో ఎట్టకేలకు గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్‌ఎంబీ) దిగొచ్చింది. ఇప్పటిదాకా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మాన్యువల్‌నే పాటిస్తామని చెబుతూ వచ్చిన బోర్డు, తెలుగు రాష్ట్రాలు నిలదీయడంతో ప్రత్యేకంగా ఆఫీస్ మాన్యువల్‌ను తయారుచేయడానికి సుముఖత వ్యక్తం చేసింది. దీని కోసం బోర్డు సభ్య కార్యదర్శి అజగేషన్ నేతృత్వంలో తెలుగు రాష్ట్రాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)లతో కమిటీ వేసింది. రెండు మూడు నెలల్లోపు బోర్డు ప్రత్యేకంగా నియామావళిని సిద్ధం చేసుకోనుంది.

## తనిఖీల్లో రూ.16.84 లక్షల నగదు స్వాధీనం

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నగదు పట్టుబడుతోంది. నిజామాబాద్ జిల్లాలో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న డబ్బు, మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. శనివారం జిల్లావ్యాప్తంగా రూ.10,31,190 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మునిసిపల్ పరిధిలో వాహనాల తనిఖీ సందర్భంగా ఓ కారులో రూ.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గాదె వాగువద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.1.53 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకువస్తున్న భువనగిరికి చెందిన వ్యక్తి నుంచి రూ.93 వేలు, కొత్తగూడ మండలం దుర్గారంకు చెందిన మరో వ్యక్తి నుంచి రూ.60 వేలు స్వాధీనం చేసుకున్నారు.

## కొత్త పాసుపుస్తకం దరఖాస్తుకు రూ.1000

- డిజిటల్ సిగ్నేచర్ పెండింగ్‌కు పెరిగిన రుసుం

హైదరాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): ఏదైనా కారణం చేత పట్టాదారు పాసు పుస్తకం రాకపోతే... కొత్త పాసు పుస్తకం జారీ కోసం పెట్టుకునే దరఖాస్తు(డిజిటల్ సిగ్నేచర్ పెండింగ్)కు రుసుంను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొన్నటి వరకు కేవలం రూ.45 ఉన్న రుసుంను ఇప్పుడు ఏకంగా రూ.1000కి పెంచేసింది. అంతకుముందు ధరణి పోర్టల్‌లో జీఎల్ఎం (గ్రీవెన్స్ రిలేటెడ్ టూ ల్యాండ్ మ్యాటర్) పరిధిలో ఉన్న ఈ అంశాన్ని టీఎం-33 (టెక్నికల్ మాడ్యూల్-33) పరిధిలోకి మార్చింది. దీంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడనుంది. ధరణి పోర్టల్ ప్రక్షాళనలో భాగంగా టెక్నికల్ మాడ్యూల్‌లో ఈ ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలుస్తోంది. ఈ మాడ్యూల్‌లో ఇప్పటికే 10 ఆప్షన్స్ ఉన్నాయి. పేరు మార్పు, భూమి స్వభావం మార్పు, భూమి వర్గీకరణ మార్పు, నాలా నుంచి వ్యవసాయానికి మార్చడం తదితర అంశాలుండేవి. తాజాగా సర్వేనెంబరు డీఎస్ పెండింగ్ ఆప్షన్‌ను కూడా ఇందులో చేర్చారు. మరోవైపు ఇదివరకే జీఎల్ఎంలో దరఖాస్తు చేసుకున్న వారివి ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి.

# నేను పక్కా లోకల్.. గరీబోళ్ల బిడ్డను!

## ముఖ్యమంత్రి రేవంత్ గోబెల్స్ వారసుడు..ఒక్కో కార్పొరేటర్‌కు 20 లక్షలిచ్చి కొంటున్నారు

- అది 'ట్యాపింగ్' సొమ్మే.. ఈసీ విచారణ జరపాలి
- కరీంనగర్ అభివృద్ధికి రూ.12 వేల కోట్లు తెచ్చా
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు నాన్‌లోకల్
- మోదీ బతికున్నంతవరకు రిజర్వేషన్లు: బండి సంజయ్



హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): 'నేను పక్కా లోకల్.. గరీబోళ్ల బిడ్డను.. సీఎం రేవంత్ రెడ్డి గోబెల్స్ వారసుడు. పచ్చి అబద్ధాలను నిజమని నమ్మించేందుకు కుట్రలు చేస్తున్నాడు. బీజేపీ.. రిజర్వేషన్లను రద్దు చేయబోతోందంటూ విషప్రచారం చేస్తున్నాడు' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. 'రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తొలగిస్తామన్నందుకు బీజేపీ రాజ్యాంగాన్నే మార్చబోతోందని, బీజేపీ నేతలను ఏ చెప్పుతో కొట్టాలని అంటున్నడు.. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో వంద సార్లకుపైగా రాజ్యాంగాన్ని మార్చిన కాంగ్రెస్ నేతలను ఎన్నిసార్లు చెప్పుతో కొట్టాలి' అని ప్రశ్నించారు. శనివారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, వాసాల రమేశ్‌లతో కలిసి పాల్గొని సంజయ్ మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ సొమ్ముతో కాంగ్రెస్ నేతలు కరీంనగర్‌లో కార్పొరేటర్లను సంతలో పశువుల్లా కొంటున్నారని ఆరోపించారు. ఒక్కో కార్పొరేటర్‌కు రూ.20 లక్షలిచ్చారని, అందులో రూ.5 లక్షలు బ్యాంకు ఖాతాలో జమైనట్టు చర్చ జరుగుతోందన్నారు. తక్షణమే బ్యాంకు లావాదేవీలపై ఎన్నికల కమిషన్ విచారణ చేపట్టడంతోపాటు డబ్బు తీసుకున్న, ఇచ్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 'నేను పక్కా లోకల్. మీరు తయారు చేసిన కార్యకర్తను. మీ కోసం పోరాటాలు చేశా. కరీంనగర్ అభివృద్ధి కోసం రూ.12 వేల కోట్లు తీసుకొచ్చాను. మరి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు మీకోసం ఎన్నడైనా పనిచేశారా? వాళ్లు నాన్ లోకల్. కాంగ్రెస్ పొరపాటున గెలిస్తే రైతులకిచ్చే ఎరువుల సబ్సిడీని ఎత్తేస్తారు' అని అన్నారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయించేవని, కాంగ్రెస్‌కు ప్రధాని అభ్యర్థి కూడా లేదని చెప్పారు. కేసీఆర్ ఎప్పటికీ ప్రధాని కాలేరని, అలాంటి వారికి ఎందుకు ఓటేయాలో ఆలోచించుకోవాలని ప్రజలకు సూచించారు.



### ఆ పదాన్ని కాంగ్రెస్సే తెచ్చింది..

'సెక్యులర్' అనే పదం అంబేడ్కర్ రాజ్యాంగంలో లేదని, కాంగ్రెస్ ఆ పదాన్ని ఎమర్జెన్సీ సమయంలో బలవంతంగా రాజ్యాంగంలోకి తెచ్చిందన్నది వాస్తవం కాదా అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఆ పదాన్ని తీసేస్తే తప్పేంటన్నారు. 'మోదీ బతికున్నంత వరకు రిజర్వేషన్లు కొనసాగుతాయి. ఇకపై రిజర్వేషన్లను రద్దు చేస్తారని ఎవరైనా అంటే చీపురు, చెప్పులతో ఉరికించి కొట్టాలి. రాముడిని, రాముడి అక్షింతలను హేళన చేయడమంటే రాజ్యాంగాన్ని అవమానించడమే.. కేసీఆర్ బలుపెక్కి దేవుడి తీర్థ ప్రసాదాలను, అక్షింతలను అవమానిస్తున్నాడు. తీర్థ ప్రసాదాలతో కడుపు నిండుతదా అని వాగుతున్నాడు.. ఆయనకు ప్రసాదం తింటే కడుపు నిండదేమో.. ఫుల్ బాటిల్ తాగి చికెన్, మటన్ తింటేనే కడుపు నిండుతదేమో' అని ఎద్దేవా చేశారు.

## సీఎం రేవంత్ మాటల్లో పగ, ప్రతీకారం

- సీఎం, మంత్రులది బూతు భాష
- ప్రజలు అసహ్యించుకుంటున్నారు
- హామీలను అమలు చేయకపోవడమే మార్పా?
- మీట్ ద ప్రెస్‌లో బీఆర్‌ఎస్ నేత హరీశ్ రావు

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి, మంత్రులు వాడుతున్న భాష అసభ్యకరంగా ఉందని, సీఎం రేవంత్ రెడ్డి మాటల్లో పగ, ప్రతీకారమే కనిపిస్తున్నాయని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. వాళ్ల భాషను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒక్కటే అమలు చేస్తున్నారని, ఇంకా అయిదు హామీలు అమలు కావడం లేదని, హామీలను అమలు చేయకపోవడమే మార్పా? అని ప్రశ్నించారు. ప్రజల్లో కాంగ్రెస్ పాలనపై అప్పుడే విరక్తి ఏర్పడిందన్నారు. శనివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతులకు పెట్టుబడి సాయం అందేదని, ప్రస్తుతం రైతులకు ఇంకా రైతు భరోసా అందలేదన్నారు. గతంలో 80% ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేవని, కేసీఆర్ కిట్లు అందేవని, ఇప్పుడు అవేమీ లేవని విమర్శించారు. పలు జిల్లాల్లో తాగునీటి సమస్య ఉందని, హైదరాబాద్‌లోనూ నీటి ట్యాంకర్లు కొనుక్కునే పరిస్థితి ఏర్పడిందని, కరెంటు కోతలు పెరిగాయని, ఇలా అన్నీ రంగాల్లోనూ మార్పు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలను నమ్మించి మోసం చేస్తున్న కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు శిక్షిస్తారన్నారు. చెక్‌బౌన్స్ అయితే శిక్ష పడుతుందని, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన బాండ్ పేపర్లు ఇప్పుడు బౌన్స్ అయ్యాయని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ చేపట్టిన పనులకు వ్యతిరేకంగా పోవడమే రేవంత్ పనిగా పెట్టుకున్నారని, ఇప్పుడున్న జిల్లాల్లో మార్పులు చేస్తే ప్రజల నుంచి ఆగ్రహం తప్పదన్నారు.

### పార్టీలు మారితే రాళ్లతో కొట్టాలన్నారు కదా!

ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి మారే వారిని రాళ్లతో కొట్టాలి అన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పుడు తన పార్టీలోకి వస్తున్న వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్నారని, దీనికి ఏం సమాధానం చెబుతారని హరీశ్‌రావు ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్ ఎంపీగా ఎలా పోటీ చేస్తారని నిలదీశారు. కేసీఆర్ బస్సు యాత్ర తరువాత ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందని, ఎక్కువ పార్లమెంట్ స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలుస్తుందని హరీశ్ ధీమా వ్యక్తం చేశారు.

## నేడు అమిత్ షా ప్రచారం

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నుంచి పోటీలో ఉన్న అభ్యర్థుల తరఫున ప్రచారం చేయడానికి తమ పార్టీ అగ్రనేతలు రాష్ట్రంలో పర్యటిస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదిలాబాద్, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలతోపాటు సాయంత్రం మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రచారం చేయనున్నారు. సోమవారం బీజేపీ అధ్యక్షుడు నడ్డా పెద్దపల్లి, భువనగిరి, నల్గొండ పార్లమెంట్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తారు.

## కేంద్ర నిధులపై చర్చకు సిద్ధమా?

- సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ
- 'గాడిదగుడ్డు' ప్రచారంపై అభ్యంతరం

తెలంగాణ ప్రాంతానికి యూపీఏ, ఎన్డీయే హయాంల్లో వచ్చిన నిధులపై చర్చకు సిద్ధమా? అని సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. "గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణకు రూ.9 లక్షల కోట్లు ఇచ్చిందని పునరుద్ఘాటిస్తున్నా. నా వ్యాఖ్యలతో విభేదిస్తే చర్చకు రండి. కొడంగల్‌లో అయినా సరే.. అమరవీరుల స్థూపం వద్ద అయినా సరే... స్థలం, సమయం మీరే నిర్ణయించండి. వాస్తవ లెక్కలతో అర్థవంతమైన చర్చ జరిపేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. దీనికి మీరూ సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. మోదీ హయాంలో తెలంగాణకు ఇచ్చింది "గాడిద గుడ్డు" అంటూ కాంగ్రెస్ ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. యూపీఏ పదేళ్ల పాలనలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రూ.1.32లక్షల కోట్లు ఇస్తే... అందులో తెలంగాణ వాటా రూ.45,000కోట్ల కన్నా మించలేదని పేర్కొన్నారు. కానీ, మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో రూ.9లక్షల కోట్లకు పైగా నిధులు ఇచ్చిందని వెల్లడించారు.

## బీజేపీని అడ్డుకోకుంటే రాజ్యాంగానికి ముప్పు

- రిజర్వేషన్లను కూడా ఆ పార్టీ రద్దు చేస్తుంది
- రేవంత్ సర్కారు ఐదేళ్లూ అధికారంలో ఉంటుంది
- కూల్చేందుకు ప్రయత్నించే వారే పతనమవుతారు: ఒవైసీ



హైదరాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): బీజేపీ మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోని పక్షంలో రాజ్యాంగానికి, రిజర్వేషన్లకు ముప్పు తప్పదని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మోదీ ప్రభుత్వం హిందుత్వమే ఏకైక ఎజెండాగా దేశాన్ని హిందుత్వ దేశంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. శనివారం చార్మినార్ అసెంబ్లీ సెగ్మెంట్ షాలిబండ ప్రాంతంలో ఒవైసీ పాదయాత్రతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ రాజ్యాంగాన్ని విశ్వసించడం లేదని విమర్శించారు. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ అంటూ నినాదాలు చేసే మోదీ ముస్లింలపై విషం చిమ్ముతూ జిహాదీలుగా ముద్ర వేస్తున్నారని విమర్శించారు. మోదీ గ్యారెంటీలంటే రాజ్యాంగాన్ని మార్పు చేయడం, రిజర్వేషన్లను రద్దు చేయడం, మైనారిటీలకు వ్యతిరేకంగా మాట్లాడమేనన్నారు. మోదీ ఈసారి 400 సీట్లు అంటుండడం రాజ్యాంగాన్ని మార్చేయడంతో పాటు రిజర్వేషన్లను రద్దు చేయడానికేనని విమర్శించారు. హైదరాబాద్, తెలంగాణలో ఓట్ల కోసం బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొడుతోందని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి మాధవీలత ఉద్రిక్త వాతావరణం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అయిదేళ్లూ అధికారంలో కొనసాగుతుందని ఒవైసీ పేర్కొన్నారు. రేవంత్ సర్కారును కూల్చడానికి ప్రయత్నించేవారే కూలిపోకతప్పదన్నారు. తాము కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం లేదని స్పష్టం చేస్తూనే ఎవరైనా రేవంత్ సర్కారును అస్థిర పర్చేందుకు ప్రయత్నిస్తే.. రేవంత్‌కు మజ్లిస్ అండగా నిలుస్తుందన్నారు.

# కాంగ్రెస్ నాయకులపై కత్తితో దాడి

- ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు
- పాత కక్షలతో ఎంఐఎం నేత దుర్మార్గం
- హైదరాబాద్‌లో నడిరోడ్డుపై ఘటన



మృతుడు మక్బూల్ | మనోజ్ | అమ్జద్

రాజేంద్రనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ పాతబస్తీలో అలజడి రేగింది. వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఎంఐఎం నాయకుడొకరు.. ఇద్దరు కాంగ్రెస్ నాయకులపై కత్తితో దాడి చేశాడు. దీంతో ఒకరు చనిపోయారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సులేమాన్ నగర్‌లో కాంగ్రెస్ కార్యాలయం ముందు వందలాది మంది కార్యకర్తలు ఉండగానే నిందితుడు ఈ దారుణానికి తెగబడ్డాడు. సులేమాన్ నగర్ డివిజన్ ఇంద్రానగర్ చౌరస్తాలో కాంగ్రెస్ కార్యాలయం ఉంది. చేవెళ్ల పార్లమెంటు పరిధిలోకి వచ్చే రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్లలో శనివారం రాత్రి చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి రోడ్ షో ఉంది. ఈ సందర్భంగా ఇంద్రానగర్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మక్బూల్(55), ఎన్టీఆర్ నగర్ నివాసి మనోజ్ కుమార్(45) కాంగ్రెస్ కార్యాలయం ముందు జెండాలు కట్టి, కార్యకర్తలను పోగుచేసి, రంజిత్ రెడ్డి రాక కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో అకస్మాత్తుగా అక్కడికి వచ్చిన మజ్లిస్ పార్టీ నాయకుడు అమ్జద్.. మక్బూల్, మనోజ్‌లపై కత్తితో దాడి చేశాడు. దీంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కడుపులో కత్తిపోట్లతో మక్బూల్‌కు తీవ్ర రక్తస్రావం జరిగిందని స్థానికులు తెలిపారు. దాడి జరుగుతున్న సమయంలో అక్కడే ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు భయంతో పరుగులు పెట్టారు. దాడి అనంతరం అమ్జద్ పరారయ్యాడు. కత్తిపోట్లకు గురైన ఇద్దరిని చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మక్బూల్ మృతి చెందాడని, నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. మజ్లిస్ నేతఅమ్జద్‌కు కాంగ్రెస్ నేతలు మక్బూల్, మనోజ్‌కుమార్ మధ్య పాత కక్షలున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ వారు గొడవ పడ్డారని అంటున్నారు. అది మనసులో పెట్టుకుని అమ్జద్ వారిపై దాడి చేసి ఉంటారని భావిస్తున్నారు. ఇంద్రానగర్ ప్రాంతానికి చెందిన రౌడీ షీటర్, కాంగ్రెస్ నేత హాజీకి మక్బూల్, మనోజ్‌కుమార్ మొదటి నుంచి అనుచరులుగా ఉన్నారు. హాజీ పదేళ్ల క్రితం హత్యకు గురయ్యాడు. అప్పటి నుంచి వీరిద్దరూ రాజకీయాలకు దూరంగా ఉంటూ తమ తమ పనులు చేసుకుంటున్నారు. ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

# 4 రోజుల్లో రూ.2 వేల కోట్లు!

- రైతుబంధు పథకంలో మిగిలిన 39 లక్షల ఎకరాలకూ చెల్లింపు

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): రైతుబంధు పథకంలో మిగిలిపోయిన లబ్ధిదారులకు నగదు బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. గత వానాకాలం సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 68.99 లక్షల మంది రైతులకు రైతుబంధు నిధులు పంపిణీ చేశారు. ఈ యాసంగి సీజన్‌కు వచ్చేసరికి ఇప్పటివరకు 64,75,319 మంది రైతులకు రైతుబంధు నగదు బదిలీ పూర్తిచేశారు. మొత్తం కోటిన్నర ఎకరాల విస్తీర్ణానికి రైతుబంధు చెల్లించాల్సి ఉండగా... ఇప్పటివరకు 111.50 లక్షల ఎకరాల వరకు ఎకరానికి రూ.5 వేల చొప్పున పంపిణీ పూర్తి చేశారు. రూ. 5574.77 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా 39 లక్షల ఎకరాలకు రైతుబంధు నిధులు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సుమారు రూ. 2 వేల కోట్ల నిధులు అవసరమవుతాయి. ఈ నిధులను సర్దుబాటు చేసి ఈ నెల 8వ తేదీలోపు పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించారు. అయితే రైతుబంధు నగదు బదిలీ మొదలుపెట్టినప్పటి నుంచి పరిశీలిస్తే కొంత జాప్యం జరిగింది. పూర్తిస్థాయిలో నిధులు సర్దుబాటు కాలేదు. దీంతో కొద్దిరోజులుగా రైతులకు చెల్లింపులు నిలిపివేశారు. రైతుబంధు అందాల్సిన రైతులు సుమారు 4 - 5 లక్షల మంది వరకు ఉన్నారు. వీరికి కూడా నగదు బదిలీ పూర్తిచేస్తే ఈ యాసంగి బకాయిలు క్లియర్ అయిపోతాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల కొరత ఉండటంతో అప్పులు తీసుకుంటోంది. శనివారం మరో రూ.3 వేల కోట్ల కోసం ఆర్బీఐకి ఇండెంట్ పెట్టింది. ఈ నిధులు 7న ప్రభుత్వ ఖాతాలోకి వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు ఖజానాలో ఉన్న కొన్ని నిధులను సర్దుబాటుచేసి, ఆ తర్వాత అప్పు మంజూరు కాగానే మొత్తానికి మొత్తం చెల్లింపులు పూర్తి చేయాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉండటం గమనార్హం. సామాజిక పెన్షన్ల విషయానికొస్తే శనివారం సగం మంది లబ్ధిదారుల ఖాతాల్లో పెన్షన్ సొమ్ము జమ చేశారు. మిగతా సగం మందికి ఆదివారం జమ చేయనున్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగుల వేతన చెల్లింపులపై దృష్టి పెట్టింది. గతంలో వేతనాలు పొందటానికి వారం రోజులు, పక్షం రోజులు ఎదురు చూసే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు అంతా కలిపి 1న చెల్లిస్తున్నారు. ఆ తర్వాత 6 గ్యారెంటీలపై ఫోకస్ పెట్టారు. ఉచిత బస్సు ప్రయాణం, వంటగ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు సబ్సిడీ నిధులు సర్దుబాటు చేయాల్సి వస్తోంది. ఈక్రమంలోనే రైతుబంధు చెల్లింపులు కాస్త జాప్యమయ్యాయి. ఇప్పుడు పూర్తిగా చెల్లించాలని నిర్ణయించారు. రైతుబంధు పథకం అమలుకు ఎన్నికల కమిషన్ నుంచి కూడా ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం ఉండదు. 'ఆన్‌గోయింగ్ స్కీమ్' కావటంతో ఆంక్షలు ఉండవు. అందుకే నిధులు సర్దుబాటు చేసి రైతుబంధు పథకం అమలును పూర్తిచేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉండటం గమనార్హం.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

# వదల బొమ్మాళి.. వదలా



కొన్ని పాత్రలు కొంతమంది తారల కోసమే పుట్టాయా అనిపిస్తుంటుంది. అలాగే 'అరుంధతి' చిత్రంలో జేజమ్మ పాత్ర మాత్రం అనుష్క కోసమే పుట్టింది. ఈ సినిమాతో మరో రెండు మూడేళ్ల వరకూ తీరిక లేనంతగా బిజీ అయ్యారు అనుష్క. 'అరుంధతి' చిత్రంలో జేజమ్మ పాత్ర కోసం చాలా మంది హీరోయిన్ల పేర్లు అనుకున్నారు. కొంతమందిని సంప్రదించారు కూడా. అయితే ఐదు అడుగుల పది అంగుళాల ఎత్తు కలిగి, రాయల్ లుక్ కలిగిన నటి కావాలి కనుక నిర్మాత శ్యామ్‌ప్రసాదరెడ్డి ఆ విషయంలో రాజీ పడలేదు. చివరకు 'జెమినీ' కిరణ్ సూచనపై అనుష్క నటించిన 'సూపర్' చిత్రం చూసి ఆమెను పిలిపించారు. రకరకాలుగా ఆడిషన్స్ చేసి చివరకు ఆమెను ఫైనలైజ్ చేశారు.

దర్శకుడి మార్పు

'అరుంధతి' చిత్రానికి మొదట తమిళ దర్శకుడు సభాపతిని ఎంపిక చేశారు శ్యామ్. మెగాస్టార్ చిరంజీవితో ఆయన నిర్మించిన 'అంజి' చిత్రానికి కూడా మొదట్లో కొన్ని రోజులు పని చేశారు సభాపతి. ఆ తర్వాత ఆయన స్థానంలోకి కోడి రామకృష్ణ వచ్చారు. అలాగే 'అరుంధతి' సినిమాలోని పతాక సన్నివేశాల చిత్రీకరించమని సభాపతికి చెప్పారు శ్యామ్. అనుష్కతో షూటింగ్ చేసి, ఆ వర్క్ ఎడిట్ చేసి శ్యామ్‌ప్రసాదరెడ్డికి చూపించారు సభాపతి. అది ఆయనకు నచ్చలేదు. మరోసారి తీయమని చెప్పారు. సభాపతి రెండో సారి కూడా తీసిన సన్నివేశాలు నచ్చకపోవడంతో ఆయన్ని తొలగించి కోడి రామకృష్ణకు దర్శకత్వ బాధ్యతలు అప్పగించారు.



**డ్రమ్ సాంగ్ కోసం 45 రోజులు**


అప్పట్లో ఒక చిన్న సినిమాను 45 నుంచి 50 రోజుల్లో పూర్తి చేసేవారు. కానీ 'అరుంధతి' చిత్రంలో అనుష్క పాల్గొన్న డ్రమ్ సాంగ్ చిత్రీకరణ కోసం 45 రోజులు పట్టడం విశేషం. పర్‌ఫెక్షన్ కోసం నిర్మాత శ్యామ్‌ప్రసాద్ రెడ్డి ఎంతగా తపిస్తారో అని చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే. 210 రోజులు షూటింగ్ చేసిన తర్వాత అరుంధతి చిత్రం రషెస్ చూశారు శ్యామ్‌ప్రసాద్ రెడ్డి. అందులో చాలా సన్నివేశాలు ఆయనకు నచ్చలేదు. అందుకే మరో 40 రోజుల పాటు రీ షూట్ చేసి మొదట తీసిన సన్నివేశాలకు బెటర్‌మెంట్ తెచ్చారు. రూ.3 కోట్ల బడ్జెట్ అనుకుని ప్రారంభించిన ఈ సినిమా పూర్తయ్యేసరికి రూ 13 కోట్లు అయింది. 2009 సంక్రాంతికి విడుదలైన 'అరుంధతి' చిత్రం ఘన విజయం సాధించడమే కాకుండా రూ 70 కోట్లు వసూలు చేసింది.

'వదల బొమ్మాళి.. నిన్ను వదలా' అంటూ 'అరుంధతి' చిత్రంలో పశుపతి చెప్పిన డైలాగ్ గుర్తుంది కదూ. తన గెటప్‌తో, అభినయంతో అదరగొట్టేసి పశుపతి పాత్రతో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు సోనూ సూద్. పశుపతి వేషం ఆయనకు దక్కడం వెనుక ఆసక్తికరమైన కథ ఉంది. అదేమిటంటే.. పశుపతి పాత్రకు మొదట తమిళ నటుడు పశుపతిని అనుకున్నారు నిర్మాత శ్యామ్ ప్రసాద్‌రెడ్డి. ఆ పాత్రకు ఆ పేరు పెట్టడానికి కారణం పశుపతిని పిలిపించి గెటప్ వేసి స్టిల్స్ తీశారు. చిత్రంలో అఘోరా పాత్రకు ఆయన చక్కగా సూట్ అయ్యారు కానీ రాజుగా కనిపించే సన్నివేశాల కోసం గెటప్ వేసినప్పుడు పశుపతి తేలిపోయారు. దాంతో ఆలోచనలో పడ్డారు శ్యామ్‌ప్రసాద్ రెడ్డి. ఆ పాత్రకు ఎవరా అని ఆలోచిస్తున్న తరుణంలో జూనియర్ ఎన్టీఆర్ నటించిన

## 20 రోజులు.. రూ 43 లక్షలు

'అశోక్' చిత్రం విడుదల అయింది. అందులో విలన్‌గా నటించిన సోనూ సూద్ శ్యామ్ దృష్టిని ఆకర్షించారు. వెంటనే ఆయన ఫోన్ నంబర్ తీసుకుని, మాట్లాడి ముంబై నుంచి హైదరాబాద్‌కు పిలిపించారు. పశుపతి పాత్ర కోసం వేసిన గెటప్ స్కెచ్ చూడగానే ఆ పాత్ర తను చెయ్యనని చెప్పేశారు సోనూ సూద్. ఒకసారి గెటప్ వేసి మేకప్ టెస్ట్ చేద్దామనీ, అప్పుడు కూడా నచ్చకపోతే వేరే నటుడిని తీసుకుంటానని శ్యామ్ చెప్పారు. సరేనన్నారు సోనూ సూద్. 'దశావతారం' చిత్రానికి కమల్ హాసన్‌కు మేకప్ చేసిన రమేశ్‌ను పిలిపించి ఆయనతో సోనూ సూద్‌కు అఘోరా గెటప్ వేయించారు. కేవలం మేకప్‌కే ఆరు గంటలు పట్టింది. ఆ పాత్ర చేయడం తనకు ఇష్టం లేకపోయినా నిర్మాతగా శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తపన చూసి చివరకు అంగీకరించారు సోనూ సూద్. '20 రోజుల్లో మీ వర్క్ పూర్తి చేస్తా. పారితోషికం ఎంత కావాలి' అని శ్యామ్ అడిగితే రూ. 18 లక్షలు ఇవ్వమన్నారు సోనూ సూద్. 'అలా కాకుండా మీరు రూ.20 లక్షలు ఇస్తే ఎన్ని రోజులైన పని చేస్తా' అని ఇంకో ఆప్షన్ కూడా ఇచ్చారు. అయితే శ్యామ్‌ప్రసాదరెడ్డి అలా అంగీకరించకుండా 'మీరు కోరినట్లు 20 రోజులకి రూ. 18 లక్షలు ఇస్తా. ఆ తర్వాత ఎన్ని రోజులు ఎక్కువ వర్క్ చేసినా రోజుకి రూ.25 వేలు చొప్పున ఇస్తా' అన్నారు. ఓకే అన్నారు సోనూ సూద్. ఫైనల్‌గా ఆయనకు ఇచ్చిన పారితోషికం ఎంతో తెలుసా.. రూ.43 లక్షలు.


# అలసిపోయానబ్బా.. విశ్రాంతి తీసుకుంటున్నా



ఒకే ఏడాదిలో వరుసగా 'పఠాన్', 'జవాన్', 'డంకీ' చిత్రాలతో మూడు హిట్లు ఇచ్చి బాక్సాఫీసుని షేక్ చేసిన షారుఖ్‌ఖాన్ ఇప్పుడు రెస్ట్ మోడ్‌లో ఉన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆయన కొత్త చిత్రం ఏదీ ఒప్పుకోకుండా హాలీడేస్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. 'ఒకటి కాదు రెండు కాదు.. వరుసగా మూడు చిత్రాలు ఒకే సంవత్సరంలో చేయాల్సి రావడంతో బాగా శారీరకంగా, మానసికంగా అలసిపోయానబ్బా. అందుకే ప్రస్తుతం రెస్ట్ తీసుకుంటున్నా. క్రికెట్ మ్యాచ్‌లు చూస్తూ ఎంజాయ్ చేస్తున్నా. నా కొత్త సినిమా షూటింగ్ జులైలో కానీ ఆగస్టులో కానీ ప్రారంభం కావచ్చు. జూన్‌కల్లా నేను ఫ్రీ అయిపోతాను కానీ ఆ సినిమా షూటింగ్ జూన్‌లో కూడా ప్రారంభం కావచ్చు.' అన్నారు. కొత్త సినిమా వివరాలు ఆయన చెప్పలేదు కానీ సుజయ్ ఘోష్ ఆ సినిమాకు దర్శకత్వం వహిస్తారనేది ఓ టాక్. అలాగే 'జవాన్' దర్శకుడు అట్లీ కూడా షారుఖ్ కోసం ఓ కథ సిద్ధం చేశారు. వీటిల్లో ఏది మొదలువుతుందనే విషయంలో త్వరలో క్లారిటీ వస్తుంది.

# చిన్న సినిమాదే సందడి

**ఈ ఏడాది వేసవి టాలీవుడ్‌కు నిరాశనే మిగిల్చింది. ఎన్నికలు, ఐపీఎల్, ఎండలు... ఇలా కారణాలు ఏవైనా ఒక మంచి సీజన్ చేజారింది. ఏటా వేసవి బరిలో పోటీపడే పెద్ద సినిమాలు ఈ సారి బరి నుంచి వెనక్కు తగ్గాయి. దీంతో కొన్ని చిన్న, మిడ్ రేంజ్ సినిమాలు మాత్రం మేలో ప్రేక్షకులకు వినోదం పంచేందుకు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. వారానికో అరడజను సినిమాలు చొప్పున విడుదలకు సిద్ధమయ్యాయి.**











### సక్సెస్ కోసం సత్యదేవ్




రెండో వారంలోనూ చిన్న సినిమాలు బాక్సాఫీసు దగ్గర సందడి చేసేందుకు సిద్ధమయ్యాయి. సరైన హిట్ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న సత్యదేవ్ ఈసారి 'కృష్ణమ్మ' అనే చిత్రంతో మరో ప్రయత్నం చేస్తున్నారు. ఈ నెల 10న ఈ చిత్రం విడుదలవుతోంది. ఇందులో ఆయన మాస్ అవతార్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి వి.వి గోపాలకృష్ణ దర్శకుడు. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు.

హిందుత్వ సిద్ధాంతాలతో ప్రేరేపితమైన చారిత్రక ఘట్టాలు, సంఘటనల ఆధారంగా ఇప్పుడు బాలీవుడ్‌లో తామర తంపరగా సినిమాలు వస్తున్నాయి. ఈ తరహా కథాంశంతో వచ్చిన 'రజాకార్' చిత్రంతో టాలీవుడ్ కూడా ఓ మంచి సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకొంది. ఈ కోవలోనే హిందుత్వం, దేశభక్తి, వామపక్ష రాజకీయాలు, నక్సలిజం లాంటి అంశాలను స్పృశిస్తూ తెరకెక్కిన తాజా చిత్రం 'జితేందర్ రెడ్డి'. పూర్తిగా కొత్త తారాగణంతో తెరకెక్కినా, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచడంలో చిత్రబృందం విజయం సాధించింది. అయితే ఈ పాజిటివ్ టాక్ బాక్సాఫీసు దగ్గర ఎంతవరకూ ఫలిస్తుంది అనేది తెలియాలంటే వేచిచూడాలి. ఈ సినిమా పదో తేదీన విడుదలవుతోంది.

వీటితో పాటు 'ఆరంభం', 'బ్రహ్మచారి' చిత్రాలు రిలీజ్ అవనున్నాయి. వీటితో పాటు ఓ హిందీ చిత్రం సైతం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. దృష్టిలోపం ఉన్నప్పటికీ పారిశ్రామిక వేత్తగా స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని కొనసాగించారు శ్రీకాంత్ బొల్లా. ఆయన జీవితం ఆధారంగా రూపుదిద్దుకున్న బాలీవుడ్ చిత్రం 'శ్రీకాంత్'. రాజ్‌కుమార్ రావు టైటిల్ రోల్ పోషించారు. ఈ నెల 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. జ్యోతిక, అలయ ఎఫ్, శరద్ కేల్కర్ కీలకపాత్రలు పోషించారు.

### ముచ్చటగా మూడు సినిమాలు

మూడోవారంలో సందడంతా హీరో విష్వక్‌సేన్‌దే అనే చెప్పాలి. ఇటీవలే 'గామి' చిత్రంతో సక్సెస్‌ను ఖాతాలో వేసుకున్నారు. ఆయన హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. ఈ నెల 17న విడుదలవుతోంది. కృష్ణ చైతన్య దర్శకుడు. నేహాశెట్టి కథానాయిక. ఇక కాజల్ అగర్వాల్ లీడ్‌రోల్‌లో నటించిన 'సత్యభామ' చిత్రం కూడా 17న విడుదలవుతోంది. ఇందులో కాజల్ పోలీసాఫీసర్‌గా సీరియస్ రోల్‌లో కనిపించనున్నారు. నవీన్‌చంద్ర, ప్రకాశ్‌రాజ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సుమన్ చిక్కాల దర్శకుడు. వీటితో పాటు గెటప్ శ్రీను కథానాయకుడిగా నటించిన తొలి చిత్రం 'రాజు యాదవ్' కూడా 17న ప్రేక్షకుల ముందుకొస్తోంది.





### సోలోగా

దెయ్యానికి బాయ్‌ఫ్రెండ్ ఉంటే ఏం జరుగుతుందనే ఉత్కంఠభరిత కథాంశంతో వస్తున్న చిత్రం 'లవ్ మీ'. ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా నటించారు. అరుణ్ భీమవరం దర్శకుడు. దిల్ రాజు ప్రొడక్షన్స్ బేనర్‌పై హర్షిత్‌రెడ్డి, హన్షిత, నాగమల్లిడి నిర్మిస్తున్నారు. ఈనెల 25న ఈ చిత్రం విడుదలవుతోంది.

### చివర్లో సుధీర్‌బాబు

ఈ నెల చివరివారంలో సుధీర్‌బాబు 'హరోం హర' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ యాక్షన్ ఎంటర్టైనర్‌కు జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహిస్తున్నాడు. మాళవికా శర్మ కథానాయిక. సునీల్ కీలకపాత్ర పోషించారు. సుమంత్ జి. నాయుడు నిర్మాత. 1989లో చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఈనెల 31న విడుదల చేస్తున్నారు. ఇక అదే తేదీన ఆనంద్ దేవరకొండ నటించిన 'గం గం గణేశా' చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ కామెడీ ఎంటర్టైనర్‌లో ప్రగతి శ్రీ వాస్తవ కథానాయిక. 'బేబీ' లాంటి హిట్ చిత్రం తర్వాత ఆనంద్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.




### తొలివారం అంతంతమాత్రం

మే నెల్లో తొలి శుక్రవారం అరడజనుకుపైగా చిత్రాలు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. ఇవన్నీ చిన్న చిత్రాలే. తొలి శుక్రవారం సుహాస్ కథానాయకుడిగా నటించిన 'ప్రసన్న వదనం', అల్లరి నరేశ్ హీరోగా నటించిన 'ఆ ఒక్కటి అడక్కు' చిత్రాలు బాక్సాఫీసులో రేసులో నిలవగా, వరలక్ష్మీ శరత్ కుమార్ నటించిన హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ 'శబరి' పూర్తిగా నిరాశపరిచింది. డబ్బింగ్ చిత్రం 'బాక్' విడుదలకు ముందు ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగించడంలో సఫలమైంది. అయితే కథ పేలవంగా ఉండడంతో ప్రేక్షకాదరణ కరువైంది. తమన్నా, రాశీఖన్నా లాంటి టాప్ హీరోయిన్లు నటించినా ఈ హారర్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. 'ది ఇండియన్ స్టోరీ', చిత్రానిది సైతం అదే పరిస్థితి. ప్రభుదేవా నటించిన 'ప్రేమికుడు' చిత్రం కూడా ఈ వారంలోనే రీ రిలీజ్ అయింది.

### ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు









| ఓటీటీ వేదిక | సినిమా/సిరీస్ | విడుదల తేదీ |
|---|---|---|
| **నెట్‌ఫ్లిక్స్** | | |
| బోడ్కిన్ | వెబ్‌సిరీస్ | మే 09 |
| మదర్ ఆఫ్ ది బ్రైడ్ | హాలీవుడ్ మూవీ | మే 09 |
| థాంక్యూ నెక్ట్స్ | వెబ్‌సిరీస్ | మే 09 |
| **అమెజాన్ ప్రైమ్** | | |
| ఆవేశం | మలయాళ చిత్రం | మే 09 |
| ది గోట్ | వెబ్‌సిరీస్ | మే 09 |
| యోధ | హిందీ చిత్రం | మే 10 |
| **జీ 5** | | |
| 8 ఏ.ఎం. మెట్రో | హిందీ చిత్రం | మే 10 |
| **డిస్నీ ప్లస్ హాట్‌స్టార్** | | |
| మంజుమ్మల్ బాయ్స్ | మలయాళ చిత్రం | మే 05 |
| ఆల్ ఆఫ్ అజ్ స్ట్రేంజర్స్ | హాలీవుడ్ మూవీ | మే 08 |
| **సోనీ లివ్** | | |
| అన్ దేఖీ 3 | హిందీ సిరీస్ | మే 10 |
| **లయన్స్ గేట్ ప్లే** | | |
| ది మార్ష్ కింగ్స్ డాటర్ | హాలీవుడ్ మూవీ | మే 10 |
| **ఆపిల్ టీవీ ప్లస్** | | |
| డార్క్ మేటర్ | వెబ్‌సిరీస్ | మే 08 |
| హాలీవుడ్ కాన్ క్వీన్ | వెబ్‌సిరీస్ | మే 08 |
| మాక్స్‌టన్ హాల్ | వెబ్‌సిరీస్ | మే 09 |



## రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదు

'ఠాగూర్', 'మాస్', 'మన్మథ' 'షాక్' వంటి ఎన్నో తెలుగు చిత్రాల్లో నటించారు జ్యోతిక. ఓ పక్క తమిళంలోనూ వరుస అవకాశాలతో అగ్ర కథానాయికగా కొనసాగే టైంలోనే నటుడు సూర్యను పెళ్లి చేసుకుని సినిమాలకు విరామమిచ్చారు. రీ ఎంట్రీలో కొన్ని సెలక్టెడ్ సినిమాల్లో నటించిన ఆమె ఈ నెల 10న విడుదలవుతోన్న బాలీవుడ్ చిత్రం 'శ్రీకాంత్'లో ఓ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో మాట్లాడిన ఆమె..పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "నన్ను చాలా మంది రాజకీయాల్లోకి ఆహ్వానించారని, నేను త్వరలోనే రాజకీయాల్లోకి రానున్నానని అందరూ అనుకుంటున్నారు. కానీ అందులో వాస్తవం లేదు. రాజకీయాల్లోకి రమ్మని నన్నెవరూ సంప్రదించలేదు. అయినా రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదు. నేను సూర్య కలసి మళ్లీ ఎప్పుడు నటిస్తామని అందరూ అడుగుతున్నారు. సూర్యతో కలసి నటించాలని నాకూ ఉంది. అందుకు తగ్గ కథ దొరికితే నటించడానికి ఇద్దరం సిద్ధమే" అని చెప్పారు.

## కరీనా కపూర్‌కు అరుదైన గౌరవం




బాలీవుడ్ నటి కరీనా కపూర్ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. ఐక్యరాజ్య సమితిలో కీలక భాగమైన స్వచ్ఛంద సేవా సంస్థ యూనిసెఫ్(యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్)కు భారత ప్రతినిధిగా ఆమె శనివారం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కరీనా మాట్లాడుతూ "భావి తరాలకు పునాది లాంటి బాలల హక్కుల సంరక్షణ అనేది చాలా ముఖ్యమైన విషయం. ఈ అవకాశం దక్కడం ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. నా శక్తివంచన లేకుండా పని చేసి వారి బాల్యానికి, విద్యాభ్యాసానికి, సమానత్వానికి ఉపయోగపడేలా మరింత కృషి చేస్తా" అని అన్నారు. కాగా, 2014 నుంచి ఈ సంస్థతో కలసి కరీనా అనాధ బాలల అభివృద్ధి కోసం, వారి హక్కుల పరిరక్షణకు కరీనా పాటుపడుతున్నారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● ఆదివారం 5 మే 2024

ఒక ఇంటి ఇరుగు పొరుగు సఖ్యంగా, సహకారంగా ఉంటే ఆ ఇంట్లోని వారి జీవనం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఒక దేశ సరిహద్దు దేశాల విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. భారతదేశం తనవంతు ప్రయత్నంగా 'నైబర్స్ ఫస్ట్' పాలసీతో ఇరుగు పొరుగు దేశాలకు స్నేహ హస్తాన్ని అందిస్తోంది. 2014లో మాల్దీవుల్లో మంచినీటి కొరత వచ్చినప్పుడు, 2015లో నేపాల్ భూకంప సమయంలో, 2022లో శ్రీలంకలో నిత్యావసర వస్తువులకు, చమురుకు తీవ్ర కొరత ఎదురైనప్పుడు సహాయాన్ని అందించడంలో భారత్ అగ్రభాగాన నిలిచింది.

# భారత్ - చైనా సంబంధాలు

## కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



భారత్‌తో దీర్ఘకాలిక వైరం నెరపుతున్న పాకిస్థాన్, చైనా మినహా మిగతా సరిహద్దు దేశాలన్నీ మనదేశంతో సఖ్యతగానే ఉంటూ వస్తున్నాయి. చిన్న చిన్న వివాదాలున్నప్పటికీ సానుకూల వాతావరణమే భారత్ చుట్టుపక్కల నెలకొంది.

- అయితే, గత దశాబ్ద కాలంగా చైనా చాప కింద నీరులా భారత్ సరిహద్దు దేశాలన్నిటి ఆర్థికవ్యవస్థల్లోకి చొచ్చుకొని వెళ్లి ఒక ప్రణాళికాబద్ధ వ్యూహాన్ని అమలు చేస్తోంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని నెలకొల్పడం చైనా ప్రధాన ధ్యేయం. ప్రపంచ వాణిజ్యాన్ని శాసించడంతో పాటు వ్యూహాత్మక సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకోవడం ఇందులో ఒక భాగం. కాగా, తనకు పోటీగా ఎదుగుతోన్న మనదేశాన్ని నిలువరించి హిందూ మహాసముద్రంపై భారత్‌కు ఉన్న భౌగోళిక సాధికారతకు చెక్ పెట్టడం మరో ధ్యేయంగా చెప్పుకోవచ్చు.
- ప్రపంచ వాణిజ్యంలో సుదూర ప్రాంతాలకు భారీ ఎత్తున సరుకు రవాణా చేయాలంటే సముద్ర మార్గమే చౌకైనది. దాదాపు 70 శాతం ప్రపంచ కంటైనర్ ట్రాఫిక్ 4/5వ వంతు ప్రపంచ చమురు, గ్యాస్, వాణిజ్య నౌకలు హిందూ మహాసముద్రం నుంచే ప్రయాణిస్తాయి. ప్రపంచ ఆహార, శక్తివనరులు, ఖనిజాల రవాణా పరంగా హిందూ మహాసముద్రం ఆయువుపట్టు వంటిది.
- గత దశాబ్ది కాలంగా భారత్ పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, మయన్మార్, పాకిస్థాన్, నేపాల్, శ్రీలంక, మాల్దీవ్స్‌లో చైనా 150 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టింది. పాకిస్థాన్, మయన్మార్ దేశాలు ఉగ్రవాదం, మానవ హక్కుల ఉల్లంఘనల దృష్ట్యా అంతర్జాతీయ వెలివేతను ఎదుర్కొంటున్నాయి. భారత్, జపాన్, సింగపూర్ వంటి దేశాలు మయన్మార్‌కు ఆర్థిక సహాయం చేయడం, అక్కడ పెట్టుబడులు పెట్టడం వంటి చర్యలను నిలిపి వేశాయి. అయితే ఇదే అదనుగా చైనా ముందుకు వచ్చి... అక్కడి మిలిటరీ జుంటా ప్రభుత్వంతో సఖ్యత పెంచుకుంది. ఆయుధ సరఫరా, మౌలిక సదుపాయాలు, శక్తిరంగంలో ఉదారంగా పెట్టుబడులు కుమ్మరించింది. మయన్మార్‌లో 2021లో జరిగిన మిలిటరీ తిరుగుబాటు, తదనంతర మానవ హక్కుల ఉల్లంఘనల నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల విభాగమైన యునైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్(యూఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ తీర్మానంపై సంతకం చేయకుండా తన వీటో అధికారాన్ని ఉపయోగించి అడ్డుకోవడం ద్వారా చైనా మయన్మార్ మిలిటరీ ప్రభుత్వానికి మరింత దగ్గరైంది. దీంతో బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో భాగంగా చేపట్టిన ఒకానొక ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టు చైనా-మయన్మార్ ఎకనామిక్ కారిడార్(సీఎంఈసీ) పనుల్లో వేగం పెరిగింది. ఈ కారిడార్ అనేక మౌలిక సదుపాయాల నిర్మాణానికి సంబంధించిన అనుసంధానతలను కలిగి ఉంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆయిల్, గ్యాస్ పైప్‌లైన్లు, ఆర్థిక నడవాలు, రైల్వేలైన్లు, ఇండస్ట్రియల్ పార్కులు వంటి అనేకం చైనా ఆధీనంలో అభివృద్ధి చెందుతు న్నాయి. వీటి ద్వారా చైనా భారీఎత్తున ఆర్థిక ప్రయోజనాలు పొందనుంది. ఫలితంగా సీఎంఈసీ ఏర్పరిచే సముద్ర అనుసంధానత చైనాకు హిందూ మహాసముద్రానికి మధ్య రాచద్వారాలు తెరుస్తుంది. సీఎంఈసీ ద్వారా మయన్మార్, క్యాక్‌ఫ్యూ పోర్టు నుంచి నేరుగా బంగాళాఖాత సముద్ర మార్గాన్ని మలక్క జలసంధితో ప్రమేయం లేకుండానే చైనా వినియోగించుకోగలదు. తద్వారా చైనాకు దక్షిణాసియా, తూర్పుఆఫ్రికా, పశ్చిమాసియా, యూరప్ మార్కెట్లు మరింత దగ్గరగా అందుబాటులోకి వస్తాయి. అయితే బంగాళాఖాత ప్రాంతంలో చైనా ఉనికి, అండమాన్ నికోబార్ దీవులకు అత్యంత సమీపంగా చొచ్చుకొనిరావడం మాత్రం భారత భద్రత దృష్ట్యా ప్రమాదకరం కానుంది.
- ఇక భారత్‌తో నిత్యం కయ్యానికి కాలుదువ్వే పాకిస్థాన్‌కు చైనా ఎప్పుడూ కొమ్ముకాస్తూనే ఉంటుంది. ఉగ్రవాద ప్రోత్సాహాన్ని నిరసిస్తూ పాకిస్థాన్‌కు చిరకాలంగా చేస్తోన్న ఆర్థిక సహాయాన్ని అమెరికా నిలిపివేయడంతో చైనా ఆ అవకాశాన్ని అందిపుచ్చు కుంది. పాక్ మౌలిక రంగాల్లో భారీఎత్తున పెట్టుబడులు పెట్టడం ఆరంభించింది. న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌ల నిర్మాణంలో, ఆయుధాల సరఫరాలో భారీగా పాక్‌కు సహకరించడంతోపాటు బీఆర్‌ఐలో భాగంగా చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌ను పాక్ ఆక్రమిత భారత్ ప్రాంతమైన గిల్గిత్-బాల్టిస్థాన్ ప్రాంతం మీదుగా(కారాకోరం హైవే నిర్మాణం) చేపట్టింది. భారత్ సరిహద్దులకు అతి సమీపంలో ఉన్న ఈ కారిడార్‌లో చైనా అనేక మౌలిక సదుపాయాల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనుంది. రోడ్, రైల్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పవర్ ప్రాజెక్టులు దీనిలో అంతర్భాగంగా ఉంటాయి. సీ అండ్ లాండ్ బేస్డ్ కారిడార్ అయిన ఈ ప్రాజెక్టులో పాకిస్థాన్‌కు చెందిన రెండు నౌకాశ్రయాలైన కరాచీ, గ్వాదర్ పోర్ట్‌లు చైనాకు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాజెక్టు వల్ల భారీస్థాయిలో పాకిస్థాన్‌కు రుణాలు లభించినప్పటికీ ప్రయోజనం మాత్రం చైనాకే ఎక్కువగా చేకూరనుంది. కరాచీ పోర్ట్ ద్వారా చైనాకు అరేబియా సముద్రం అందుబాటులోకి వచ్చింది. అదేవిధంగా గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతం గ్వాదర్ పోర్ట్ ద్వారా చైనాకు అందివస్తోంది. ఈ రెండు పోర్టులు మలక్క జలసంధితో ప్రమేయం లేకుండా హిందూ మహాసముద్రాన్ని అతి తక్కువ దూరంతో చైనా చేరుకోవచ్చు. అదేవిధంగా యూరప్, మధ్యప్రాశ్చ్య ఆఫ్రికా ప్రాంతాలను త్వరగా చేరుకోవచ్చు. అయితే సుమారు మూడువేల కిలోమీటర్ల పొడవునా భారత్ సరిహద్దులకు సమీపంలో చైనా స్థావరాలు ఉన్నాయి. అదేవిధంగా అరేబియా సముద్రంలోనూ భారత్‌కు అత్యంత సమీపంగా చైనా నౌకా స్థావరాలూ ఉండటం ఆందోళన కలిగించే అంశమే. అంతేకాక గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతం నుంచి ప్రపంచ క్రూడ్ ఆయిల్ సరఫరాలో 1/4వ వంతు రవాణా అవుతుంది. భారత్‌కు చెందిన 65 శాతం చమురు దిగుమతులు ఈ ప్రాంతం నుంచే సరఫరా అవుతాయి. అలాంటి కీలక ప్రాంతంలో మరీ ముఖ్యంగా గ్వాదర్ పోర్ట్ చైనా ఆధీనంలో ఉండబోవడం వ్యూహాత్మకంగా కూడా పెను సవాళ్లను విసరడమే అవుతుంది.
- ఇక బీఆర్‌ఐ కింద చేపడుతోన్న ఆరు అతి ముఖ్యమైన ఎకనామిక్ కారిడార్లలో బంగ్లాదేశ్‌లో చైనా నిర్మిస్తున్న కారిడార్ అతి ముఖ్యమైనది. ఈ కారిడార్ ద్వారా చైనా 'స్ట్రింగ్ ఆఫ్ పెర్ల్స్' పాలసీ (హిందూ మహా సముద్రం చుట్టూ వ్యూహాత్మక ప్రాంతాల్లో చైనా తన సొంత లేదా నిధులు సమకూర్చి తన ఆధీనంలోకి తెచ్చుకున్న పోర్టులతో నెట్‌వర్క్ ఏర్పరచి హిందూ మహాసముద్రాన్ని తన కంట్రోల్‌లో ఉంచుకునే వ్యూహం)లో ఒక అతి కీలకమైన పోర్టు చిట్టగాంగ్ చైనా ఆధీనంలోకి వెళుతుంది. తద్వారా చైనాకు బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలోకి నేపాల్ నుంచి ప్రవేశం లభిస్తుంది. మౌలిక సదుపాయాలు అంతగా అభివృద్ధి చెందని బంగ్లాదేశ్‌లో దాదాపు 50కి పైగా మౌలిక అవస్థాపన ప్రాజెక్టులను ఇప్పటికే చైనా చేపట్టింది. బంగ్లాదేశ్‌లో 30 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టింది. ఆ దేశ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో సైతం భారీగా పెట్టుబడులు పెట్టిన చైనా.. బంగ్లాదేశ్ ఆర్థికవ్యవస్థను, రాజకీయాలను తన నియంత్రణలో ఉంచే ప్రణాళిక రచించింది.

(మిగతా మంగళవారం దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

- ప్రపంచ వాణిజ్యంలో అతిపెద్ద ఎగుమతిదారు చైనా. ఏటా 3.59 ట్రిలియన్ డాలర్ల ఎగుమతులు చేస్తోంది. పైగా అమెరికాను అధిగమించి అన్నిరంగాల్లో అగ్రరాజ్యంగా నిలవాలన్న కాంక్ష చైనాకు ఎప్పటినుంచో ఉంది. అందుకోసం ప్రపంచ కీలక రవాణా మార్గాలను చైనా కేంద్రీకృతంగా అభివృద్ధి చేస్తూ... వ్యూహాత్మక ప్రదేశాల్లో తన సైనిక మోహరింపు ద్వారా ప్రపంచ వాణిజ్యాన్ని, రాజకీయాలను ఏకకాలంలో ఏలాలన్న బహుముఖ వ్యూహానికి 'బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్‌ఐ)' ద్వారా తెర లేపింది.
- బీఆర్‌ఐ అంటే చైనాను ఖండాంతర్గత మార్గం(రోడ్డు/రైల్) ద్వారా ఆగ్నేయాసియా, దక్షిణాసియా, మధ్య ఆసియా, రష్యా, యూరప్‌లతో; సముద్ర మార్గం ద్వారా చైనా తీర ప్రాంతాలను దక్షిణ పసిఫిక్, ఆగ్నేయ, దక్షిణాసియా, మధ్యప్రాశ్చ్య(మిడిల్ ఈస్ట్), తూర్పు ఆఫ్రికా ప్రాంతాలతో అనుసంధానించే బృహత్తర రవాణా నెట్‌వర్క్. ఆయా ప్రాంతాల్లోని వివిధ దేశాల భూభాగాలు, సముద్ర జలాల ద్వారా అనుసంధానమయ్యే ఈ ప్రాజెక్టు కోసం చైనా అనేక దేశాలతో విస్తృత సంప్రదింపులు జరుపుతోంది. ఈ బీఆర్‌ఐ ప్రాజెక్టులో అత్యంత కీలక ప్రాంతం హిందూ మహాసముద్రం. ఈ సముద్ర మార్గాలపై పట్టు సాధించడం ద్వారా చైనా వాణిజ్య సుస్థిరతకు, భద్రతకు భరోసా ఏర్పడుతుంది. ఈ ప్రాజెక్టు చాటున భారత సరిహద్దు దేశాల్లో మాటువేసి భారత్ చుట్టూ తన సైనిక వలయం పన్నడం కూడా చైనా అంతర్లీన వ్యూహం. దీనికోసం భారత్ పొరుగు దేశాలకు ధారాళంగా అప్పులిచ్చి తన అప్పుల ఉచ్చులోకి చైనా లాగుతోంది. ఆయుధాల సరఫరా వంటి విభిన్న వ్యూహాలను చైనా అనుసరిస్తోంది.

---

# సెల్ సైన్స్ సంస్థలో పీహెచ్‌డీ

పుణెలోని నేషనల్ సెంటర్ ఫర్ సెల్ సైన్స్(ఎన్‌సీసీఎస్)-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌లో ప్రధానాంశం 'మోడరన్ బయాలజీ'. ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఎంపికైన అభ్యర్థులు కోర్సు పూర్తయ్యేవరకూ క్యాంపస్‌లోనే ఉండాలి. ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ విధానంలో హాస్టల్ సౌకర్యం కల్పిస్తారు.



**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ/స్ట్రక్చరల్ బయాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/సిస్టమ్స్ బయాలజీ/న్యూరోసైన్స్/ఇమ్యూనాలజీ/ఇన్ఫెక్షన్ బయాలజీ/ క్యాన్సర్ బయాలజీ/మైక్రోబయల్ ఎకాలజీ స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. జూలై నాటికి ఎమ్మెస్సీ డిగ్రీ చేతికందే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ(కేటగిరీ 1)/ఐసీఎంఆర్/బీఐఎన్‌సీ/డీఎస్‌టీ ఇన్‌స్పైర్ నుంచి వ్యాలిడ్ ఫెలోషిప్ ఉండాలి. ఎన్‌సీబీఎస్/టీఐఎఫ్ఆర్ నిర్వహించిన జేజీఈఈబీఐఎల్ఎస్ 2023 డిసెంబరు ఎగ్జామ్‌లో అర్హత పొందినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ లెక్చరర్‌షిప్/డీబీటీ(కేటగిరీ 2) అర్హత ఉన్నవారు, ఐసీఎంఆర్ ప్రాజెక్టు లిస్ట్‌లో ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 10
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** మే 20న
- **మొదటి రౌండ్ ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** జూన్ 3 నుంచి 5 వరకు
- **మొదటి రౌండ్ ఇంటర్వ్యూ ఫలితాలు విడుదల:** జూన్ 5
- **ఫైనల్ రౌండ్ ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** జూన్ 6, 7
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 14
- **ఇంటరాక్షన్:** జూలై 22 నుంచి ఆగస్టు 1 వరకు
- **వెబ్‌సైట్:** nccs.res.in

# నిట్ జలంధర్‌లో ఎంబీఏ



జలంధర్‌లోని డా.బీ.ఆర్ అంబేద్కర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్ - ఎంబీఏ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 38 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**స్పెషలైజేషన్‌లు:** ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. క్యాట్/సీమ్యాట్/మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. ఈ స్కోర్ ఆధారంగానే అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

**వెయిటేజీ:** జాతీయ పరీక్ష స్కోర్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 15 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **జాతీయ పరీక్ష స్కోర్ ద్వారా స్క్రీనింగ్ చేసిన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 22
- **గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 25
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** మే 25
- **కౌన్సెలింగ్ తేదీ:** మే 26
- **వెబ్‌సైట్:** www.nitj.ac.in

# ఐహెచ్ఎంలో డిప్లొమా

హాజీపూర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్ఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వైవా, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. దేశవ్యాప్తంగా ఉన్న స్టార్ హోటళ్లలో ఏడాది పాటు ఇంటెన్సివ్ ట్రెయినింగ్, ఆర్నెల్లపాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటాయి.

**విభాగాలు-సీట్లు:** ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ విభాగాలు ఉన్నాయి. ఒక్కోదానిలో 56 సీట్లు ఉన్నాయి. ప్రతి విభాగంలో జనరల్ అభ్యర్థులకు 26, ఓబీసీలకు 15, ఎస్సీలకు 8, ఎస్టీలకు 4, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 3 సీట్లు ప్రత్యేకించారు.

**అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు(స్టేట్/సెంట్రల్) నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్ ఖరీదు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.250; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150; వీటిని పోస్ట్ ద్వారా తెప్పించుకోవాలంటే రూ.50లు అదనంగా చెల్లించాలి.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మే 31
- **వైవాకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 10
- **వైవా తేదీ:** ఫుడ్ ప్రొడక్షన్ విభాగానికి జూన్ 24న; ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ విభాగానికి జూన్ 25
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** జూన్ 26
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** జూన్ 27 నుంచి జూలై 5 వరకు; జూలై 9 నుంచి 12 వరకు
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **చిరునామా:** ప్రిన్సిపాల్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లయిడ్ న్యూట్రిషన్, రామాశీష్ చౌక్, హాజీపూర్, వైశాలీ-844102
- **వెబ్‌సైట్:** ihmhajipur.net

# ఎన్ఐఏబీలో ట్రెయినింగ్ ప్రోగ్రామ్

హైదరాబాద్, గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ(ఎన్ఐఏబీ) - పీజీ అభ్యర్థుల కోసం ప్రాజెక్ట్ వర్క్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ఈ ట్రెయినింగ్ ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. సంస్థకు చెందిన సైంటిస్టుల ఆధ్వర్యంలో ట్రెయినింగ్ ఉంటుంది. ఈ ప్రోగ్రామ్ జూలై 1న ప్రారంభమౌతుంది. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి లైఫ్ సైన్సెస్ విభాగాల్లో ఎమ్మెస్సీ, ఎంవీఎస్సీ, ఎంఫార్మసీ, ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ రెండో ఏడాది చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ మొదటి ఏడాది చదువుతున్నవారు; డిగ్రీ, పీజీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **ట్రెయినింగ్ ప్రోగ్రామ్ ఫీజు:** రూ.25,000
- **ప్రోగ్రామ్ వ్యవధి:** జూలై 1 నుంచి డిసెంబరు 31 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **వెబ్‌సైట్:** www.niab.org.in




---



# ఆవుల ధైర్యం


ఒక ఊరిలో మూడు ఆవులుండేవి. అవన్నీ స్నేహితులు. అడవికి వెళ్లినా నీళ్లు తాగటానికి వెళ్లినా కలిసి వెళ్లేవి. కుంటల్లో, కొలనుల్లో ఎక్కువ సమయం గడిపేవి. మూడింటికి దూడలున్నాయి. ఒక రోజు అడవిలో గడ్డి మేస్తున్న ఆవుల దగ్గరకు ఒక ఎలుగుబంటి పరిగెత్తుకొచ్చింది. 'నాలుగు పులులు వస్తున్నాయి. పరిగెత్తండి' అంటూ అరిచింది. ఆవులు పరిగెత్తపోయినపుడు క్షణాల్లో నాలుగు పులులు చుట్టుముట్టాయి. ఆవులు భయపడలేదు. పైగా కొమ్ములు రువ్వాయి. 'ఆవులు సాధు జంతువులు అనుకున్నా. ఇవేంటీ కొమ్ములు రువ్వుతున్నాయి' అంటూ చెట్టుమీద కోతి అరిచింది. 'ఈ ఆవులు గతంలో సింహాలనే వెంబడించి చంపాయి' అంటూ ఓ చిలుక చిటారుకొమ్మపైన జామపండు పొడుస్తూ గట్టిగా చెప్పింది. వీటితో కొట్లాడితే మా ప్రాణాలకు ఎక్కడ ఇబ్బంది వస్తుందోనని పులులు భయపడ్డాయి.



మూడు ఆవులూ లోపల భయంగా ఉన్నాయి. కానీ బయటికి ధైర్యాన్ని చూపించాయి. ఒక ఆవు ఇలా అంది. 'మనం ఇంటికి వెళ్లాలి. మన పిల్లలు ఎదురు చూస్తుంటారు' అన్నది. ఆవులు ఇంటికి బయలుదేరాయి. ఒక పులికి ఇగో దెబ్బతింది. ఒక్క ఉదుటున ఆవుమీదకు ఎగిరింది. ఆ ఆవు కొమ్ములతో ఎత్తివేసింది. కడుపు దగ్గర కొమ్ములు తగిలి పులి బిక్కచచ్చి పడిపోయింది. ఈ అడవిలో మాకంటే బలవంతులు ఆవులేమో అనుకుని పులులన్నీ వెనక్కి తగ్గాయి.




## సరైన నీడ ఏది?



## 10 తేడాలు గుర్తించండి



## దారి కనుక్కోండి



## డైలీ సుడోకు - 299

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | | | 7 | | | 9 | | |
| | | 8 | | | | | 1 | |
| | | 9 | | 8 | 6 | | | |
| 3 | | | | | 1 | 8 | | 4 |
| | | | | | | | | |
| 1 | | 4 | 9 | | | | | 7 |
| | | | 3 | 7 | | 5 | | |
| | 2 | | | | | 6 | | |
| | | 7 | | | 5 | | | 1 |

### సుడోకు - 298 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 8 | 9 | 6 | 1 | 3 | 7 | 2 | 4 |
| 7 | 2 | 1 | 9 | 4 | 8 | 5 | 6 | 3 |
| 4 | 3 | 6 | 7 | 5 | 2 | 8 | 9 | 1 |
| 1 | 5 | 2 | 3 | 7 | 6 | 4 | 8 | 9 |
| 6 | 4 | 8 | 1 | 2 | 9 | 3 | 5 | 7 |
| 3 | 9 | 7 | 4 | 8 | 5 | 6 | 1 | 2 |
| 9 | 1 | 4 | 8 | 6 | 7 | 2 | 3 | 5 |
| 8 | 7 | 5 | 2 | 3 | 1 | 9 | 4 | 6 |
| 2 | 6 | 3 | 5 | 9 | 4 | 1 | 7 | 8 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.